శుక్రవారం 9-8-2019


‘ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.’

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 139

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




**మార్కెట్లకు ‘ఎఫ్‌పీఐ’ల జోష్!**
637 పాయింట్లు పెరిగి 37,327 వద్ద ముగిసిన సెన్సెక్స్ - బిజినెస్‌లో



**క్రికెట్‌కు ఆమ్లా వీడ్కోలు**
రిటైర్మెంట్ ప్రకటించిన దక్షిణాఫ్రికా దిగ్గజం -స్పోర్ట్స్‌లో

# కశ్మీర్‌లో నవశకం

## మళ్లీ భూతల స్వర్గం చేద్దాం

- జమ్మూకశ్మీర్‌పై దేశ ప్రజలకు ప్రధాని మోదీ పిలుపు
- ఆర్టికల్ 370 వల్ల ఉగ్రవాదం, వేర్పాటువాదం, అవినీతి ప్రబలాయి
- ఉగ్రవాదాన్ని విస్తరించేందుకు పాక్‌కు ఈ నిబంధన ఉపయోగపడింది
- దానివల్ల రాష్ట్ర ప్రజలకు ఎలాంటి ప్రయోజనం కలగలేదు
- దేశమంతా అమలయ్యే సంక్షేమ చట్టాలు ఇక్కడ అమలు కాకపోయేవి
- స్థానిక యువత విద్య, ఉద్యోగావకాశాలకు, అభివృద్ధికి దూరమయ్యారు
- ఆర్టికల్ 370 రద్దు చారిత్రక నిర్ణయం.. ఇకపై దేశంతోపాటు అభివృద్ధిపథంలో కశ్మీర్ పయనిస్తుంది
- శాంతియుత, సురక్షిత, సమృద్ధ కశ్మీర్ మన లక్ష్యం
- స్టూడియోల ఏర్పాటుకు బాలీవుడ్, తెలుగు సినీ పరిశ్రమకు విజ్ఞప్తి

5 లో



ఆర్టికల్ 370 రద్దుతో జమ్మూకశ్మీర్‌లో కొత్త యుగం ప్రారంభమైంది. జమ్మూ, కశ్మీర్, లదాఖ్‌లలో ఖాళీగా ఉన్న అన్ని ఉద్యోగాలను భర్తీ చేస్తాం. ఐఐటీ, ఐఐఎంలాంటి ప్రతిష్టాత్మక సంస్థలను ఏర్పాటు చేస్తాం. మౌలిక వసతుల కల్పన ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన చేపడతాం.

జమ్మూకశ్మీర్‌లో త్వరలోనే అసెంబ్లీ ఎన్నికలు జరగాలి. కొత్త ప్రభుత్వం ఏర్పడాలి. ఉత్సాహవంతులైన యువత ఎమ్మెల్యేలు, మంత్రులు, సీఎం కావాలి. ఇకపై ఎన్నికలు పారదర్శకంగా జరుగుతాయి. వంశ పాలనకు ఇక చరమగీతమే. మీ (స్థానికుల) నుంచే ప్రజాప్రతినిధులు వస్తారు.

# మానవ మృగానికి ఉరిశిక్ష

**9 నెలల చిన్నారిపై హత్యాచారం కేసులో వరంగల్ జిల్లా కోర్టు తీర్పు**

- 20 రోజుల్లో చార్జిషీట్.. నేర నిరూపణ
- 48 రోజుల్లోనే విచారణ పూర్తి.. జడ్జి తీర్పు
- జూన్ 18 రాత్రి తల్లి పొత్తిళ్ల నుంచి పసికందు అపహరణ.. హత్యాచారం
- నిందితుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించిన బంధువులు, స్థానికులు
- ఐపీసీలోని పలు సెక్షన్లతోపాటు పోక్సో చట్టం కిందా కేసులు నమోదు
- విచారణలో పోలీసుల తీరును ప్రశంసించిన డీజీపీ, కేటీఆర్



**సాక్షి ప్రతినిధి, వరంగల్/వరంగల్ లీగల్, సాక్షి హైదరాబాద్:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం కలిగించిన 9నెలల చిన్నారిపై అత్యాచారం, హత్య ఘటనలో కామాంధుడు, ఉన్మాది ప్రవీణ్‌కు ఉరిశిక్ష పడింది. ఈ కేసులో విచారణ జరిపిన వరంగల్ జిల్లా కోర్టు న్యాయమూర్తి.. కామోన్మాదికి ఉరిశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఘటన జరిగిన 48 రోజుల్లో విచారణ పూర్తయి.. తీర్పు వెలువడడంతో కేసు విచారణ, ఆధారాల సేకరణలో వరంగల్ పోలీసుల కృషి ఫలించినట్లయింది. ఈ కేసులో నిందితుడైన పోలెపాక ప్రవీణ్ అలియాస్ పవన్ గత జూన్ 18న రాత్రి తల్లి పొత్తిళ్లలో పడుకున్న పసిపాపను ఎత్తుకెళ్లి అత్యాచారం చేసి హతమార్చినట్లు హన్మకొండ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇందుకు సంబంధించి గత నెల 24 ప్రారంభమైన విచారణ ఈనెల 2న ముగిసింది. పోలీసులు సవాల్‌గా తీసుకొని 20 రోజుల్లోనే కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో మొత్తం 51 మంది సాక్షుల్లో అవసరమున్న 30 మందిని కోర్టులో హాజరుపరిచారు. ప్రవీణ్‌ను దోషిగా నిర్ధారించిన వరంగల్ జిల్లా అదనపు కోర్టు న్యాయమూర్తి కె.జయకుమార్ ఆయనకు ఉరిశిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు.

**ఆరోజు అసలేం జరిగింది?**

రాష్ట్రంలో దిగ్భ్రాంతి కలిగించిన చిన్నారి అత్యాచారం, హత్య కేసు విచారణకు సంబంధించి.. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మోకిల సత్యానారాయణగౌడ్ వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్ ఇబ్రహీంపట్నంలో విద్యాభారతి ఇంజనీరింగ్ కళాశాలలో పనిచేసే కామోజు జంగయ్య–రచన దంపతులు తమ 9 నెలల కూతురు

మిగతా 2వ పేజీలో ▶

## ‘సంఝౌతా’ నిలిపివేత



జమ్మూకశ్మీర్ విషయంలో భారత్‌పై కోపంతో రగిలిపోతున్న పాకిస్తాన్ మరోసారి తన వక్రబుద్ధిని చూపించుకుంది. ఢిల్లీ–లాహోర్‌ల మధ్య రాకపోకలు సాగించే ‘సంఝౌతా ఎక్స్‌ప్రెస్’ రైలును గురువారం వాఘా సరిహద్దు వద్ద నిలిపివేసింది.

5 లో



## వరద విషాదం.. 43 మంది మృతి

- ఒక్క మహారాష్ట్రలోనే 27 మంది మృతి
- కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఒడిశాల్లో 16 మంది..

- వివరాలు 5లో



## జన్మస్థలాన్ని వ్యక్తిగా ఎలా పరిగణించాలి?

అయోధ్యలో రామజన్మస్థలంగా భావిస్తున్న ప్రాంతాన్ని వ్యక్తిగా భావించి కక్షిదారుగా ఎలా పరిగణిస్తాం. దేవుని విగ్రహాలకైతే ఆస్తులు ఉండటంతో చట్టపరంగా వాటిని వ్యక్తులుగా భావిస్తాం.. మరి జన్మస్థలాలను ఎలా పరిగణనలోకి తీసుకుంటాం?

**రామ్‌లల్లా విరాజ్‌మాన్ సంస్థకు సుప్రీం ప్రశ్న**

5 లో






# జెట్ స్పీడ్‌తో ‘పాలమూరు’

**కాళేశ్వరం ఎత్తిపోతల తరహాలో యుద్ధప్రాతిపదికన ప్రాజెక్టు పనులు**

- ఉన్నతస్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశం
- వచ్చే ఏడాది ఖరీఫ్‌కల్లా ఆయకట్టుకు నీరివ్వాలని స్పష్టీకరణ
- పంప్‌హౌస్, రిజర్వాయర్, కాల్వల పనులు సమాంతరంగా చేపట్టాలని సూచన
- ఎత్తిపోతల పథకాల కింద వరద నీటితో ఆయకట్టుకు నీరిస్తూనే చెరువులు నింపాలని సూచన
- ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులపై ఇంజనీర్లతో 6 గంటలపాటు భేటీ
- త్వరలోనే ప్రాజెక్టు పరిధిలో పర్యటిస్తానని వెల్లడి

**సాక్షి, హైదరాబాద్:** అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని పూర్తి చేసిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం మాదిరే పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పనులను కూడా యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు ఇంజనీర్లను ఆదేశించారు. ప్రాజెక్టు పనులకు ప్రధాన అవరోధంగా ఉన్న నిధుల సమస్యను అధిగమించిన దృష్ట్యా పనులను జెట్ స్పీడ్‌తో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌తో రూ. 10 వేల కోట్ల రుణాలు వస్తున్న నేపథ్యంలో పంప్‌హౌస్ పనులతో పాటు రిజర్వాయర్లు, కాల్వలు, విద్యుత్ సబ్‌స్టేషన్ల పనులన్నీ సమాంతరంగా జరగాలని మార్గదర్శనం చేశారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుతోపాటు పూర్వ జిల్లాలోని భీమా, నెట్టెంపాడు, కోయిల్ సాగర్, కల్వకుర్తి, తుమ్మిళ్ల పనులపై సీఎం కేసీఆర్ గురువారం ప్రగతి భవన్‌లో ఇంజనీర్లతో సుమారు 6 గంటలపాటు సమీక్షించారు. ప్రాజెక్టుల పరిధిలో నెలకొన్న



సమస్యలు, వాటిని అధిగమించే చర్యలు, ప్రాజెక్టుల పూర్తి, వాటి నుంచి నీటి విడుదల తదితర అంశాలపై క్షుణ్నంగా చర్చించారు. ఈ భేటీకి జిల్లా మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, ప్రిన్సిపల్ సెక్రటరీ సోమేశ్ కుమార్, ఈఎన్‌సీ మురళీధర్, సీఈ ఖగేందర్, రమేశ్, ఎస్ఈలు అంజయ్య, మనోహర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా

మిగతా 4వ పేజీలో ▶

‘ఎన్‌ఎంసీ’తో 50% సీట్ల ఫీజుపై కాలేజీలదే తుది నిర్ణయం



# అంగట్లో సీట్లు

**సాక్షి, హైదరాబాద్:** నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) చట్టంపై జూనియర్ డాక్టర్ల ఆందోళనలు ఉధృతమయ్యాయి. దేశవ్యాప్తంగా డాక్టర్లు ఆందోళన చేస్తుండగానే.. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఈ బిల్లుకు ఆమోదం తెలిపారు. దీంతో 1956 నాటి మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) స్థానంలో, నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) అమల్లోకి వచ్చింది. డాక్టర్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న సెక్షన్లకు సవరణలు చేయకుండానే బిల్లు చట్ట రూపం దాల్చింది. ఈ చట్టంలో ప్రతిపాదించిన కమ్యూనిటీ హెల్త్ ప్రొవైడర్స్, కమిషన్‌లో డాక్టర్లకు బదులు నాన్–డాక్టర్లకు అవకాశం కల్పించడం.. రాష్ట్రాలకు ప్రాతినిధ్యం కల్పించకపోవడం, ప్రైవేటు కాలేజీల్లోని 50% సీట్ల ఫీజులను యాజమాన్యాలకే కట్టబెట్టడం వంటి అంశాలను డాక్టర్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

**2017లోనూ బిల్లుపై వ్యతిరేకత:** ఎన్‌ఎంసీ బిల్లును తొలిసారి 2017 డిసెంబర్‌లో లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) సహా దేశవ్యాప్తంగా

- ఎంబీబీఎస్ విద్యార్థులకు శిరోభారంగా ‘ఎగ్జిట్’
- దేశవ్యాప్తంగా జూడాల నిరసనలు
- కమ్యూనిటీ హెల్త్ ప్రొవైడర్లుగా ‘నాన్–డాక్టర్స్’పై ఆగ్రహం
- కమిషన్‌లోనూ డాక్టరేతరులదే పెత్తనమని ఆందోళన
- బిల్లును ఆమోదిస్తూ గురువారం రాష్ట్రపతి ఉత్తర్వులు

డాక్టర్లు ఈ బిల్లును వ్యతిరేకించడంతో సెలెక్ట్ కమిటీకి పంపించారు. 16వ లోక్‌సభ రద్దు అవడంతో ఈ బిల్లు మురిగిపోయింది. కేంద్ర మంత్రి హర్షవర్ధన్ లోక్‌సభలో దీన్ని ప్రవేశపెట్టారు. తాజాగా చట్టంగా మారడంతో ప్రైవేటు మెడికల్ కాలేజీల్లోని 50% సీట్ల ఫీజులనే ప్రభుత్వం నియంత్రిస్తుంది. మిగతా 50% సీట్ల ఫీజుల

మిగతా 2వ పేజీలో ▶

## నేడే చివరి రోజు

- చరిత్రగా మారనున్న రాష్ట్ర సచివాలయ భవనాలు
- తక్షణమే కార్యాలయాలు తరలించాలని సీఎం ఆదేశం
- శ్రావణ శుక్రవారం రోజే తరలివెళ్లనున్న సీఎస్, ఇతర కార్యదర్శులు
- మంగళవారం నుంచి బీఆర్‌కేఆర్ భవన్‌లో కార్యకలాపాలు
- ఫైళ్లు, సామగ్రి తరలింపు తర్వాత భవనాల కూల్చివేత

- వివరాలు 2లో

## కరీంనగర్, ఖమ్మంలలో వైద్య కాలేజీలు!

- తెలంగాణ అభ్యర్థనపై కేంద్రం సానుకూలం
- మంత్రి ఈటల రాజేందర్ వెల్లడి
- కేంద్ర మంత్రులు హర్షవర్ధన్, అశ్వనీకుమార్ చౌబేలతో భేటీ
- వైద్యరంగంలో పలు పథకాలకు సాయం చేయాలని కోరినట్టు వెల్లడి

- వివరాలు 2లో









## ఇదండీ సంగతి



ప్రజలేమనుకుంటే మనకేంటి సార్! ప్రతిపక్షాలేమనుకుంటున్నాయో తెలుసుకున్నాం!

# ఉమ్మడి పాలమూరుకు ముంపు ముప్పు!

- భయం గుప్పిట్లో కృష్ణా పరీవాహక గ్రామాలు
- ఇప్పటికే నీట మునిగిన సుమారు వంద ఎకరాలు
- మరో 48 గంటల్లో ఉగ్రరూపం దాల్చనున్న భీమా
- 15 గ్రామాలకు ముంపు భయం
- రెండు గ్రామాల్లో ప్రమాద హెచ్చరికలు జారీ
- పరిస్థితిపై ఆరా తీస్తున్న నారాయణపేట కలెక్టర్, ఎస్పీ

4 లో



పక్క చిత్రంలో ఉన్న వ్యక్తి నారాయణపేట జిల్లా కృష్ణ మండలం వాసునగర్ గ్రామానికి చెందిన పుట్టి జిందప్ప (80). కృష్ణానదికి రెండు కిలోమీటర్ల దూరంలోనే ఇతనికి 50 ఎకరాల పొలం ఉంది. ఎగువన కర్ణాటకలో కురిసిన వర్షాలతో నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి భారీగా నీటిని విడుదల చేయడంతో కృష్ణానది దిగువ ప్రాంతమైన కృష్ణ మండలం వైపు వరద పోటెత్తింది. దీంతో జిందప్పకు చెందిన 15 ఎకరాల పొలం నీట మునిగింది. మరో 15 ఎకరాలు పక్కరైతుల భూమి మునిగిపోయింది. వరద పెరగడంతో నీట మునిగిన పొలాల్ని చూస్తూ.. రాబోయే నష్టాన్ని తలచుకుకుంటూ జిందప్ప ఇలా దిగాలుగా నిల్చున్నాడు. ముంపు గురించి అధికారులు గ్రామంలో డప్పు చాటింపు చేసి.. ఆ గ్రామంలో ఉన్న వందకు పైగా మందిని సురక్షిత ప్రాంతానికి తరలించినా జిందప్ప మాత్రం ఎక్కడికీ వెళ్లనని తన పొలంలోనే ఉండిపోయాడు. 2009లోనూ ఉగ్రరూపం దాల్చిన కృష్ణానది జిందప్పకు చెందిన 50 ఎకరాలను ఇలానే ముంచెత్తింది. అప్పుడు కూడా ఊరును వదలని జిందప్ప తన ఇంటి పైకప్పు ఎక్కి కూర్చున్నాడు. అప్పట్లో వరదల్లో చిక్కుకున్న జిందప్పను అధికారులు ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా సురక్షిత ప్రాంతానికి తరలించారు. మళ్లీ ఇప్పుడు కూడా అదే పరిస్థితి వస్తుందని.. తన 50 ఎకరాల పొలం.. ఇళ్లు నీట మునగడం ఖాయమని జిందప్ప చెమ్మగిల్లిన కళ్లతో ఆవేదన వ్యక్తం చేశాడు.

## క్లుప్తంగా...

### ఆ వీఆర్‌ఏల సమాచారం పంపండి: సీసీఎల్‌ఏ

సాక్షి, హైదరాబాద్: దొడ్డిదారిన నియమితులైన గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్‌ఏ) పూర్తి సమాచారాన్ని తక్షణమే పంపాలని రాష్ట్ర భూ పరిపాలనా ప్రధాన కమిషనర్ కార్యాలయం (సీసీఎల్‌ఏ) కలెక్టర్లను ఆదేశించింది. నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత సమయంలో నియమితులైన వారి వివరాలను నిర్దేశిత నమూనాలో సమర్పించాలని ఆదేశించినా.. అరకొర వివరాలతో పంపడాన్ని తీవ్రంగా పరిగణించిన సీసీఎల్‌ఏ, పూర్తి వివరాలను ఈ నెల 13వ తేదీలోగా అందజేయాలని స్పష్టం చేసింది. ఈ మేరకు సీసీఎల్‌ఏ సహాయ కార్యదర్శి హైమావతి కలెక్టర్లకు లేఖ రాశారు.

### సమస్యలను పరిష్కరించండి: జాక్టో

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (జాక్టో) ఆరోపించింది. అంతర్‌జిల్లా బదిలీలు, ఉపాధ్యాయుల పదోన్నతులను వెంటనే చేపట్టాలని సర్కార్‌ను కోరింది. దీనిపై ఈనెల 20న అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన ర్యాలీలు, సమావేశాలు నిర్వహించడంతో పాటు ఆయా జిల్లా కలెక్టర్లకు విజ్ఞాపన పత్రాలు సమర్పించాలని సూచించింది. సెప్టెంబర్ 1న ఉపాధ్యాయ గర్జన జరపాలని నిర్ణయించిన సంఘ నాయకులు ఈ మేరకు గురువారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, విద్యాశాఖ మంత్రి, కార్యదర్శికి ఉద్యమ నోటీసు ప్రతులను అందజేశారు.

### ఎర్రమంజిల్ వివాదం తర్వాతే సచివాలయం

సాక్షి, హైదరాబాద్: ఎర్రమంజిల్ భవనాన్ని కూల్చొద్దని దాఖలైన పిటిషన్ల వివాదాన్ని పరిష్కరించిన తర్వాతే సచివాయల భవనాలపై దాఖలైన రిట్లను విచారిస్తామని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు గురువారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. సచివాలయ భవనాలను కూల్చరాదని దాఖలైన పిటిషన్లను అత్యవసరంగా విచారించాలని న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ కోరడంతో ధర్మాసనం పైవిధంగా తెలిపింది.

### వెబ్‌సైట్‌లో హాల్‌టిక్కెట్లు

సాక్షి, హైదరాబాద్: గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో 2019–20 బ్యాచ్ ప్రవేశాలకు సంబంధించి ఈనెల 11న అర్హత పరీక్ష నిర్వహిస్తున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల హాల్‌టిక్కెట్లను వెబ్‌సైట్‌లో పెట్టామని, **studycircle.cgg.gov.in/tstw, braou.ac.in** వెబ్‌సైట్‌ల నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొంది. పరీక్ష కేంద్రాన్ని ముందురోజే పరిశీలించుకోవాలని సూచించింది.

### ఇంటర్ ప్రవేశాల గడువు పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియట్‌లో రెండో దశ ప్రవేశాల గడువును ఈనెల 16 వరకు పొడిగిస్తున్నట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లు పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు తమ కాలేజీల్లో చేరేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

### 10 శాతం రిజర్వేషన్లు అమలయ్యేలా చూడండి

సాక్షి, హైదరాబాద్: అగ్రవర్ణ పేదలకు కేంద్ర ప్రభుత్వం కల్పించిన 10 శాతం రిజర్వేషన్లు రాష్ట్రంలో అమలయ్యేలా చూడాలని బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర శాఖ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఆ సమితి నేతలు వల్లూరి పవన్ కుమార్, గంగు ఉపేంద్రశర్మ, రామకృష్ణ, గట్టు శ్రీనివాసాచార్యులు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును కలిసి వినతి పత్రం సమర్పించారు. కొన్ని కుల సంఘాలు ఈ రిజర్వేషన్లు అమలు కాకుండా అడ్డుకుంటున్నాయని, దీంతో విద్యార్థులు ఆ రిజర్వేషన్ల ఫలాలు పొందలేక పోతున్నారని తెలిపారు.

### సంయుక్త పార్లమెంటరీ కమిటీలో విజయసాయిరెడ్డి, కేకే

సాక్షి, న్యూఢిల్లీ: లాభదాయక పదవుల అంశంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీకి రాజ్యసభ నుంచి ఐదుగురు సభ్యులు పోటీ లేకుండా ఎన్నికయ్యారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి, టీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కె.కేశవరావు, బీజేపీ ఎంపీ మహేష్ పోద్దార్, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ డోలా సేన్, బీజేడీ ఎంపీ సస్మిత్ పాత్ర ఎన్నికైన వారిలో ఉన్నారు.

### ఆకునూరి మురళికి పదోన్నతి

సాక్షి, హైదరాబాద్: స్వచ్ఛంద పదవీ విరమణకు అనుమతి కోరుతూ దరఖాస్తు చేసుకోవడం ద్వారా వార్తల్లో నిలిచిన ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళికి ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. ఆయన స్థాయిని సెలక్షన్ గ్రేడ్ స్కేల్‌కు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం స్టేట్ ఆర్కైవ్స్ శాఖ డైరెక్టర్ జనరల్‌గా పనిచేస్తున్న మురళి ఈ నెల 31న వీఆర్‌ఎస్ తీసుకోవడానికి అనుమతి కోరిన విషయం తెలిసిందే. ఆయన దరఖాస్తు ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉంది.

# కరీంనగర్, ఖమ్మంలలో వైద్య కాలేజీలు!

- తెలంగాణ అభ్యర్థనపై కేంద్రం సానుకూలం
- మంత్రి ఈటల రాజేందర్ వెల్లడి
- కేంద్ర మంత్రులు హర్షవర్ధన్, అశ్వనీకుమార్ చౌబేలతో భేటీ
- వైద్యరంగంలో పలు పథకాలకు సాయం చేయాలని కోరాం

సాక్షి, న్యూఢిల్లీ: కరీంనగర్, ఖమ్మం జిల్లా కేంద్రాల్లో వైద్య కళాశాలల ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరగా కేంద్రం సానుకూలంగా స్పందించిందని తెలంగాణ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. గురువారం ఢిల్లీలో కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్, సహాయ మంత్రి అశ్వనీకుమార్ చౌబేలతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం తెలంగాణ భవన్‌లో ఈటల విలేకరులతో మాట్లాడారు. వైద్యరంగంలో తెలంగాణ పథకాలపై హర్షవర్ధన్‌కు సంపూర్ణ అవగాహన ఉందని చెప్పారు. తెలంగాణ వైద్యరంగంలో కొత్త సంస్కరణలకు, పథకాలకు కేంద్ర సహకారం, సాయం కావాలని కోరగా.. సంపూర్ణ సహకారం ఇస్తామని హామీ ఇచ్చారని వెల్లడించారు. ''కాకతీయ మెడికల్ కాలేజ్‌లో సూపర్ స్పెషాలిటీ బ్లాకు, ఆదిలాబాద్‌లో మరో సూపర్ స్పెషాలిటీ బ్లాక్ నిర్మాణం జరుగుతోంది. వీటికి నిధులివ్వాలని కోరాం. గాంధీ ఆసుపత్రి, నీలోఫర్ ఆసుపత్రుల్లో కూడా సూపర్ స్పెషాలిటీ బ్లాకుల ఏర్పాటుకు సాయం చేయాలని విజ్ఞప్తి చేశాం. తెలంగాణలో ప్రస్తుతం 9 మెడికల్ కాలేజీలు ఉన్నాయి. కరీంనగర్, ఖమ్మం జిల్లా కేంద్రాల్లో వైద్య కళాశాలలకు అనుమతి ఇవ్వాలని అడిగాం. వీలైనంత త్వరగా వాటిని ఏర్పాటు చేస్తామని చెప్పాం. వాటికి అనుమతి ఇవ్వడానికి మంత్రి సానుకూలంగా స్పందించారు'' అని ఈటల వెల్లడించారు.

#### ఆర్థిక ప్రోత్సాహమివ్వాలని కోరాం

కేంద్ర ప్రభుత్వం కంటే ముందే పలు ఆదర్శ పథకాలు అమలు చేస్తున్నందున ఆర్థికంగా ప్రోత్సాహం అందించాలని కేంద్ర మంత్రికి విన్నవించినట్టు మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు.



గురువారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి ఈటల రాజేందర్

కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో జిల్లా ఆస్పత్రులను అప్‌గ్రేడ్ చేసుకోవాల్సిన అవసరం ఉన్నందున కేంద్ర పథకం కింద ప్రత్యేక నిధులు ఇవ్వాలని కోరినట్టు చెప్పారు. ''రాష్ట్రంలో 40 డయాలసిస్ కేంద్రాలు ఉన్నాయి. మరిన్ని కేంద్రాలు పెంచేందుకు సహాయం కోరాం. ఐసీయూ సెంటర్లను పెంచేందుకు సాయం చేయాలని అడిగాం. జాతీయ రహదారులపై ట్రామా కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశాం. ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిన కేసీఆర్ కిట్, ఆరోగ్యశ్రీ పథకాలకు ఇతోధికంగా సాయం చేయడం ద్వారా ప్రోత్సహించాలని విన్నవించాం'' అని వెల్లడించారు. హైదరాబాద్‌లో బస్తీ దవాఖానాలతో పట్టణ పేదలకు వైద్యం అందిస్తున్నామని, గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య కేంద్రాలను వెల్‌నెస్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేస్తున్నామని, వాటికి కూడా సాయం చేయాలని కోరినట్టు చెప్పారు. అలాగే అనంతగిరి కొండల్లో ఆయుష్ విభాగం పరిధిలో ఆయుర్వేదం, యునానీ, హోమియోపతి, నేచురల్ కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని విన్నవించినట్టు పేర్కొన్నారు. పేదలకు వైద్యం అందించే విషయంలో తెలంగాణలో చాలా గొప్పగా పనిచేస్తున్నారని హర్షవర్ధన్, అశ్వనీకుమార్ చౌబే ప్రశంసించారని ఈటల తెలిపారు.

### ఎన్‌ఎంసీ బిల్లుపై స్పష్టత అడిగాం

నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) బిల్లు విషయంలో దేశవ్యాప్తంగా డాక్టర్లకు ఆందోళన ఉందని మంత్రి ఈటల పేర్కొన్నారు. పీజీ సీట్లు వచ్చేంత వరకు సంబంధిత ప్రవేశ పరీక్ష నిర్వహించాల్సిన అవసరం ఉందని, దీనిపై స్పష్టత ఇవ్వాలని అడిగినట్టు తెలిపారు. ''ఈ విషయంలో విద్యార్థుల భవిష్యత్ పట్ల సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలని కోరాం. అయితే నూతన చట్టంతో ఎవరికీ అన్యాయం జరగదని వారు బదులిచ్చారు''అని వివరించారు. ఆయుష్మాన్ భారత్ పథకాన్ని తెలంగాణలో అమలు చేయాలని కేంద్రం లేఖలు రాసిన సంగతి ప్రస్తావించగా.. ''85 లక్షల బీపీఎల్ కుటుంబాలకు ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేస్తున్నాం. ఆయుష్మాన్ భారత్ అమలు కొందరికే వర్తిస్తుంది. కేంద్ర పథకం కంటే మా పథకం మెరుగ్గా ఉంది''అని ఆయన బదులిచ్చారు. మంత్రి ఈటల వెంట రాజ్యసభ సభ్యులు బండ ప్రకాష్ ముదిరాజ్, బడుగుల లింగయ్య యాదవ్ ఉన్నారు.

# మానవ మృగానికి ఉరిశిక్ష

మొదటి పేజీ తరువాయి

శ్రీహితను తీసుకొని హన్మకొండ కుమార్‌పల్లిలో ఉన్న శ్రీహిత అమ్మమ్మ ఇంటికి వచ్చారు. 18 జూన్ 2019న రాత్రి భోజనాలు చేసిన తర్వాత పడుకోవడానికి బంగ్లాపైకి వెళ్లారు. అందరూ నిద్రిస్తున్న సమయంలో కుమార్‌పల్లిలో నివసిస్తున్న శాయంపేట మండలం వసంతపురం గ్రామానికి చెందిన పోలెపాక ప్రవీణ్.. కుమార్‌పల్లిలో ఉన్న జంపాల భరత్ కుమార్, రాజు (శ్రీహిత మేనమామలు)ల ఇల్లు గేటు వేసి ఉండటం చూసి దూకి లోపలకు వెళ్లాడు. ఇంటి తలుపులు వేసి ఉండగా మేడపైకి వెళ్లడానికి తలుపులు తీసి ఉన్నాయి. పైకి వెళ్లి చూడగా అందరూ గాఢనిద్రలో ఉన్నారు. అక్కడ కనిపించిన రెండు సెల్‌ఫోన్లు దొంగలించాక మద్యం మత్తులో అతనికి నిద్రిస్తున్న మహిళలను అనుభవించాలని అలోచన వచ్చింది. కానీ భయం వేసి కాసేపు నిలబడిపోయాడు. అప్పుడు అమ్మ పక్కన నిద్రిస్తున్న చిన్నారి పాపపై కన్ను పడిన కామాంధుడు, తన కోరిక తీర్చుకోవడానికి ఆ పాపను తీసుకొని కిందకు వచ్చాడు. పక్క వీధిలో చీకట్లో ఎవ్వరూ లేని నిర్జీవ ప్రదేశానికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. నొప్పి భరించలేక చిన్నారి కేకలు వేయడం తో ఎవ్వరైనా వస్తారేమోనని భయపడ్డ కామాంధుడు అభం శుభం తెలియని పసిపాప నోరు, ముక్కు మూసేశాడు. దీంతో ఊపిరాడక పాప మృతి చెందింది. పాప మరణించిందని నిర్ధారించుకున్న నిందితుడు ప్రవీణ్ శవాన్ని ఎక్కడైనా పడేద్దామని నిర్ణయించుకొని బట్టల్లో చుట్టుకొని భుజంపై వేసుకొని రోడ్డుపైకి వచ్చాడు. అదే సమయంలో ముగ్గురు, నలుగురు తనవైపు వస్తున్నారని గుర్తించిన ప్రవీణ్ పాపను అక్కడే పడేసి పారిపోవడానికి యత్నించగా చిన్నారి శ్రీహిత మేనమామ భరత్ కుమార్ ఇతర బంధువులు, వీధిలోని యువకులు వచ్చి నిందితుడిని పట్టుకు న్నారు. అప్పటికే అక్కడికి వచ్చిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకోగా, చిన్నారి తల్లి రచన పాపను తీసుకొని హన్మకొండ మ్యాక్స్ కేర్ హాస్పిటల్‌కు వెళ్లింది. వైద్యులు చిన్నారిని పరిశీలించి మృతిచెందిందని నిర్ధారించారు. దీంతో శ్రీహిత మేమమామ భరత్ కుమార్ ఫిర్యాదు మేరకు హన్మకొండ పోలీసులు ప్రవీణ్‌పై ఐపీసీ సెక్షన్ 449, 379, 376, 376 (ఏ–బీ) పోక్సో చట్టంలోని 5, 6 సెక్షన్లు.. ఐపీసీ సెక్షన్ 302 హత్యా నేరం కింద కేసు నమోదు చేశారు. విచారణలో 51 మంది సాక్షులకుగానూ 30 మంది సాక్షులను విచారించిన కోర్టు.. నేరం రుజువు కావడంతో వివిధ సెక్షన్ల క్రింద రెండేళ్ల నుండి యావజ్జీవ కారాగార శిక్ష వరకు విధిస్తూ రూ.5వేల జరిమానా విధించింది. అలాగే, ఐపీసీ సెక్షన్ 302 హత్యా నేరం కింద మరణించే వరకు ఉరి తీయాలని జడ్జి జయకుమార్ సంచలన తీర్పు వెల్లడించారు.



తీర్పు ఇచ్చిన న్యాయమూర్తి జయకుమార్

#### 48 రోజుల్లో వెలువడిన తీర్పు

నగరం నడిబొడ్డున పసికందుపైన జరిగిన అమానుష ఘటనలో.. సంచలనాత్మకంగా నేరం జరిగిన 48 రోజుల్లో నేరస్తుడికి ఉరిశిక్ష విధిస్తూ మొదటి అదనపు జిల్లా కోర్టు జడ్జి జయకుమార్ తీర్పు ఇచ్చారు. బాధిత కుటుంబానికి న్యాయం జరగాలని, నిందితుడికి ఉరిశిక్ష విధించాలని ప్రజాసంఘాలు విద్యార్థులు, మహిళలు తెలుగు రాష్ట్రాల్లో రోడ్లపైకి వచ్చి నినదించారు. వీరి ఆకాంక్షలకు అనుగుణంగా తీర్పు రావడం.. మరీ ముఖ్యంగా తక్కువ సమయంలో విచారణ జరిపడంపై ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. 18 జూన్ 2019న అర్ధరాత్రి నేరం జరగ్గానే కేసు నమోదు చేసిన పోలీసులు.. ఎలాంటి ఆలస్యం చేయకుండా పోలీసు కమిషనర్ విశ్వనాథ రవీందర్ పర్యవేక్షణలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని.. అన్ని కోణాల నుండి సాక్ష్యాధారాలు సేకరించారు. పకడ్బందీగా 27 రోజుల్లో (11 జూలై 2019న) కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. పోక్సో కేసుల విచారణ ప్రత్యేక కోర్టు కూడా అయిన మొదటి అదనపు జిల్లా కోర్టు జడ్జి జయకుమార్ విచారణ వేగవంతం చేయాలనే సంకల్పంతో జూలై 24, 25, 30, 31తో పాటు ఆగస్టు 1, 2 తేదీల్లో సాక్షులను విచారించారు. ఆగస్టు 6న మంగళవారం రోజు వాదనలను విన్న న్యాయమూర్తి గురువారం తీర్పు వెల్లడించారు.



తీర్పు అనంతరం కోర్టు నుంచి బయటకు వస్తున్న చిన్నారి శ్రీహిత తల్లిదండ్రులు

#### 15 సంవత్సరాల తర్వాత 'ఉరి'

వరంగల్ జిల్లా కోర్టు చరిత్రలో 15 వసంతాలు ముగిసిన అనంతరం ఒకరికి ఉరిశిక్ష విధిస్తూ తీర్పు వచ్చింది. గతంలో 2004లో స్టేషన్‌ఘన్‌పూర్ పోలీసుస్టేషన్‌లో నమోదైన హత్యానేరం కేసులో నాటి మూడో అదనపు జిల్లా కోర్టు జడ్జి మోహన్‌గాంధీ.. నిందితుడికి ఉరిశిక్ష విధించారు. మళ్లీ 15 ఏళ్లతర్వాత చిన్నారి శ్రీహితపై అత్యాచారం చేసి హత్య చేసిన నేరస్తుడు పోలెపాక ప్రవీణ్‌కు ఉరిశిక్ష విధిస్తూ జడ్జి జయకుమార్ తీర్పునిచ్చారు. 2004 కేసులో సుప్రీం కోర్టు ఉరిశిక్షను యావజ్జీవ కారాగార శిక్షగా అప్పీల్‌తో మార్పు చేసింది. దీనికి ముందు నర్సంపేటలో జరిగిన హత్య కేసులో సైతం విధించిన ఉరిశిక్షను యావజ్జీవ కారాగార శిక్షగా అత్యున్నత న్యాయస్థానం ధృవీకరించింది.

#### వరంగల్ పోలీస్ శభాష్!

9నెలల పసికందుపై లైంగిక దాడి, హత్య కేసులో నిందితుడికి న్యాయస్థానం ఉరిశిక్ష విధించటడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. తెలంగాణ చరిత్రలోనే అత్యంత తక్కువ సమయంలో విచారణ పూర్తి చేసుకున్న కేసుగా ఇది రికార్డుల కెక్కింది. ఘటన జరిగిన 50 రోజుల్లోనే నిందితుడికి ఉరిశిక్ష పడటం, ఒక విశేషమయితే, విచారణ మొదలెట్టిన 21 రోజుల్లోనే పూర్తవడం చరిత్రాత్మకమని న్యాయనిపుణులంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపిన ఈ కేసు విచారణను అత్యంతవేగంగా పూర్తి చేసిన వరంగల్ పోలీసులపై అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. టీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా పోలీసులను అభినందించారు. ఈ కేసులో నిందితుడికి మరణశిక్ష వేయడాన్ని స్వాగతించారు. కేసు విచారణలో, ఆధారాల సేకరణ, న్యాయస్థానంలో విచారణ వరకు వ్యూహాత్మకంగా వ్యవహరించిన వరంగల్ సీపీ రవీందర్, దర్యాప్తు అధికారులను డీజీపీ మహేందర్‌రెడ్డి అభినందించారు. న్యాయస్థానం తీర్పును ఆయన స్వాగతించారు. విమెన్‌సేఫ్టీ వింగ్ ఐజీ స్వాతి లక్రా (లా అండ్ ఆర్డర్) బాధిత కుటుంబానికి న్యాయం జరిగిందన్నారు.

### ఆహ్వానించదగిన తీర్పు



పసిపాపపై పాశవికంగా అత్యాచారం, హత్యకు పాల్పడిన నేరస్తునికి ఉరిశిక్ష పడటం ఆహ్వానించదగ్గ తీర్పు. స్త్రీలపై రోజు రోజుకూ పెరుగుతున్న అత్యాచారాల నియంత్రణకు ఇలాంటి తీర్పులు దోహదపడతాయి. తెలంగాణలో ముఖ్యంగా.. వరంగల్‌లో పోక్సో చట్టం క్రింద ఉరిశిక్ష పడిన మొదటి కేసును ప్రాసిక్యూషన్ పక్షాన నేను వాదించినందుకు ఆనందంగా ఉంది. మరీ ముఖ్యంగా తీర్పు వెల్లడించిన తర్వాత న్యాయవాదులు, మహిళల్లో కనిపించిన సానుకూలత నన్నెంతో ఉత్తేజితుడిని చేసింది. బాధిత కుటుంబాలు ధైర్యంగా ముందుకు వచ్చి సాక్ష్యం చెబితే నేరస్తులకు శిక్ష పడే అవకాశాలు మెండుగా ఉంటాయి.

– మోకిల సత్యనారాయణగౌడ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్

### నేరం చేయలేదు.. మద్యం మత్తులో ఉన్నానంతే!

తాను మద్యం మత్తులో ఉన్నానని.. అంతకు మించి ఎలాంటి నేరమూ చేయలేదని నిందితుడు ప్రవీణ్ కోర్టు ముందు కన్నీరు కారుస్తూ చెప్పాడు. శిక్ష విధించే ముందు జడ్జి జయకుమార్.. నిందితుడిపై ప్రాసిక్యూషన్ నమోదు చేసిన నేరారోపణలు చెప్పి.. అవన్నీ నువ్వు చేసినట్లు నిర్ధారణ అయ్యాయని చెప్పారు. దీనిపై ప్రవీణ్ మాట్లాడుతూ.. తాను తప్పు చేయలేదన్నాడు. అంతకు 2 రోజుల ముందు జరిగిన విచారణలో ముద్దాయి తరపున కోర్టు నియమించిన న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ ప్రాసిక్యూషన్ వారు సత్వరమే విచారణ ముగించాలనే ఉద్దేశంతో తప్పుడు నేరారోపణలు చేస్తున్నారని, కల్పిత సాక్ష్యాలతో నిందితుడిపై నేర నిరూపణకు పూనుకుంటున్నారని అన్నారు. కాగా, వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ నిందితుడి పక్షాన న్యాయవాదులు ఎవరూ వాదించకూడదని నిర్ణయించడంతో నిష్పక్షపాత విచారణ నిమిత్తం కోర్టు నిందితుడి పక్షాన న్యాయవాదిని నియమించిన విషయం తెలిసిందే. కాగా, శ్రీహిత మేనమామ జంపాల రాజ్‌కుమార్ ఇంటిముందున్న సీసీటీవీ ఫుటేజీ.. ఈ కేసు విచారణలో కీలకంగా మారిన నేపథ్యంలో ఆయన్ను న్యాయమూర్తి అభినందించారు. సీసీటీవీల ఏర్పాటుపై ప్రజల్లో చైతన్యం రావాలన్నారు.

### నేడే చివరి రోజు!

#### చరిత్రగా మారనున్న సచివాలయ భవనాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర సచివాలయ భవనాలు ఇక చరిత్ర పుటల్లోకి ఎక్కనున్నాయి. దశాబ్దాలుగా సేవలందించిన సెక్రటేరియట్ భవనాలు త్వరలోనే కాలగర్భంలో కలిసిపోనున్నాయి. వీటిలో చివరి పనిదినం శుక్రవారంతో ముగియనుంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి సహా వివిధ ప్రభుత్వశాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు బూర్గుల రామకృష్ణారావు(బీఆర్‌కేఆర్) భవన్‌కు తరలి వెళ్లనున్నారు. శ్రావణ శుక్రవారం మంచి రోజు కావడంతో ఆ రోజు నుంచే బీఆర్‌కేఆర్ భవన్‌లో కొత్త సచివాలయం కార్యకలాపాలు ప్రారంభం కావాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సచివాలయంలోని 80 శాతం ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం బీఆర్‌కేఆర్ భవన్‌లో స్థలం కేటాయించింది. ఆ భవనానికి అవసరమైన మరమ్మతులు నిర్వహించడంతో పాటు ఇంటర్నెట్, ల్యాన్, ఇంట్రానెట్ నెట్‌వర్క్ ఏర్పాటుకు కనీసం నెల రోజుల సమయం పట్టనుందని.. ఆ తర్వాతే సచివాలయం కార్యాలయాలను అక్కడికి తరలించాలని తొలుత అధికార యంత్రాంగం భావించింది. అయితే, ఇప్పటికే ఆలస్యమైందని.. మరమ్మతులు, సదుపాయాల పేరుతో ఇంకా కాలయాపన వద్దని ముఖ్యమంత్రి కేసీఆర్ హెచ్చరించినట్లు తెలిసింది. తక్షణమే బీఆర్‌కేఆర్ భవనానికి తరలి వెళ్లాలని, శుక్రవారం నుంచి అందరూ అక్కడి నుంచే కార్యకలాపాలు నిర్వహించాలని ఆయన తేల్చి చెప్పినట్లు అధికారవర్గాలు పేర్కొన్నాయి.శుక్రవారం తర్వాత రెండో శనివారం, ఆదివారం, సోమవారం బక్రీద్ పండుగ కావడంతో వరుసగా మూడు రోజుల సెలవులున్నాయి. ఈ నేపథ్యంలో సెలవుల తర్వాత మంగళవారం నుంచి సచివాలయ కార్యకలాపాలు బీఆర్‌కేఆర్ భవన్ నుంచే కొనసాగనున్నాయని అధికారవర్గాలు తెలిపాయి. సచివాలయంలోని ముఖ్యమంత్రి కార్యాలయాన్ని బేగంపేటలోని హైదరాబాద్ మెట్రో రైలు భవనానికి తరలించనున్నారు. వారం 10 రోజుల్లోగా సచివాలయంలోని ఫైళ్లు, ఇతర సామగ్రి తరలింపు ప్రక్రియను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు సమాచారం. సామగ్రి తరలింపు ముగిసిన వెంటనే ప్రస్తుత సచివాలయంలోని భవనాలన్నింటినీ కూల్చివేస్తారు.

# ..అంగట్లో సీట్లు

మొదటి పేజీ తరువాయి

నిర్ణయం కాలేజీ యాజమాన్యాలదే. దీంతో కాలేజీలు ఇష్టానికి ఫీజులు పెంచేసే అవకాశముందని, ప్రభుత్వ నియంత్రణ ఉన్నప్పుడే అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు కాలేజీలు, తాజా నిర్ణయంతో మరింతగా రెచ్చిపోయే ప్రమాదముందని డాక్టర్లు అంటున్నారు. ఈ బిల్లుతో పేద, మధ్యతరగతి స్టూడెంట్లకు వైద్య విద్య అందని ద్రాక్షగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రవేశ పరీక్షల్లో మెరిట్ సాధించకపోయినా, కోట్లలో ఫీజులు కట్టే సామర్థ్యం ఉన్న వాళ్లకు ఎంబీబీఎస్ సీట్లు దక్కుతాయని చెబుతున్నారు. ఈ బిల్లును వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా జూనియర్ డాక్టర్లు నిరసనలు చేపట్టారు. దీనికి తోడు ఈ బిల్లులో ప్రతిపాదించిన నేషనల్ ఎగ్జిట్ ఎగ్జామ్ (నెక్స్ట్)పై వైద్య విద్యార్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఒకే ఎగ్జామ్‌ను 3 రకాలుగా వినియోగించాలని కేంద్రం నిర్ణయించింది. ఎంబీబీఎస్ చివరి సంవత్సరం పరీక్షగా, దేశ, విదేశాల్లో చదివిన విద్యార్థులకు ఎగ్జిట్ ఎగ్జామ్‌గా, పీజీ ప్రవేశాలకు ఎంట్రన్స్ ఎగ్జామ్‌గా ఈ పరీక్షను నిర్వహించాలని భావిస్తున్నారు. అంటే, ఇకపై ఎంబీబీఎస్ విద్యార్థులు ఈ పరీక్ష పాసైతేనే డాక్టర్‌గా ప్రాక్టీస్ చేసేందుకు లైసెన్స్ ఇస్తారు. ఈ నేపథ్యంలోనే నెక్స్ట్‌ను ఎగ్జిట్ ఎగ్జామ్‌గా పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఈ తరహా ఎగ్జామ్ (ఫారెన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్ ఎగ్జామినేషన్–ఎఫ్‌ఎంజీఈ) విదేశాల్లో ఎంబీబీఎస్ చదివిన విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించేందుకు నిర్వహిస్తున్నారు. ఎఫ్‌ఎంజీఈ పాసైతేనే ప్రాక్టీస్ చేసేందుకు వీళ్లకు అనుమతినిస్తున్నారు. ఎంబీబీఎస్ తర్వాత ఏడాది పాటు అన్ని డిపార్ట్‌మెంట్లలో ఇంటర్న్‌షిప్ చేయాలి. ఇది ఓ రకంగా మెడిసిన్ ప్రాక్టీస్ చేయడమే. కానీ, ఎగ్జిట్ ఎగ్జామ్ పాస్ కాకుండా ప్రాక్టీస్ చేయడానికి అనుమతి ఇవ్వబోమని బిల్లులో పేర్కొన్నారు. దీంతో విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారు. ఎన్‌ఎంసీ అమల్లోకి వస్తే.. విదేశాల్లో చదివిన వాళ్లు కూడా ఎఫ్‌ఎంజీఈకి బదులు, నెక్స్ట్ ఎగ్జామ్ రాయాల్సి ఉంటుంది. ఇందులో పాసైతేనే ప్రాక్టీస్‌కు అర్హులవుతారు. అలాగే, ప్రస్తుతం పీజీ ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న నీట్ విధానాన్ని రద్దు చేసి, నెక్స్ట్‌లో సాధించిన మార్కుల ఆధారంగానే పీజీ సీట్లు కేటాయిస్తామని బిల్లులో ప్రతిపాదించారు. దీన్నే విద్యార్థులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ పార్ట్–2 ఎగ్జామ్స్‌కు బదులు నెక్స్ట్ ఎగ్జామ్ నిర్వహించాలని కేంద్రం భావిస్తోంది. ఫైనల్ ఇయర్ పార్ట్–2లో తొలుత థియరీ ఎగ్జామ్స్, తర్వాత ప్రాక్టికల్ ఎగ్జామ్స్ నిర్వహిస్తారు. అయితే, ప్రస్తుతం పీజీ ప్రవేశాలకు నిర్వహిస్తున్న నీట్‌లో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు మాత్రమే ఉంటాయి. దేశంలో ఇప్పటికే ఎంబీబీఎస్ పూర్తి చేసుకుని, పీజీ సీటు కోసం ప్రయత్నిస్తున్న డాక్టర్ల సంఖ్య లక్షకుపైగానే ఉంది. నెక్స్ట్ ఎగ్జామ్ రాయాలంటే వీళ్లంతా తిరిగి ఎంబీబీస్ సిలబస్ మొత్తం చదవాల్సి ఉంటుంది. ఒకసారి ఎంబీబీఎస్ పాసై వెళ్లిపోయాక, మళ్లీ అవే పరీక్షలు, ప్రాక్టికల్స్ రాయడమేంటని డాక్టర్లు ప్రశ్నిస్తున్నారు.

### కమిషన్‌లో నాన్–డాక్టర్స్

ప్రస్తుతం ఉన్న మెడికల్ కమిషన్ ఆఫ్ ఇండియా గవర్నింగ్ బాడీలో 80 శాతం మంది డాక్టర్లు ఉంటే, 20 శాతం మంది నాన్–డాక్టర్స్ ఉంటారు. కానీ, మెడికల్ కమిషన్‌లో 80 శాతం స్థానాల్లో నాన్–డాక్టర్స్‌ను కూడా నియమించుకునే అవకాశమిచ్చారు. అంతేకాదు, ఇంతకు ముందు ప్రతి రాష్ట్రానికి ఎంసీఐలో ప్రాతినిధ్యం కల్పించేవారు. ఇకపై ర్యాండమ్‌గా ఒక్కో సంవత్సరం ఒక్కో రాష్ట్రానికి అవకాశం కల్పించేలా ప్రతి పాదనలున్నాయి. ఇలా నాన్–డాక్టర్స్ కీలకంగా ఉండే కమిషన్‌లో రాజకీయ జోక్యం పెరుగుతుందని, ప్రైవేటు కాలేజీల యాజమాన్యాల చేతుల్లోకి వైద్య విద్య వ్యవస్థ వెళ్తుందని డాక్టర్లు ఆరోపిస్తున్నారు. ఇంతకుముందులాగే, 80 శాతం పోస్టులను డాక్టర్లకే కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు.

#### 'ఎగ్జిట్'పై గందరగోళం

ఫారెన్‌లో ఎంబీబీఎస్ చదువుకుని వస్తున్న వాళ్లకు స్క్రీనింగ్ (ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్ ఎగ్జామినేషన్) టెస్ట్ పెడుతున్నారు. ఇది పాసైతేనే వైద్యునిగా గుర్తింపునిస్తున్నారు. ఇకపై దేశంలో చదివే విద్యార్థులకూ ఇలాంటి ఓ పరీక్ష పెట్టాలని బిల్లులో ప్రతిపాదించారు. నేషనల్ ఎగ్జిట్ టెస్ట్ (నెక్స్ట్)గా దీనికి నామకరణం చేశారు. ఫారెన్‌లో చదివినవాళ్లతోపాటు, దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు ఈ పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. అంటే, ఇది పాసైతేనే డాక్టర్‌గా ప్రాక్టీస్ చేసేందుకు అర్హులవుతారు. దీన్ని వైద్య విద్యార్థులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అలాగే, నీట్ (పీజీ)కు బదులు నెక్స్ట్‌లో సాధించే ర్యాంకు ఆధారంగానే పీజీ సీట్ల భర్తీ చేపట్టనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం నీట్ మల్టిపుల్ చాయిస్ క్వశ్చన్స్ బేస్డ్‌గా నిర్వహిస్తున్నారు. నెక్స్ట్ మాత్రం థియరీ ఎగ్జామ్. ఒకసారి ఎంబీబీఎస్ పాసై వెళ్లిపోయిన తర్వాత, మళ్లీ ఎంబీబీఎస్ సిలబస్ అంతా చదివి థియరీ ఎగ్జామ్ రాయడం తలకుమించిన భారమని డాక్టర్లు చెబుతున్నారు. థియరీ పేపర్ల కరెక్షన్, మార్కుల కేటాయింపులో అక్రమాలకు ఆస్కారం ఎక్కువగా ఉంటుందన్నది డాక్టర్ల వాదన. దీంతో పీజీ ఎంట్రన్స్‌కు నీట్‌ను కొనసాగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

#### కమ్యూనిటీ హెల్త్ ప్రొవైడర్స్

ఎన్‌ఎంసీ బిల్లులోని సెక్షన్ 32లో కమ్యూనిటీ హెల్త్ ప్రొవైడర్స్ అనే క్లాజ్ ఉంది. మోడ్రన్ సైంటిఫిక్ మెడికల్ ప్రొఫెషన్‌తో ముడిపడి ఉన్న వ్యక్తులకు 'కమ్యూనిటీ హెల్త్ ప్రొవైడర్స్'గా 'లిమిటెడ్ లైసెన్స్'ఇవ్వొచ్చునని ఈ సెక్షన్‌లో ప్రతిపాదించారు. దీన్ని డాక్టర్లు వ్యతిరేకిస్తున్నారు. కమ్యూనిటీ హెల్త్ ప్రొవైడర్స్ పేరుతో స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులు, ఫిజియో థెరపిస్టులు తదితరులకు మోడ్రన్ మెడిసిన్ ప్రాక్టీస్ చేసే అవకాశం ఇచ్చే అవకాశముంది. ఎప్పటినుంచో ఈ డిమాండ్ ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ వైద్య సేవలు అందకపోవడం, నర్సులైతే గ్రామీణ స్థాయి వరకూ వెళ్తారన్న ఉద్దేశంతో కేంద్రం ఈ ప్రతిపాదన తీసుకొచ్చింది. అలాగే, బిల్లులోని సెక్షన్ 50, 51లో పరోక్షంగా బ్రిడ్జ్ కోర్సు ప్రతిపాదనలున్నాయి. దీని ఉద్దేశం ఆయుష్ గ్రాడ్యుయేట్లకు, డెంటల్ డాక్టర్లకు స్వల్పకాలిక మోడ్రన్ మెడిసిన్ కోర్సు నిర్వహించి, మోడ్రన్ మెడిసిన్ కూడా ప్రాక్టీస్ చేసుకునేందుకు అవకాశమివ్వడం. కొత్త ఎడ్యుకేషన్ పాలసీలోనూ ఈ మేరకు ప్రతిపాదనలున్నాయి. వీళ్లకు మోడ్రన్ మెడిసిన్ ప్రాక్టీస్ చేసేందుకు అవకాశమిస్తే, ప్రజారోగ్యం దెబ్బతింటుందని డాక్టర్లు చెబుతున్నారు. దీనిపై దేశవ్యాప్తంగా వైద్య విద్యార్థులు, జూనియర్ డాక్టర్లు గళమెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా, హైదరాబాద్ ధర్నాచౌక్‌లో గురువారం భారీ సంఖ్యలో ధర్నా నిర్వహించారు. దీనికి పలు రాజకీయ పార్టీల నాయకులు, సినీ ప్రముఖులు హాజరై సంఘీభావం తెలిపారు.

### భారీగా పెరగనున్న ఫీజులు

నేషనల్ మెడికల్ కమిషన్ చట్టంతో ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఫీజుల ధరలు భారీగా పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. బ్రిడ్జ్ కోర్సు, ఎగ్జిట్ ఎగ్జామ్, ఫీజుల నియంత్రణ ఎత్తివేయడం వంటి అనేక అంశాలు మెడిసిన్ స్టూడెంట్లకు, మెడిసిన్ చదవాలనుకుంటున్న విద్యార్థులకు నష్టాన్ని కలిగిస్తాయని డాక్టర్లు చెబుతున్నారు. ప్రస్తుతం ప్రైవేటు కాలేజీల్లోని మొత్తం సీట్ల ఫీజులను నియంత్రించే అధికారం ప్రభుత్వాలకు ఉంది. ఉదాహరణకు మన రాష్ట్రంలోని ప్రైవేటు కాలేజీల్లో 50% సీట్లను కన్వీనర్ కోటా.. మరో 35% బీ–కేటగిరీ, మిగతా 15% సీ–కేటగిరీగా విభజించి భర్తీ చేస్తున్నారు. ఒక్కో కేటగిరీ సీట్లకు ఒక్కోలా ఫీజు ఉంది. కాలేజీలు తమకు నచ్చినట్టు ఫీజులను పెంచుకున్నా.. వాటిని నియంత్రించే అధికారం ప్రభుత్వాలకు ఉంది. కోర్టులు పలుమార్లు కాలేజీ యాజమాన్యాలకు మొట్టికాయలు వేసి, పెంచిన ఫీజులను రద్దు చేశాయి. ఇప్పటికే ఈ అంశానికి సంబంధించి వందల కేసులు దేశవ్యాప్తంగా నడుస్తున్నాయి. ఎన్‌ఎంసీ చట్టంతో ప్రైవేటులోని 50% సీట్లపై ప్రభుత్వం నియంత్రణ కోల్పోనుంది. చాలా రాష్ట్రాల్లో బీ–కేటగిరీ సీటుకు కనీసం రూ.50 లక్షలు, సీ–కేటగిరీ సీటుకు కోటి రూపాయల వరకూ కాలేజీలకు చెల్లించాల్సి వస్తోంది. ఈ నియంత్రణ ఎత్తివేస్తే ఫీజులు రెండు, మూడింతలు పెరిగే ప్రమాదముంది. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షగా మారనుంది.

## క్లుప్తంగా...

### మేడారం జాతరకు రూ.200 కోట్లు ఇవ్వండి

**సీఎంకు ఎమ్మెల్యే సీతక్క లేఖ**



**సాక్షి, హైదరాబాద్:** మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరకు రూ. 200 కోట్లు కేటాయించాలని ములుగు ఎమ్మెల్యే సీతక్క కోరారు. ఈ మేరకు సీఎం కేసీఆర్‌కు గురువారం ఆమె లేఖ రాశారు. మేడారం జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటిస్తూ 1996లోనే ఉత్తర్వులు వచ్చినా, నిధుల కేటాయింపు మాత్రం సరిగా జరగడం లేదని అన్నారు. జాతరలో భక్తుల సౌకర్యార్థం చేపట్టాల్సిన కార్యక్రమాలు చాలా ఉన్నాయని, ఏటా జాతర సమయంలో కేటాయించే అరకొర నిధులతో భక్తులు అసౌకర్యాలకు లోనవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జాతర నిర్వహణకు అవసరమైన పనులన్నింటినీ విడివిడిగా లేఖలో పేర్కొన్నారు.

### ప్రజలకు మరింత చేరువగా విజయ పాలు: తలసాని



**సాక్షి, హైదరాబాద్:** విజయ పాలు, పాల ఉత్పత్తులను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు బ్యాటరీ వాహనాల ద్వారా అమ్మేందుకు చర్యలు తీసుకుంటున్నామని పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. గురువారం సచివాలయంలో విజయ ఉత్పత్తుల విక్రయానికి వినియోగించనున్న ఎలక్ట్రిక్ వాహనాన్ని ఆయన పరిశీలించారు. వాహన సామర్థ్యం, పనితీరు ను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పూర్తి బ్యాటరీ చార్జితో నడిచే ఈ వాహనం 6 నుంచి 8 గంటలు చార్జింగ్ పెడితే 90 కిలోమీటర్ల మైలేజీ వస్తుందని అధికారులు వివరించారు.

### నెహ్రూ వ్యక్తిత్వాన్ని హననం చేయాలని కుట్ర

**కాంగ్రెస్ విధేయుల ఫోరం విమర్శ**

**సాక్షి, హైదరాబాద్:** దేశ స్వాతంత్య్ర పోరాటంలో జీవితాన్ని పణంగా పెట్టిన నెహ్రూ లాంటి మహానేత వ్యక్తిత్వాన్ని హననం చేయాలన్నదే బీజేపీ కుట్ర అని కాంగ్రెస్ విధేయుల ఫోరం విమర్శించింది. బీజేపీ నేతలు నెహ్రూ, పటేల్‌ల మధ్య అంతరాన్ని సృష్టించి వారిని విడగొట్టి చూపే ప్రయత్నం చేయడాన్ని ఖండిస్తున్నామని ఫోరం నేతలు మర్రి శశిధర్‌రెడ్డి, సంభాని చంద్రశేఖర్, కోదండరెడ్డి, కమలాకర్ రావు, నాగయ్య, పి.వినయ్‌కుమార్, శ్యాంమోహన్, నిరంజన్‌లు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నెహ్రూ, పటేల్‌ల సమష్టి నిర్ణయాల వల్లే సంస్థానాలు విలీనమయ్యాయని, రాజకీయ స్వార్థం కోసం బీజేపీ కశ్మీర్ విషయంలో వారిని విడగొడుతోందని ఆరోపించారు.

### 'నెహ్రూ వైఖరిని తప్పుబట్టడం సరికాదు'



**సాక్షి, హైదరాబాద్:** కశ్మీర్‌పై మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వైఖరిని తప్పుబట్టడం సరికాదని సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి హితవు పలికారు. నెహ్రూ ఆరోజున కశ్మీర్‌ను భారత్‌లో కలిపి ఉండకపోతే ఈరోజున బీజేపీ ప్రభుత్వం ఆర్టికల్ 370ని రద్దు చేయగలిగేదా అని ప్రశ్నించారు. అప్పటి పరిస్థితులకు అనుగుణంగా నెహ్రూ వ్యవహరిస్తే, ఇప్పటి పరిస్థితుల మేరకు బీజేపీ వ్యవహరించిందని చెప్పారు. గురువారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాడు 370 ఆర్టికల్ ద్వారా కశ్మీర్‌ను కలుపుకోకపోతే పాకిస్తాన్‌తో యుద్ధం చేసి కశ్మీర్ తెచ్చుకునే వాళ్లమా అని ప్రశ్నించారు. నెహ్రూ స్వాతంత్య్రం కోసం జైల్లో ఉన్నారని, ఆయన ఆస్తులను ధారాదత్తం చేశారని, దేశభక్తి విషయంలో ఆయన్ను శంకించాల్సిన అవసరం లేదని చెప్పారు.

### ఓబీసీ తీర్మానాలు కేంద్ర, రాష్ట్రాలకు పంపుతాం

**జాజుల శ్రీనివాస్‌గౌడ్**



**సాక్షి, హైదరాబాద్:** ఓబీసీ మహాసభలో చేసిన 15 తీర్మానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపుతామని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్‌లో జరిగిన సభ విజయవంతం కావడంతో దేశవ్యాప్తంగా సభలు, సమావేశాలు నిర్వహిస్తామన్నారు. బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు సాగుతామని వెల్లడించారు. ఈ తీర్మానాలను దేశంలోని అన్ని రాజకీయ పార్టీల నేతలకు అందజేసి వాటిని అమలు చేయాలని డిమాండ్ చేస్తామని తెలిపారు.

### 'టూరిజం ఉద్యోగులకు సరైన వేతనమివ్వాలి'

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర టూరిజం కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించి, గతంలో ఇచ్చిన సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని సీపీఐ కార్యదర్శి చాడ వెంకటరెడ్డి సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన గురువారం సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. ఇరవై ఏళ్లకు పైగా టూరిజం కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అమలుకావడం లేదని లేఖలో పేర్కొన్నారు.

# మేడారం జాతరకు శాశ్వత ఏర్పాట్లు

**తొలిదశ భూ సేకరణకు రూ.10 కోట్లు**
- సచివాలయంలో సన్నాహక సమావేశం
- పాల్గొన్న మంత్రులు ఇంద్రకరణ్, కొప్పుల, ఎర్రబెల్లి
- జాతీయ పండుగగా ప్రకటించాలని కేంద్రానికి విజ్ఞప్తి
- మేడారం జాతరకు అంతర్జాతీయ గుర్తింపు

**సాక్షి, హైదరాబాద్:** మేడారం సమ్మక్క–సారక్క జాతరకు శాశ్వత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా భూసేకరణకు కసరత్తు చేస్తోంది. దేవాదాయ, అటవీ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో గురువారం సచివాలయంలో మేడారం జాతర–2020 సన్నాహక సమావేశం జరిగింది. జాతర నిర్వహణపై ఆయా శాఖల అధికారులకు మంత్రులు పలు సూచనలు చేశారు. జాతరకు అంతర్జాతీయ గుర్తింపు ఉందని అన్నారు. దీనిని జాతీయ పండుగగా ప్రకటించాలని కేంద్రాన్ని కోరారు. జాతరకు కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రితోపాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న గిరిజన సంఘాల ప్రతినిధులు, ప్రముఖులను ఆహ్వానిస్తున్నట్లు మంత్రులు చెప్పారు. సమ్మక్క–సారక్క గద్దెల పరిసరాల్లో భూసేకరణకు తొలి విడతగా రూ.10 కోట్లు కేటాయిస్తున్నట్లు మంత్రులు తెలిపారు. ఈ నిధులను భూ సేకరణ, శాశ్వత ఏర్పాట్లకు వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు.

**ఆదివాసీల సూచనలకు అనుగుణంగా..**

ఆదివాసీలు, అక్కడి పూజారుల సూచనలకు అనుగుణంగా జాతర నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకుగాను ఎప్పటికప్పుడు మేడారం పూజారులు, గిరిజన సంఘాల ప్రతినిధులతో సంప్రదింపులు జరిపే బాధ్యతలను ములుగు కలెక్టర్‌కు, ఏటూరునాగారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి మంత్రులు అప్పగించారు. 'మన రాష్ట్రంతోపాటు ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా, మధ్యప్రదేశ్ నుంచి భక్తులు ఇక్కడికి వస్తారు. సీఎం కేసీఆర్‌కు మేడారం ఇష్టమైన జాతర. భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించాలి. ప్రతిసారీ కొత్తగా పనులు చేపట్టడం కాకుండా శాశ్వత నిర్మాణాలుండాలని సీఎం ఆదేశించారు. గద్దెలు, పరిసరాల్లో శాశ్వత నిర్మాణాల కోసం భూములను సేకరించాలని సూచించారు. దశలవారీగా శాశ్వత నిర్మాణాలు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి. భక్తుల వసతులకు, ఆర్టీసీ సేవలకు, పోలీసు సిబ్బందికి శాశ్వత నిర్మాణాలు ఉండాలి. వీటి కోసం ప్రణాళిక రూపొందించాలి'అని మంత్రులు పేర్కొన్నారు.



గురువారం సచివాలయంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి. చిత్రంలో మంత్రులు కొప్పుల, ఇంద్రకరణ్‌రెడ్డి

**1.40 కోట్లమంది భక్తులు రావొచ్చు**

ఈసారి జాతరకు దాదాపు 1.40 కోట్ల మంది భక్తులు రానున్నట్లు ప్రభుత్వం అంచనా వేసింది. భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు అన్ని శాఖలతో సమన్వయం చేసుకోవాలని మంత్రులు సూచించారు. 'పక్కాగా క్యూలైన్లు, పారిశుధ్యం, తాగునీటి సరఫరాకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు జరగాలి. మిషన్ భగీరథ నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలి. జాతరకు కావాల్సిన అన్ని అంశాలపై సమగ్ర నివేదికను తయారు చేయాలి. వచ్చే నెలలో మరోసారి సమావేశమై ప్రతిపాదనలను ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సమర్పిద్దాం. అటవీ సంపదకు నష్టం జరగొద్దు. కాలుష్యం లేని, ప్లాస్టిక్ రహిత జాతర కోసం ప్రజలకు, భక్తులకు అవగాహన కల్పించాలి. ఆదివాసీలు, అక్కడి పూజారుల సూచనలకు ప్రాధాన్యతనివ్వాలి. మేడారం జాతర కమిటీని ఏర్పాటు చేయాలి. మేడారం అనుబంధ జాతరలను ఎంపిక చేసి వాటికి ప్రభుత్వపరంగా సహకారం అందించాలి. మేడారం జాతర గొప్పదనాన్ని అందరికీ తెలియజేసేలా హైదరాబాద్, వరంగల్ నగరాల్లో డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటు చేయాలి'అని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ వాసుదేవరెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి మహేశ్‌దత్ ఎక్కా, దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, ములుగు జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, పంచాయతీరాజ్ శాఖ ఈఎన్‌సీ సత్యనారాయణరెడ్డి, ఐటీడీఏ పీవో చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ దుకాణం బంద్

- అంపశయ్యపై ఉన్న ఆ పార్టీ నుంచి అందరూ బయటికి వచ్చేవారే..
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్



**సాక్షి, హైదరాబాద్:** కాంగ్రెస్ నేతలకు దిక్కుతోచక ఎవరు ఏమి మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదని, రాష్ట్రంలో కాంగ్రెస్ పరిస్థితి ఖేల్ ఖతం దుకాణం బంద్‌లా మారిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అంపశయ్యపై ఉన్న కాంగ్రెస్ నుంచి బయటకు వెళ్లేవారే తప్ప వచ్చే వారు ఎవరూ లేరని పేర్కొన్నారు. మిలిటరీలో పనిచేసిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కశ్మీర్ విషయంలో దేశభక్తిని చూపించాల్సింది పోయి మతిలేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. తెలంగాణ బిల్లు పెట్టినప్పుడు గందరగోళం చేసింది కాంగ్రెస్ ఎంపీలు కాదా? పెప్పర్ స్ప్రే ఏ పార్టీ ఎంపీ పని అని ప్రశ్నించారు.

**బీజేపీనే ప్రత్యామ్నాయం**

బీజేపీకి తెలంగాణ నుంచి ఒక్క ఎంపీ లేకున్నా తమ పార్టీ ఎంపీలు ఏకగ్రీవంగా మద్దతిచ్చారని లక్ష్మణ్ చెప్పారు. బీజేపీ మద్దతు లేకుంటే తెలంగాణ వచ్చేదా.. అని ఉత్తమ్‌ని ప్రశ్నించారు. జమ్మూ కశ్మీర్ విషయంలో రాద్ధాంతం చేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అస్త్ర సన్యాసం చేసిందని, అధికార పార్టీపై పోరాడలేక పోతోందన్నారు. రాష్ట్రంలో బీజేపీ ప్రత్యామ్నాయని ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. సెప్టెంబర్ 17ను బీజేపీ ఘనంగా నిర్వహిస్తుందన్నారు. ఢిల్లీ లో కూడా కార్యక్రమం, ఎగ్జిబిషన్ నిర్వహణకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఇటు ప్రజల్లోకి వెళ్లేందుకు యాత్ర నిర్వహణకు ప్లాన్ చేస్తున్నామన్నారు.

**ఉద్యోగులే కర్రుకాల్చి వాతలు పెడతారు..**

సభ్యత్వ గడువును ఈ నెల 20వ తేదీ వరకు పార్టీ పొడిగించిందని, అమిత్ షా పెట్టిన టార్గెట్‌ను చేరుకుంటామని లక్ష్మణ్ చెప్పారు. సెక్రటేరియట్‌ను కూలగొట్టడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. కేసీఆర్ ఉద్యోగులను ముప్పుతిప్పలు పెడుతున్నారని ఆరోపించారు. ఏదో ఒక రోజు ఉద్యోగులే కర్రు కాల్చి వాతలు పెడతారని చెప్పారు. వాజ్‌పేయి స్మారకానికి స్థలం ఇస్తామని చెప్పిన కేసీఆర్ ఇప్పటివరకు ఇవ్వలేదని, సుష్మాస్వరాజ్ కోసం ఇస్తారని అనుకోవడం లేదన్నారు. సుష్మాస్వరాజ్ లేకుంటే తెలంగాణ వచ్చేదే కాదన్నారు.

### బీజేపీలోకే వివేక్!

**బీజేపీ ముఖ్య నేత వెల్లడి..**

**సాక్షి, హైదరాబాద్:** మాజీ ఎంపీ జి.వివేక్ బీజేపీలో చేరేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఇటీవల ఆయన అటు బీజేపీ ముఖ్య నేతలను, ఇటు కాంగ్రెస్ నేతలతో సమావేశం కావడంతో బీజేపీలో చేరతారా? కాంగ్రెస్‌లో చేరతారా? అన్న గందరగోళం నెలకొంది. ఈ పరిస్థితుల్లో కూడా ఆయన ఏ పార్టీలో చేరే విషయాన్ని వెల్లడించలేదు. అయితే ఆయన బీజేపీలో చేరేందుకు సుముఖత వ్యక్తం చేశారని బీజేపీ ముఖ్య నేత ఒకరు పేర్కొన్నారు. ఇటీవల టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని వివేక్ కలవడం చర్చనీయాంశంగా మారిం ది. దానికి తెరదించుతూ వివేక్ బీజేపీలో త్వరలో చేరుతారని బీజేపీ ముఖ్యనేత వెల్లడించారు. వచ్చే నెలలో పార్టీ అధ్యక్షుడు అమిత్‌షాను హైదరాబాద్‌కు రావాలని రాష్ట్ర పార్టీ కోరుతోంది. ఒకవేళ అమిత్‌షా కనుక వస్తే ఆయన సమక్షంలోనే వివేక్ బీజేపీలో చేరుతారని వివరించారు. మరోవైపు కోమటిరెడ్డి రాజ గోపాల్‌రెడ్డి చేరిక సాంకేతిక కారణాలతో ఆగిపోయిందన్నారు. కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి కూడా తమ పార్టీలోకి రావాల్సిన వారేనని, దారి తప్పి అటు వెళ్లారని వ్యాఖ్యానించడం గమనార్హం.

# జెట్ స్పీడ్‌తో 'పాలమూరు'

▶ మొదటి పేజీ తరువాయి

పథకం కింద ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 18 ప్యాకేజీల్లో జరుగుతున్న పనులపై అధికారులు వివరణ ఇచ్చారు. నార్లాపూర్, ఏదుల, వట్టెం, కరివెన, ఉదండాపూర్ రిజర్వాయర్లతోపాటు ఆయా అప్రోచ్ కాల్వలు, టన్నెళ్ల నిర్మాణాలు సాగుతున్న తీరును వివరించారు. ఏదుల పనులు 90 శాతం మేర పూర్తవగా నార్లాపూర్, కరివెన పనులు 55 శాతం దాటాయని, వట్టెం రిజర్వాయర్ పనులు 30 శాతం వరకు పూర్తవగా, ఉదండాపూర్ పనులు ఇప్పుడిప్పుడే సాగుతున్నాయని తెలిపారు. అప్రోచ్ కాల్వల పనులు 70 శాతం వరకు పూర్తయ్యాయని, వట్టెం, ఉదండాపూర్ రిజర్వాయర్ల కింద భూసేకరణ పూర్తయితే తప్ప పనులు ముందుకు సాగే పరిస్థితి లేదని వివరించారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ రిజర్వాయర్ల పనుల్లో అప్రమత్తత పాటించాలని, పెద్ద రిజర్వాయర్లు కావడం వల్ల ఎలాంటి నాణ్యతా లోపాలున్నా ఇబ్బందులు తలెత్తుతాయని, ప్రాజెక్టు ఇంజనీర్లు, ఏజెన్సీలు, క్వాలిటీ కంట్రోల్ ఇంజనీర్లు పూర్తి అప్రమత్తతతో పని చేయాలని ఇంజనీర్లను ఆదేశించారు. టన్నెల్ పనుల భద్రత విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలని, అన్ని రక్షణ ఏర్పాట్లతోనే పనులు జరిపేలా సిబ్బందికి సూచించాలని ఆదేశించారు. వచ్చే ఏడాది ఖరీఫ్ నాటికి ప్రాజెక్టు పనులు పూర్తి చేసి జిల్లాలో పాక్షికంగా ఆయకట్టుకు నీరిచ్చేలా పనులు జరగాలన్నారు. ప్రాజెక్టుల నిర్మాణం కోసం సేకరించిన భూములకు సంబంధించిన పరిహారం వెంటనే చెల్లించాలని, అవసరమైన నిధులను వెంటనే విడుదల చేయాలని ఆర్థికశాఖ అధికారులను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆదేశించినట్లు తెలిసింది.

**వరద నీటితో పూర్తి ఆయకట్టుకు నీరు..**

కృష్ణా బేసిన్‌లో విస్తృత వర్షాలు కురుస్తున్నాయని, దీంతో మరో 20 రోజులు జూరాల, శ్రీశైలం ప్రాజెక్టులకు వరద కొనసాగే అవకాశం ఉంటుందని సీఎం కేసీఆర్ చెప్పినట్లు తెలిసింది. వచ్చిన వరదను వచ్చినట్లుగా ఒడిసిపడుతూ ఆయకట్టుకు తరలించాలని, గతేడాది మాదిరే ఈ ఏడాదీ చెరువులు నింపేందుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కల్వకుర్తి కింద 3.50 లక్షల ఎకరాలకు, మొత్తం ప్రాజెక్టు కింద 7.50 లక్షల ఎకరాలకు నీరిచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాలమూరు–రంగారెడ్డితోపాటు తుమ్మిళ్ల ఎత్తిపోతలను పరిశీలించేందుకు త్వరలోనే జిల్లాకు వస్తానని సీఎం చెప్పినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి.

# ఉమ్మడి పాలమూరుకు ముంపు ముప్పు!

**సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్:** మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో భారీగా కురుస్తున్న వర్షాలతో కృష్ణానది ఉగ్రరూపం దాల్చింది. కర్ణాటకలోని నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి పెద్ద ఎత్తున వరద నీటిని విడుదల చేయడంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ వైపు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇప్పటికే కృష్ణానది పరీవాహక ప్రాంతంలోని కృష్ణ మండలానికి వరద తాకిడి మొదలైంది. మరో పక్క ఇదే మండలంలోని సుకుర్‌పల్లి వద్ద కృష్ణా నదిలో విలీనమయ్యే భీమానది కూడా తన ప్రతాపాన్ని చూపేందుకు సిద్ధంగా ఉంది. మరో 48 గంటల్లో కృష్ణానదితో కలసి ఉగ్రరూపం దాల్చనుంది. కృష్ణ మండలం మీదుగా ప్రవహించే ఈ రెండు నదులు పరీవాహక గ్రామాల ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. గంట గంటకూ పెరుగుతున్న వరద ఇప్పటికే కృష్ణ మండల పరిధిలోని హిందూపూర్, వాసునగర్ గ్రామాల్లో సుమారు వంద ఎకరాల్లో పంటలను ముంచెత్తింది. పరిస్థితిని గమనిస్తే వాసునగర్ గ్రామ పరిధిలోని 500 ఎకరాలు మునిగిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వరద ముంపు భయంతో పరిసర గ్రామాల్లోని ప్రజలు ముందు జాగ్రత్తగా మూటా ముల్లే సర్దుకుంటున్నారు. వాసునగర్ గ్రామస్తులు ఇప్పటికే పునరావాస కేంద్రానికి తరలివెళ్లారు.

**భయం గుప్పిట్లో పల్లెలు..**

కృష్ణానది వరదకు భీమానది కూడా తోడయితే వరద ఉధృతి ఉగ్రరూపం దాల్చే అవకాశాలుండటంతో కృష్ణా పరీవాహక మండలాల్లో ఉన్న 15 గ్రామాల్లో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే హిందూపూర్‌కు 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న కృష్ణానది దాదాపు 1.5 కి.మీ.లోనికి చొచ్చుకుని వచ్చింది. ఈ ఒక్క గ్రామంలోనే సుమారు 70 ఎకరాలను నీట ముంచింది. ఒకవేళ వరద పోటెత్తితే వాసునగర్, హిందూపూర్ గ్రామాలతో పాటు గురిజాల, కుసుముర్తి, సుకుర్‌లింగంపల్లి, మొరహరిదొడ్డి గ్రామాలు.. మాగనూరు మండల పరిధిలోని మందిపల్లి, కొల్పూరు, పుంజనూరు, మక్తల్ మండల పరిధిలోని పంచదేవ్‌పాడ్, పసుపుల, దాదాన్‌పల్లి, ముస్లాయిపల్లి, పారెవుల గ్రామాలకు ముంపు ముప్పు పొంచి ఉంది. 2009లో వచ్చిన వరదలతో ఈ గ్రామాల్లో భారీగా ఆస్తినష్టం వాటిల్లింది.

**అధికార యంత్రాంగం అప్రమత్తం**

కృష్ణా పరీవాహక ప్రాంతాల్లో ఉన్న పంట భూములు, ఇతర ఆస్తులు మునిగే ప్రమాదం ఉందంటూ కర్ణాటక పోలీసులు నారాయణపేట జిల్లా ఎస్పీ చేతనకు బుధవారమే ఫోన్ ద్వారా సమాచారమిచ్చారు. దీంతో అదే రోజు హుటాహుటిన కృష్ణ మండలానికి వెళ్లిన ఎస్పీ చేతన.. వాసునగర్, హిందూపూర్ గ్రామాల్లో పొలాల్లోకి వచ్చిన వరద నీటిని పరిశీలించారు. వెంటనే వాసునగర్ గ్రామస్తులను పక్కనే ఉన్న సురక్షిత ప్రాంతానికి తరలించారు. హిందూపూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీ ప్రజలనూ సురక్షిత ప్రాంతానికి వెళ్లిపోవాలని సూచనలు చేశారు. ఈ కాలనీలో 100 ఇళ్లు.. 300 మంది జనాభా ఉండగా.. వీరిలో సగం మంది ఇళ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. వరద ఏ క్షణంలో పెరుగుతుందో తెలియక ఎస్పీ చేతన గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. ఇటు కృష్ణ మండల కేంద్రంలో బ్రిడ్జి వద్ద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో జనం అటు వైపు వెళ్లకుండా అక్కడ కూడా పోలీసు పహారా ఏర్పాటు చేశారు. మరో పక్క జిల్లా కలెక్టర్ వెంకట్రావ్ సైతం రెవెన్యూ సిబ్బందిని, ఇతర అధికారులను అప్రమత్తం చేశారు. ఎస్పీ, కలెక్టర్లు పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసు కుంటున్నారు.



హిందూపూర్‌లో పొలంలోకి వచ్చిన కృష్ణానది నీరు

**కరకట్ట వేయాల్సింది**

2009లోనూ ఇలాంటి వరదలే మా మండలాన్నంతటినీ ముంచెత్తాయి. అప్పట్లో వందలాది ఎకరాల వరి, పత్తి నీట మునిగింది. భారీగా ఆస్తి నష్టం జరిగింది. ఆ సమయంలో కృష్ణానీరు మా మండలం వైపు మళ్లకుండా.. సరిహద్దు ప్రాంతంలో కరకట్ట వేయాలని చెప్పాం. కానీ ఇంతవరకు నిర్మాణం కాలేదు. ఇప్పుడు మళ్లీ వరద ప్రమాదం మమ్మల్ని ఆందోళనకు గురి చేస్తోంది. కరకట్ట నిర్మిస్తే ఈ పరిస్థితి వచ్చేది కాదు.

– పూజారి లక్ష్మణ్, హిందూపూర్, సర్పంచ్

**ఆందోళనగా ఉంది**

గంటగంటకూ వరద ఉధృతి పెరుగుతుండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందో అని ఆందోళన కలుగుతోంది. ఇప్పటికే జిల్లా ఎస్పీ వచ్చి గ్రామస్తులను అప్రమత్తం చేసి వెళ్లారు. శుక్రవారం వరద ఉధృతి పెరిగితే సురక్షిత ప్రాంతానికి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నాం.

– సద్దాం హుస్సేన్, హిందూపూర్

# బీసీ జెండా.. కాంగ్రెస్ ఎజెండా

- బీసీ రిజర్వేషన్ల తగ్గింపుపై ఉద్యమించాలని నిర్ణయం
- ఇప్పటికే 50 శాతం సీట్లు కేటాయిస్తామని ప్రకటన
- మున్సిపల్ ఎన్నికల కోసం కసరత్తు

**సాక్షి, హైదరాబాద్:** మున్సిపల్ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ సామాజిక అస్త్రాన్ని సిద్ధం చేసుకుంటోంది. బీసీ ఎజెండా చేపట్టాలని భావిస్తోంది. మున్సిపాలిటీల్లో బీసీ రిజర్వేషన్ల తగ్గింపు అంశంపై ఉద్యమించి ఆ వర్గాల ఓట్లను రాబట్టుకోవాలని యోచిస్తోంది. గురువారం ఇక్కడి గాంధీ భవన్‌లో నల్లగొండ, భువనగిరి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, ఖమ్మం, మహబూబాబాద్, చేవెళ్ల, మల్కాజ్‌గిరి, మెదక్ పార్లమెంటు స్థానాల పరిధిలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పార్టీ పరిస్థితిపై నేతలు చర్చించారు. బీసీల రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వం కుట్రపూరితంగా తగ్గించిందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, బీసీలకు న్యాయం చేయాలని కోరుతూ ప్రతి మున్సిపాలిటీలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. కాంగ్రెస్‌పరంగా బీసీలకు 50 శాతం టికెట్ల కేటాయింపు విషయాన్ని సమర్థవంతంగా ప్రచారం చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు త్వరలోనే కార్యాచరణ రూపొందించనున్నారు.



గురువారం గాంధీభవన్‌లో టీపీసీసీ నేతలతో సమావేశమైన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**ఎన్నికలపై అలసత్వం వద్దు**

మున్సిపల్ ఎన్నికల కసరత్తుపై నిర్లక్ష్యం తగదని నేతలకు పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ సూచించారు. 'ఈ నెలాఖరు కల్లా మున్సిపల్ ఎన్నికలు జరిగే అవకాశముంది. 44 మున్సిపాలిటీలపై కోర్టు స్టే ఇచ్చినా అది తాత్కాలికమే. చిన్న, చిన్న అంశాలను సవరించుకుని వాటికి కూడా స్టే ఎత్తేసే అవకాశముంది. వీటిల్లోనూ పార్టీపరంగా కసరత్తు చేయండి. మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండండి'అని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, దానిని ఓట్లుగా మలచుకొని ఎక్కువస్థానాల్లో పార్టీ గెలిచేందుకు కృషి చేయాలని నేతలను కోరారు. బీజేపీ విషయంలో ఆందోళన అనవసరమని, ఆ పార్టీ తమకు పోటీనే కాదని నేతలకు భరోసా ఇచ్చినట్టు సమాచారం. ఈ నెల 20న రాజీవ్ జయంతిని పురస్కరించుకొని కళాశాలల్లో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి యువతకు రాజీవ్ గురించి తెలియచేద్దామని సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి సూచించారు. సమావేశంలో సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, ఏఐసీసీ కార్యదర్శులు బోసురాజు, సలీం, సంపత్‌కుమార్, వంశీచంద్‌రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు పొన్నం ప్రభాకర్, జెట్టి కసుమకుమార్, ఉపాధ్యక్షుడు మల్లు రవి, మాజీమంత్రులు సంభాని చంద్రశేఖర్, గడ్డం ప్రసాద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ముఖ్యనేతలేరీ...!**

మున్సిపల్ ఎన్నికలపై టీపీసీసీ నిర్వహించిన ఈ సన్నాహక సమావేశానికి కీలక నేతలు డుమ్మాకొట్టారు. ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డితోపాటు సీనియర్ నేతలు జానారెడ్డి, రేవంత్‌రెడ్డి, కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, దామోదర రాజనర్సింహ, గీతారెడ్డి, విజయశాంతి, రేణుకాచౌదరి, గాలి అనిల్‌కుమార్ సమావేశానికి రాకపోవడం గమనార్హం.

### తెలంగాణ ఇవ్వడం బీజేపీకి ఇష్టం లేదా?

**సాక్షి, హైదరాబాద్:** పార్లమెంటు తలుపులు మూసి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బిల్లును ఆమోదించుకున్నారని మాట్లాడటం ద్వారా తెలంగాణ ప్రజలను కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అవమానించారని టీపీసీసీ చీఫ్, నల్లగొండ ఎంపీ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అన్ని రాజకీయ పార్టీలను సంప్రదించిన తర్వాతే జరిగిందని, అయితే తాజాగా అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను బట్టి చూస్తే ఆ పార్టీకి తెలంగాణ ఇవ్వడం ఇష్టం లేదనిపిస్తోందన్నారు. గురువారం గాంధీభవన్‌లో పార్టీ నేతలు ఏఐసీసీ కార్యదర్శులు బోసురాజు, సలీమ్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు పొన్నం ప్రభాకర్, జెట్టి కుసుమకుమార్‌లతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ ఇవ్వడమే తప్పన్నట్టు బీజేపీ నేతలు మాట్లాడడం సరైంది కాదని, ఈ విషయంలో మోదీ, అమిత్‌షాలు మాట్లాడుతున్న విషయాలను తెలంగాణ ప్రజలు గుర్తించాలని కోరారు.

# మళ్లీ భూతల స్వర్గం చేద్దాం!

## జమ్మూకశ్మీర్‌పై దేశ ప్రజలకు ప్రధాని మోదీ పిలుపు

- జమ్మూకశ్మీర్ భారత దేశ శిరస్సు, కశ్మీర్ అభివృద్ధి మన బాధ్యత
- ఆర్టికల్ 370 వల్ల ఉగ్రవాదం, వేర్పాటువాదం, అవినీతి ప్రబలాయి



**న్యూఢిల్లీ:** భూతల స్వర్గమైన కశ్మీర్‌కు మళ్లీ పూర్వ వైభవం తీసుకువచ్చేలా కృషి చేద్దామని దేశ ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. జమ్మూకశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేయడాన్ని చారిత్రక నిర్ణయంగా అభివర్ణించిన ప్రధాని.. ఆ నిర్ణయం తీసుకోవడానికి దారి తీసిన పరిస్థితులను, 370 రద్దు ఆవసరాన్ని, కశ్మీర్ అఖండ భారత్‌లో సంపూర్ణంగా భాగస్వామి కావడం వల్ల ప్రయోజనాలను టీవీలో ప్రసారమైన తన ప్రసంగంలో సుదీర్ఘంగా వివరించారు. గురువారం రాత్రి 8 గంటల నుంచి దాదాపు 40 నిమిషాల పాటు ప్రసంగించిన ప్రధాని.. జమ్మూకశ్మీర్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, శాంతియుత, సురక్షిత, సమృద్ధ కశ్మీర్ తమ లక్ష్యమని తేల్చిచెప్పారు. స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని, కళ, క్రీడ, సాంస్కృతిక రంగాల్లో వారి నైపుణ్యాలకు అంతర్జాతీయ ఖ్యాతి కల్పిస్తామని హామీ ఇచ్చారు. కశ్మీర్‌ను అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి చూపుతామని, ఇందుకు దేశంలోని ఇతర ప్రాంతాల ప్రజల సహకారం అవసరమని పేర్కొన్నారు. ఆర్టికల్ 370, ఆర్టికల్ 35ఏ వల్ల రాష్ట్రానికి గానీ, రాష్ట్ర ప్రజలకు గానీ ఎలాంటి ప్రయోజనం కలగలేదని, ఉగ్రవాదాన్ని, వేర్పాటువాదాన్ని రాష్ట్రంలో విస్తరించేందుకు పాకిస్తాన్‌కు మాత్రం ఈ నిబంధనలు బాగా ఉపయోగపడ్డాయని ప్రధాని వ్యాఖ్యానించారు. దీనివల్ల గత 3 దశాబ్దాల్లోనే అమాయకులైన 42 వేల మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. ఆర్టికల్ 370 రద్దుతో జమ్మూకశ్మీర్‌లో కొత్త యుగం ప్రారంభమైందని, దీంతో జన సంఘ్ వ్యవస్థాపక నేత శ్యామా ప్రసాద్ ముఖర్జీ, దేశ తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్, మాజీ ప్రధాని వాజ్‌పేయి, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ల స్వప్నం సాకారమైందని ఉద్ఘాటించారు. ఆర్టికల్ 370పై గతంలో చర్చే జరగలేదని, దాని వల్ల ప్రయోజనాలేంటనే విషయంలో ఎవరికీ స్పష్టత లేకపోయినా.. అది అలా కొనసాగాల్సిందే అని అంతా భావించారని ప్రధాని చెప్పారు. అయితే, తామలా భావించలేదని, జమ్మూకశ్మీర్ ప్రజల అభివృద్ధికి అడ్డుగా నిలిచిన ఆ నిబంధనలను తొలగించాలనే ధృడ నిశ్చయంతో ముందడుగు వేశామని వివరించారు. జమ్మూకశ్మీర్ భారత దేశ శిరస్సు అని, ఈ ప్రాంతాభివృద్ధి మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఆర్టికల్ 370 వల్ల రాష్ట్రంలో వేర్పాటువాదం, ఉగ్రవాదం, అవినీతి, వంశపాలన ప్రబలడం తప్ప రాష్ట్ర ప్రజలకు ఒనగూరిందేమీ లేదన్నారు. గత కొన్నాళ్లుగా కొనసాగుతున్న గవర్నర్ పాలన వల్ల రాష్ట్రాభివృద్ధి గాడిన పడిందన్న ప్రధాని.. ఇకపై రాష్ట్రాభివృద్ధి, స్థానిక ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగుతుందన్నారు. జమ్మూకశ్మీర్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా కొనసాగించబోమని, కొన్నాళ్ల తరువాత రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామని స్పష్టం చేశారు. ఈద్ శుభాకాంక్షలు తెలుపుతూ.. సోమవారం నాటి ఈద్‌ను ప్రజలంతా ఆనందోత్సాహాలతో జరుపుకునేలా చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులను ఆదేశించానన్నారు. కశ్మీరీల ఆశలు, ఆకాంక్షలు, స్వప్నాలను సాకారం చేసేందుకు అంతా కలసి రావాలని దేశ ప్రజలకు పిలుపునిచ్చారు.



గురువారం ఢిల్లీలో జాతినుద్దేశించి ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

### ఆ అమరుల కల నిజం చేద్దాం!

'1965లో పాకిస్తాన్ చొరబాటుదారుల గురించి మన బలగాలకు సమాచారం ఇచ్చిన మౌల్వి గులామ్ దిన్, కార్గిల్ యుద్ధంలో సేవలందించిన లదాఖ్‌కు చెందిన కల్నల్ వాంగ్‌చుక్, 2009లో ఉగ్రవాదులతో తలపడిన రాజౌరీ జిల్లాకు చెందిన మహిళ రుక్సానా కౌసర్, గత సంవత్సరం ఉగ్రవాదులు అపహరించి, చంపేసిన రైఫిల్‌మ్యాన్ ఔరంగజేబు సహా దేశం కోసం, ఈ ప్రాంతం కోసం అమరులైన ఎందరో సాహస జవాన్లు, పోలీసుల స్వప్నం కశ్మీర్లో శాంతి నెలకొనడమే. వారి స్వప్నాన్ని నిజం చేయాల్సిన బాధ్యత మనపై ఉంది' అని మోదీ అమరజవాన్లను గుర్తు చేశారు. కౌసర్‌కు కీర్తిచక్ర, వాంగ్‌చుక్‌కు మహావీర్ చక్ర పురస్కారాలను ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ఔరంగజేబు సోదరులిద్దరూ ఆర్మీలో సేవలందస్తున్న విషయాన్ని ప్రధాని గర్వంగా చెప్పారు.



### సినీ పరిశ్రమకు విజ్ఞప్తి

'సినిమా షూటింగ్‌లకు కశ్మీర్ అద్భుతమైన ప్రాంతం. ఇక్కడ షూటింగ్‌లు చేయడమే కాకుండా, స్టూడియోలు, థియేటర్లు నిర్మించాలని బాలీవుడ్, తెలుగు, తమిళ, ఇతర సినీ పరిశ్రమల వారికి విజ్ఞప్తి చేస్తున్నా. తద్వారా స్థానికులకు ఉపాధి లభిస్తుంది' అని భారతీయ సినీ పరిశ్రమను మోదీ కోరారు.

### ఆర్గానిక్ హబ్.. లదాఖ్

'లదాఖ్‌కే ప్రత్యేకమైన సేంద్రియ ఉత్పత్తులు, ఔషధ మొక్కలకు ప్రపంచవ్యాప్త గుర్తింపు లభించాలి. ఇక్కడి జీవ వైవిధ్యత స్థానికులకు ప్రయోజనకరం కావాలి. ఇక్కడి 'సోలో' అనే ఔషధ మొక్కను ఆధునిక కాలపు సంజీవని అంటారు. ఆక్సిజన్ తక్కువగా లభించే ఇక్కడి ఎత్తైన ప్రాంతాల్లోని సైనికులు, ప్రజలకు ఇది నిజంగా సంజీవనే. ఇలాంటివి ఇక్కడ చాలా ఉన్నాయి. వీటితో స్థానికులకు ఆదాయం లభించాలి. ఆ దిశగా ఎగుమతిదారులు, పారిశ్రామికవేత్తలు ఆలోచించాలి' అని మోదీ ఆకాంక్షించారు.

### ప్రధాని మోదీ ప్రసంగంలోని ఇతర ముఖ్యాంశాలు..

- దేశాభివృద్ధి, దేశ ప్రజల సంక్షేమం కోసం చర్చోపచర్చల అనంతరం పార్లమెంటు చట్టాలు చేస్తుంది. దేశమంతా అమలయ్యే ఆ చట్టాలు, వాటి ప్రయోజనాలు ఇన్నాళ్లూ కశ్మీర్‌లో అమలు కాకపోయేవి. విద్యాహక్కు, బాలికల సంక్షేమానికి సంబంధించిన చట్టాలు, కార్మిక, దళిత, మైనారిటీల కోసం రూపొందించిన చట్టాలు.. ఇవేవీ కశ్మీర్‌లో అమలుకు నోచుకోలేదు. ఇకపై అలా జరగదు. ఇకపై కశ్మీర్ సహా దేశవ్యాప్తంగా ఆ చట్టాలు అమలవుతాయి. 1.5 కోట్ల రాష్ట్ర ప్రజలకు ఆ ప్రయోజనాలు అందుతాయి.
- ఇతర కేంద్ర పాలిత ప్రాంతాల్లోని ఉద్యోగులు, పోలీసులకు లభిస్తున్న సౌకర్యాలు జమ్మూకశ్మీర్‌లోని ఉద్యోగులకూ కూడా లభిస్తాయి. జమ్మూ, కశ్మీర్, లదాఖ్‌ల్లో ఖాళీగా ఉన్న అన్ని ఉద్యోగాలనూ భర్తీ చేస్తాం. ఆర్మీ, పారామిలటరీ దళాల్లో స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తాం.
- ఐఐటీ, ఐఐఎం లాంటి ప్రతిష్టాత్మక సంస్థలను ఏర్పాటు చేస్తాం.
- రాష్ట్రంలో నీటి ప్రాజెక్టులు, విద్యుత్ ప్రాజెక్టులు, రోడ్డురవాణా తదితర మౌలిక వసతుల సౌకర్యాల కల్పనకు సంబంధించిన ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన ముందుకు తీసుకువెళ్తాం.
- జమ్మూకశ్మీర్‌లో త్వరలోనే అసెంబ్లీ ఎన్నికలు జరగాలి. కొత్త ప్రభుత్వం ఏర్పడాలి. ఉత్సాహవంతులైన యువత ఎమ్మెల్యేలు, మంత్రులు, సీఎం కావాలి. ఇకపై ఎన్నికలు పారదర్శకంగా జరుగుతాయి. వంశ పాలనకు ఇక చరమగీతమే. మీ(స్థానికుల) నుంచే ప్రజా ప్రతినిధులు వస్తారు.
- 1947 తరువాత పాక్ నుంచి ఇక్కడికి వలస వచ్చినవారు ఇన్నాళ్లూ ఇక్కడ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేదు. ఇకపై వారికి ఆ అవకాశం లభిస్తుంది.
- ఐటీ, డిజిటల్ టెక్నాలజీలతో ఉపాధికి అవకాశాలుంటాయి.
- రాష్ట్రంలో పంచాయతీ వ్యవస్థ అద్భుతంగా ఉంది. పంచాయతీ సభ్యులు, ముఖ్యంగా మహిళలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. వారికి కేంద్రం నుంచి ఇకపై మరింత మద్దతు లభిస్తుంది. నిధులు అందుతాయి.
- క్రీడల్లో ఆసక్తి, అభినివేశం ఉన్న యువత కోసం శిక్షణ కేంద్రాల ఏర్పాటు, స్పోర్ట్స్ అకాడమీల ఏర్పాటు ఉంటుంది. స్థానిక యువత క్రీడానైపుణ్యాలు ఆదరణ పొందాలి.
- చేతి కళలు, వృత్తి నైపుణ్యాల ఆధారంగా స్థానికులకు ఉపాధి అవకాశం లభిస్తుంది. ఇక్కడి కళాకృతులు ప్రపంచవ్యాప్తంగా ఎగుమతి అయ్యేలా కృషి చేయాలి.



### ప్రసంగాన్ని మెచ్చని కశ్మీరీలు

మోదీ ప్రసంగంపై అనేక మంది కశ్మీరీలు పెదవి విరిచారు. ఆర్టికల్ 370ని రద్దు చేసేందుకు, కశ్మీర్‌ను విడగొట్టేందుకు ప్రభుత్వం అప్రజాస్వామిక పద్ధతిని అనుసరించిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వానికి కశ్మీర్ భూమి కావాలి తప్ప ఇక్కడి ప్రజల మనసులు కాదని కొందరు ఆరోపించారు. విద్యార్థుల నుంచి వివిధ వృత్తుల్లోని ఉద్యోగుల వరకు.. అనేక మంది మాట్లాడుతూ, ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేయడం వల్ల పర్యావరణం పరంగా చాలా సున్నితమైన కశ్మీర్‌ను మౌలిక వసతుల సంబంధ కార్యకలాపాల కోసం దోపిడీ చేసే అవకాశం ఉందనే భయాన్ని వ్యక్తం చేశారు. ఆజాద్ అహ్మద్ అనే వైద్యుడు స్పందిస్తూ, 'కేంద్రానికి మా భూమి కావాలి. మా నమ్మకాన్ని వారు గెలవాలంటే మా అభిప్రాయాలను తీసుకుని ఉండాల్సింది' అన్నారు.

## ఘనంగా రేవా వర్సిటీ స్నాతకోత్సవం



మెడల్స్ సాధించిన వర్సిటీ విద్యార్థులతో నిర్వాహకులు

**సాక్షి, బెంగళూరు:** బెంగళూరు శివారులోని రేవా యూనివర్సిటీ నాలుగో స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు ముఖ్య అతిథి, యూజీసీ (న్యూఢిల్లీ) చైర్మన్ ప్రొఫెసర్ డీపీ సింగ్ గోల్డ్ మెడల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా యూజీసీ చైర్మన్ డీపీ సింగ్ ప్రసంగించారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్య అంటే కేవలం చదువు మాత్రమే కాదని, విద్యార్థి భవిష్యత్ బాటకు ప్రణాళిక అని డీపీ సింగ్ అన్నారు. సమాజంలో ప్రతి వ్యక్తికి నైతిక విలువలు ప్రధానమని రేవా వర్సిటీ చాన్స్‌లర్ పి.శ్యామరాజు వ్యాఖ్యానించారు.

## అమెరికాలో కత్తిపోట్లు.. నలుగురు మృతి

**లాస్‌ఏంజెలిస్:** దోచుకోవడమే లక్ష్యంగా రెచ్చిపోయిన ఓ వ్యక్తి యథేచ్ఛగా కత్తిపోట్లకు పాల్పడటంతో నలుగురు చనిపోయారు. మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన బుధవారం మాన్‌గ్రోవ్ సిటీలో జరిగింది. సిటీకి చెందిన ఓ వ్యక్తి(33) మొదటగా తన అపార్టుమెంట్‌లోని ఓ దుకాణదారును కత్తి చూపి బెదిరించి, దోచుకున్నాడు. ఆపైన ఓ సెక్యూరిటీ గార్డును కత్తితో పొడిచి అతని వద్ద ఉన్న తుపాకీని లాక్కున్నాడు. ఈ ఘటనలో ఆ గార్డు ప్రాణాలు కోల్పోయాడు. ఇలా కత్తి, తుపాకీ చూపి బెదిరిస్తూ సుమారు ఆరు దుకాణాల్లో నగదు దోచుకున్నాడు. మొత్తం ఆరుగురిని గాయపరచగా నలుగురు మృతి చెందారు. రెండు గంటలపాటు చెలరేగిపోయిన అతడిని పక్కనే ఉన్న సాంటాఅనా సిటీలో పోలీసు డిటెక్టివ్‌లు పట్టుకున్నారు.

## జాతీయ మెడికల్ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

**న్యూఢిల్లీ:** జాతీయ మెడికల్ బిల్లు–2019కు రాష్ట్రపతి ఆమోదం లభించింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి హర్షవర్ధన్ గురువారం మీడియాకు తెలిపారు. ఈ బిల్లుకు సంబంధించి త్వరలోనే గెజిట్ వెలువడుతుందని, ఆ తర్వాత ఎన్‌ఎంసీ బిల్లుకు సంబంధించిన నియమ నిబంధనలను రూపొందిస్తారని ఆయన తెలిపారు. ఈ ప్రక్రియ అంతా ఆర్నెల్ల లోపులోనే ముగుస్తుందని ఆయన చెప్పారు. వైద్యవిద్య రంగంలో కీలక సంస్కరణగా పేర్కొంటున్న ఎన్‌ఎంసీ బిల్లు ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని ఎన్డీయే ప్రభుత్వం సాధించిన పెద్ద విజయమని హర్షవర్ధన్ పేర్కొన్నారు. విద్యార్థుల భారాన్ని, వైద్య విద్య ఖర్చులను తగ్గించేదిగానూ, వారికి నాణ్యమైన వైద్య విద్యను అందించేలా తద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా ఈ ఎన్‌ఎంసీ బిల్లు రూపొందించామని మంత్రి తెలిపారు.

# భారత రత్న పురస్కారాల ప్రదానం



ఢిల్లీలో ప్రణబ్‌ను భారతరత్న పురస్కారంతో సత్కరిస్తున్న రాష్ట్రపతి కోవింద్(కుడి). నానాజీ తరఫున బంధువు విక్రమజీత్(ఎడమ), హజారికా తరఫున కొడుకు తేజ్‌లు పురస్కారాలు స్వీకరించారు.

**న్యూఢిల్లీ:** మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, భారతీయ జన సంఘ్ దివంగత నేత నానాజీ దేశ్‌ముఖ్, దివంగత గాయకుడు భూపేన్ హజారికాలకు ఈ ఏడాది జనవరిలో ప్రకటించిన భారత రత్న పురస్కారాలను గురువారం ప్రదానం చేశారు. రాష్ట్రపతి కోవింద్ ఈ అవార్డులను ముఖర్జీకి, హజారికా కొడుకు తేజ్‌కు, నానాజీ సన్నిహిత బంధువు విక్రమజీత్ సింగ్‌కు రాష్ట్రపతి భవన్‌లో జరిగిన వేడుకలో అందజేశారు. నానాజీ, హజారికాలకు ఈ అవార్డును వారి మరణానంతరం ప్రకటించారు. 'ప్రణబ్ దా' అని సన్నిహితులు ప్రేమగా పిలుచుకునే ప్రణబ్ ముఖర్జీ.. భారత రత్న అందుకున్న ఐదో రాష్ట్రపతి. కాంగ్రెస్‌కు అత్యంత విశ్వాసపాత్రుడైన ప్రణబ్ భారత్‌కు అత్యంత పిన్న వయస్కుడైన ఆర్థిక మంత్రిగా పని చేశారు. నానాజీ దేశ్‌ముఖ్‌కు 1928 నుంచి ఆయన చనిపోయే వరకు ఆరెస్సెస్‌తో సంబంధాలు ఉన్నాయి. భారతీయ జన సంఘ్ స్థాపకుల్లో నానాజీ ఒకరు. కాగా, అస్సాంకు చెందిన హజారికా నేపథ్య గాయకుడు, గేయ రచయిత, సంగీత వాద్యకారుడు, చిత్ర నిర్మాత కూడా.

## జన్మస్థలాన్ని వ్యక్తిగా ఎలా పరిగణించాలి?

**రామ జన్మస్థలంపై హిందూ సంస్థను ప్రశ్నించిన సుప్రీంకోర్టు**

**న్యూఢిల్లీ:** అయోధ్యలో రామజన్మస్థలంగా భావిస్తున్న ప్రాంతాన్ని వ్యక్తిగా భావించి.. కక్షిదారుడిగా ఎలా పరిగణిస్తామని సుప్రీంకోర్టు 'రామ్ లల్లా విరాజ్‌మాన్'అనే హిందూ సంస్థను ప్రశ్నించింది. దేవతల విగ్రహాలకైతే ఆస్తులు, ఆభరణాలు ఉండటంతో చట్టపరంగా వాటిని వ్యక్తులుగా భావిస్తామని.. మరి జన్మస్థలాలను ఎలా పరిగణనలోకి తీసుకుంటామని ప్రశ్నించింది. అయోధ్య కేసు రోజువారీ విచారణలో భాగంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్‌తో కూడిన ఐదుగురు సభ్యుల ధర్మాసనం గురువారం హిందూ, ముస్లిం పార్టీల వాదనలు వింది. రామ్ లల్లా తరఫున సీనియర్ న్యాయవాది పరాశరణ్ వాదనలు వినిపించారు. హిందూ మతంలో విగ్రహాలను మాత్రమే పూజించాలనే నియమం లేదని.. నదులను, సూర్యుడిని కూడా పూజిస్తారని తెలిపారు. భగవంతుడు పుట్టిన స్థలాన్ని కూడా పవిత్రమైనదిగా భావిస్తారని కోర్టుకు తెలిపారు. జన్మస్థలం ప్రాముఖ్యతను వివరిస్తూ సంస్కృతంలో ఉద్దేశించిన ఓ శ్లోకాన్ని ఆయన ప్రస్తావించారు. 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపీ గరీయసీ'అనే శ్లోకంలో జన్మస్థలం స్వర్గం కంటే గొప్పదని పేర్కొన్నారని.. ఈ నేపథ్యంలో జన్మస్థలాన్ని కక్షిదారుడిగా భావించవచ్చని పేర్కొన్నారు. స్పందించిన ధర్మాసనం.. పవిత్ర గంగా నదిని కక్షిదారుడిగా భావించవచ్చని ఉత్తరాఖండ్ హైకోర్టు తీర్పును ప్రస్తావించింది. 1949 డిసెంబర్ 16 నుంచి ముస్లింలు ఈ ప్రాంతంలో ప్రార్థనలు చేయడం లేదని నిర్మోహ అఖాడా తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. తదుపరి వాదనలను శుక్రవారం వింటామని కోర్టు తెలిపింది.

## జమ్మూ కశ్మీర్‌పై నేడు కాంగ్రెస్ పార్టీ భేటీ

**సాక్షి ప్రతినిధి, న్యూఢిల్లీ:** జమ్మూ కశ్మీర్ అంశంపై చర్చించేందుకు ఢిల్లీకి రావాల్సిందిగా అన్ని రాష్ట్రాల్లోని సీనియర్ నాయకులను కాంగ్రెస్ పార్టీ ఆదేశించింది. ఈ సమావేశం శుక్రవారం జరగనుంది. ఆర్టికల్ 370 రద్దు, కేంద్రపాలిత ప్రాంతాల ఏర్పాటును కాంగ్రెస్‌లోనే కొందరు సీనియర్లు మద్దతుతెలపడంతో కశ్మీర్ అంశంపై సమగ్రంగా చర్చించేందుకు, పార్టీ వైఖరిని స్పష్టంగా వివరించేందుకు తాజా సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. శనివారమే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) భేటీ కూడా జరగాల్సి ఉంది. కాంగ్రెస్‌కు కొత్త అధ్యక్షుడిని సీడబ్ల్యూసీ భేటీలో నిర్ణయించే అవకాశం ఎక్కువగా ఉంది.

# వరద విషాదం..43 మంది మృతి

- ఒక్క మహారాష్ట్రలోనే 27 మంది మృతి
- కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఒడిశాల్లో 16 మంది మృత్యువాత



జలమయంగా మారిన సాంగ్లీ జనావాసాలు

**న్యూఢిల్లీ/బెంగళూరు/తిరువనంతపురం/సాక్షి, ముంబై/ పింప్రి:** కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర సహా పలు రాష్ట్రాలు భారీ వర్షాలు, వరదలతో అతలాకుతలమవుతున్నాయి. మహారాష్ట్రలో వరదల కారణంగా 27 మంది మరణించారు. ముఖ్యంగా సాంగ్లీ జిల్లాలోని పలుస్ తాలూకాలో వరద బాధితులతో వెళ్తున్న బోటు బోల్తా పడటంతో 9 మంది మృత్యువాత పడ్డారు. కర్ణాటకలో 9 మంది, కేరళలో నలుగురు, తమిళనాడులోని కోయంబత్తూరులో ఇద్దరు, ఒడిశాలో ఒకరు వర్షాల కారణంగా ప్రాణాలు కోల్పోయారు. తమిళనాడు చరిత్రలోనే అత్యధికంగా నీలగిరి జిల్లా అవలాంచి అడవుల్లో 82 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. వివిధ రాష్ట్రాల్లో వరదల్లో చిక్కుకున్న లక్షలాది మందిని అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఇళ్లు నేలమట్టం కావడంతో వేలాది మంది నిరాశ్రయులయ్యారు. వానలు, వరదల కారణంగా పలు ప్రాంతాల్లో రోడ్డు, రైల్వే రవాణా స్తంభించింది. వరద బాధిత రాష్ట్రాల్లో సహాయక చర్యలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు కాంగ్రెస్ నేత రాహుల్ పిలుపునిచ్చారు.

### ఐదు జిల్లాల్లో అత్యధిక ప్రభావం

మహారాష్ట్రలోని పుణే, సతారా సాంగ్లీ, కొల్హాపూర్, షోలాపూర్ జిల్లాల్లో వరదల కారణంగా ఇప్పటి వరకు 27 మంది మరణించినట్టు పుణే డివిజన్ కమిషనర్ దీపక్ మైసేకర్ తెలిపారు. ముఖ్యంగా సాంగ్లీ పలుస్ తాలూకాలో కృష్ణా, యేర్లా నదీ సంగమంలో వరద తీవ్రతకు పలు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. గురువారం ఉదయం పలుస్ గ్రామస్తులను తరలిస్తున్న బోటు బోల్తా పడింది. దీంతో 14 మంది గల్లంతు కాగా 15 మంది సురక్షితంగా బయటపడ్డారు. సహాయక సిబ్బంది 9 మృతదేహాలను వెలికితీశారు. సాంగ్లీ జిల్లా జైలు వరద నీటిలో చిక్కుకుంది. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ ఆ ప్రాంతానికి విమానంలో వెళ్లి రక్షణ, సహాయక చర్యలను పర్యవేక్షించారు. కర్ణాటక ముఖ్యమంత్రి యడియూరప్పతో ఫోన్‌లో మాట్లాడారు. సాంగ్లీలో పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ఆల్మట్టి డ్యాం నుంచి 5 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని కోరారు. వరదల కారణంగా కొల్హాపూర్–మిరజ్ మార్గంలో రైళ్లను రద్దు చేశారు. పుణే–బెంగళూర్ జాతీయ రహదారి దెబ్బతినడంతో పుణే–షోలాపూర్ రహదారి మీదుగా వాహనాలను మళ్లించారు.

### సాయం అందించండి: యడియూరప్ప

కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలకు 9 మంది చనిపోగా 43 వేల మంది నిరాశ్రయులయ్యారు. ముఖ్యమంత్రి యడియూరప్ప బెళగావిలో మకాం వేసి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. వరద బాధిత ప్రాంతాల్లో సహాయ, పునరావాస కార్యక్రమాలు చేపట్టేందుకు రూ.5వేల కోట్లు అవసరమవుతాయని, దాతలు ముందుకు రావాలని సీఎం విజ్ఞప్తి చేశారు. సీఎం సహాయ నిధికి ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చైర్మన్ సుధామూర్తి రూ.10 కోట్లు అందజేయనున్నట్లు ప్రకటించారు. కేరళలోని ఇడుక్కి జిల్లాలో భారీ వర్షాలు, కొండచెరియాలు విరిగిపడటంతో ఏడాది చిన్నారి సహా నలుగురు మృతి చెందారు.

# 'సంఝౌతా' నిలిపివేత

- వాఘాలో ఆపేసిన పాక్ అధికారులు
- గగనతలంపై ఆంక్షలు లేవన్న పాక్



గురువారం భారత్‌లోని అట్టారీ వద్దకు చేరుకున్న సంఝౌతా రైలు

**న్యూఢిల్లీ/వాషింగ్టన్/ఇస్లామాబాద్/దుబాయ్:** పాక్‌లోని లాహోర్ నుంచి ఢిల్లీకి వస్తున్న సంఝౌతా ఎక్స్‌ప్రెస్‌ను పాక్ అధికారులు భద్రతను సాకుగా చూపుతూ వాఘా సరిహద్దు వద్దే నిలిపివేశారు. ఈ సమయంలో రైలులో 48 మంది పాకిస్తానీలు సహా 117 మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న భారత బలగాలు, రైల్వే సిబ్బంది సాయంత్రం 5.15 గంటలకు అక్కడికి చేరుకున్నారు. రైలుకు భారత ఇంజిన్‌ను బిగించి భారత సరిహద్దు అట్టారి వద్దకు తీసుకొచ్చారు. పాక్ నిర్ణయంతో సరిహద్దుకు ఇరువైపులా ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. చివరికి సాయంత్రం 6.41 గంటల సమయంలో 10 మంది పాకిస్తానీలు సహా 103 మంది ప్రయాణికులతో రైలు అట్టారి నుంచి లాహోర్‌కు బయలుదేరింది. ఆర్టికల్ 370 రద్దు తర్వాత సంఝౌతా సర్వీసును నిలిపేస్తున్నట్లు పాక్ రైల్వే మంత్రి రషీద్ ప్రకటించారు. అయితే ఈ సర్వీసు కొనసాగుతుందని భారత అధికారులు స్పష్టత ఇచ్చారు.

### ఇంకోసారి ఆలోచించుకోండి: భారత్

తమతో దౌత్య, వాణిజ్య సంబంధాలను తెగదెంపులు చేసుకోవడంపై పాకిస్తాన్ పునరాలోచించాలని భారత్ కోరింది. ఈ చర్యలతో ఇరుదేశాల మధ్య తీవ్రమైన ఉద్రిక్తత నెలకొన్నట్లు ప్రపంచ దేశాలకు చూపించేందుకు పాక్ ప్రయత్నిస్తోందని ఆరోపించింది.



లాహోర్ నుంచి సంఝౌతా ఎక్స్‌ప్రెస్‌లో భారత్‌కు రానున్న బంధువును పట్టుకుని రోదిస్తున్న ఓ మహిళ

### కాంగ్రెస్‌కు కరణ్‌సింగ్ షాక్..

ఆర్టికల్ 370 రద్దు విషయంలో కేంద్రం నిర్ణయాన్ని తాను గుడ్డిగా వ్యతిరేకించబోనని కాంగ్రెస్ నేత కరణ్ సింగ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ వ్యవహారశైలిని ఆయన తప్పుపట్టారు. 'కేంద్రం తీసుకున్న నిర్ణయంలో పలు సానుకూల అంశాలున్నాయి. లదాఖ్‌ను కేంద్రపాలిత ప్రాంతం(యూటీ) చేయడాన్ని స్వాగతిస్తున్నాం' అని తెలిపారు.

### ఆజాద్ అడ్డగింత

కాంగ్రెస్ సీనియర్ నేత, కశ్మీర్ మాజీ సీఎం గులాం నబీ ఆజాద్‌ను అధికారులు శ్రీనగర్ విమానాశ్రయంలో గురువారం అడ్డుకున్నారు. స్థానిక కశ్మీర్ నేతలతో మాట్లాడేందుకు శ్రీనగర్ ఎయిర్‌పోర్టులో దిగిన ఆయనను అధికారులు తిరిగి ఢిల్లీకి పంపారు. జాతీయ భద్రతా సలహాదారు దోవల్ కశ్మీర్‌లో పర్యటించడం, ఆ సందర్భంగా స్థానికులతో భోజనం చేయడంపై ఆజాద్ స్పందిస్తూ.. 'డబ్బులిస్తే ఎవరైనా మనతోపాటు వస్తారు' అని అన్నారు. అంతర్జాతీయ వేదికలపై పాక్ ఈ వ్యాఖ్యలను అనుకూలంగా చేసుకునే చాన్సుందని బీజేపీ మండిపడింది.

### సంయమనం పాటించండి: అమెరికా

కశ్మీర్, ఇతర సమస్యలపై భారత్–పాకిస్తాన్‌ల మధ్య ప్రత్యక్ష చర్చలు ప్రారంభమవ్వాలని తాము కోరుకుంటున్నట్లు అమెరికా తెలిపింది. సమస్యను ఇరుదేశాల చర్చల ద్వారా పరిష్కరించుకుంటాయన్న నమ్మకం తమకుందని యూఏఈ విదేశాంగ మంత్రి అన్వర్ తెలిపారు.

### ఎలాంటి సవాళ్లకైనా సిద్ధం: రాజ్‌నాథ్

ఆర్టికల్ 370 రద్దుకు సంబంధించి క్షేత్రస్థాయి పనులు గత ప్రభుత్వ హయాంలోనే ప్రారంభమయ్యాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ తెలిపారు. ఎలాంటి భద్రతాపరమైన సవాళ్లు ఎదురైనా ఎదుర్కొనేందుకు సాయుధ బలగాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. 'భారత మిలటరీ బలంగా కశ్మీరీలను అణచివేయగలమని బీజేపీ భావిస్తోందా? కశ్మీర్‌లో ప్రజల పోరాటం త్వరలో ఊపందుకోనుంది. ఈ సందర్భంగా చెలరేగే హింసను ఆపే దమ్ము ప్రపంచదేశాలకు ఉందా?' అని పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ గురువారం ప్రశ్నించారు. భారతీయ సినిమాల ప్రదర్శనపై దేశవ్యాప్తంగా నిషేధం విధిస్తున్నట్లు పాకిస్తాన్ ప్రకటించింది. భారత విమానాలు తమ గగనతలం గుండా రాకపోకలు సాగించడంపై ఎలాంటి ఆంక్షలు విధించలేదని పాకిస్తాన్ పౌర విమానయాన శాఖ స్పష్టంచేసింది.

సాక్షి

శుక్రవారం, ఆగస్టు, 9

## కాంగ్రెస్‌లో 'కల్లోల కశ్మీరం'

జమ్మూ– కశ్మీర్‌కి సంబంధించి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై ఆ రాష్ట్రం ఎలా స్పందిస్తున్నదో తెలియడానికి కాస్త సమయం పట్టేలా ఉంది. ముందుజాగ్రత్త చర్యగా ఇంటర్నెట్, ఫోన్ సౌకర్యాలవంటివన్నీ నిలిపేయడంతో ఈ సమస్య ఏర్పడింది. కానీ సుదీర్ఘకాలం ఈ దేశాన్నేలిన కాంగ్రెస్ పార్టీ మాత్రం ఆ నిర్ణయం వెలువడిన నాటినుంచి కకావికలవుతోంది. కింది స్థాయి నేతలు కశ్మీర్‌పై సరైన సమాచారం లేకపోవడంవల్లా, అవగాహన లోపించడంవల్లా మాట్లాడితే అర్థం చేసుకోవచ్చు. కానీ సీనియర్ నేతలే పొంతనలేని ప్రకటనలు చేస్తున్నారు. కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాహుల్ గాంధీ రాజీనామా చేయడంతో పార్టీలో ఏర్పడిన సంక్షోభం ప్రభావమో, కశ్మీర్‌పై ఆ నేతలకు మొదటినుంచీ ఇలాంటి అయోమయావస్థ ఉందో ఎవరికీ తెలియదు. 370, 35ఏ అధికరణలను రద్దు చేస్తూ, జమ్మూ–కశ్మీర్‌ను రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకున్నాక పార్లమెంటులో కాంగ్రెస్ ఆ చర్యను తప్పుబట్టింది. కొంత ఆలస్యంగానైనా రాహుల్‌గాంధీ ఒక ట్వీట్ ద్వారా ప్రభుత్వ చర్యను వ్యతిరేకిస్తూ ప్రకటన విడుదల చేశారు. కనుక పార్టీ అధికారిక వైఖరేమిటో ఆ నేతలందరికీ అర్థమై ఉండాలి. కానీ సీనియర్ నాయకుడు జనార్దన్ ద్వివేది ఇందుకు పూర్తి భిన్నమైన వైఖరి తీసుకున్నారు. ఈ అధికరణల రద్దు ద్వారా ఒక చారిత్రక తప్పిదాన్ని సరిచేశారని చెప్పారు. ఇది దేశ సమగ్రత కోసం తీసుకున్న నిర్ణయమని మరో సీనియర్ నాయకుడు దీపేందర్ హుడా అన్నారు. ఇంకా జ్యోతిరాదిత్య సింధియా, మిలింద్ దేవరా, జితిన్ ప్రసాద, అభిషేక్ మను సింఘ్వి వంటివారు కూడా ఆ మాదిరి అభిప్రాయాలే వ్యక్తం చేశారు. రాజ్యసభలో పార్టీ చీఫ్ విప్‌గా ఉన్న భువనేశ్వర్ కలితా పార్టీ వైఖరితో విభేదిస్తూ ఎంపీ పదవికే రాజీనామా చేశారు. మరో సీనియర్ నేత కరణ్‌సింగ్ సైతం ఈ జాబితాలో చేరారు. ఇక కింది స్థాయి నేతల గురించి చెప్పేదేముంది? కానీ ఇలాంటివారిని సహచర సీనియర్ నేతలు అవకాశవాదులంటున్నారు. శనివారం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ భేటీ కాబోతోంది. అందులో రాహుల్ వారసుడి ఎంపికే ప్రధానాంశంగా ఉంటుందని సమాచారం. రెండునెలల జాప్యం తర్వాత ఆ పార్టీలో కదలిక రావడం దాని దుస్థితికి అద్దం పడుతుంది. కశ్మీర్ విషయంలో సీనియర్ నేతలు ఇష్టానుసారం చేస్తున్న ప్రకటనల గురించి కూడా వర్కింగ్ కమిటీ సమావేశం చర్చిస్తుందని అంటున్నారు.

నిజానికి 370 అధికరణ రాజ్యాంగంలో పొందుపరిచిన కొద్దికాలంలోనే దాన్ని నీరుగార్చిన చరిత్ర కాంగ్రెస్‌ది. నెహ్రూ కాలంలోనే అందుకు బీజం పడింది. తదనంతరకాలంలో దాన్ని మరింతగా బలహీనపరిచింది కూడా కాంగ్రెస్ పాలకులే. చివరకు తమకు అనుకూలంగా లేని పార్టీలు అధికారంలోకొస్తే ఆ ప్రభుత్వాలను చిక్కుల్లో పడేసి, తమను లెక్కచేయడం లేదనుకుంటే బర్తరఫ్ చేసి కశ్మీర్‌తో ఆడుకున్నది కాంగ్రెస్ హయాంలోనే. 1975లో షేక్ అబ్దుల్లాతో నాటి ప్రధాని ఇందిరా గాంధీ ఒప్పందం కుదుర్చుకుని ఆయన్ను జైలునుంచి విడుదల చేసింది. 1981లో తన కుమారుడు ఫరూక్ అబ్దుల్లాను వారసుడిగా ప్రకటించినప్పుడు ఆయన శిరస్సుపై తానుంచుతున్నది ముళ్ల కిరీటమేనని షేక్ అబ్దుల్లా హెచ్చరించారు. కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలతో ఆయనకున్న అనుభవం అలాంటిది. 1983లో జమ్మూ–కశ్మీర్‌లో జరిగిన ఎన్నికల్లో ఫరూక్ అబ్దుల్లా నేతృత్వంలోని నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ) ఘన విజయం సాధించింది. ఎంతో ప్రజాదరణతో అధికారం చేజిక్కించుకున్న ఫరూక్‌ను ఆ మరుసటి ఏడాదే కూలదోశారు. ఆ తర్వాత ఏమాత్రం జనాదరణలేని గులాం మహమ్మద్ షా నేతృత్వంలో ఫిరాయింపు ప్రభుత్వాన్ని నెలకొల్పారు. 1986లో మతకల్లోలాలు రేగాక ఆయన్ను బర్తరఫ్ చేశారు. ఆ మరుసటి ఏడాది జరిగిన ఎన్నికల్లో తిరిగి ఎన్‌సీ– కాంగ్రెస్‌లమధ్య పొత్తు కుదిరింది. ఆ ఎన్నికల్లో భారీయెత్తున రిగ్గింగ్ జరిగిందన్న అపఖ్యాతి మూటగట్టుకుని ఎట్టకేలకు ఆ కూటమి గట్టెక్కింది. సరిగ్గా ఆ తర్వాత నుంచే కశ్మీర్‌లోయలో మిలిటెన్సీ ముదిరింది. సాయుధ శిక్షణ పొందిన ఉగ్రవాదులు చొరబడి హత్యలు, అపహరణలతో అట్టుడికించారు. అప్పటి కేంద్రమంత్రి ముఫ్తీ మహమ్మద్ సయీద్ కుమార్తె రుబియా సయీద్‌ను మిలిటెంట్లు కిడ్నాప్ చేయడం, తమవారిని విడిపించుకోవడం ఆ కాలంలోనే జరిగింది. ఆ రాష్ట్రం విషయంలో కేంద్రం తప్పులు మీద తప్పులు చేస్తూ పోయింది. అక్కడ పరిస్థితులు నానాటికీ క్షీణిస్తూనే ఉన్నాయి. అది సరిహద్దు రాష్ట్రమని, అక్కడ ఏం జరిగినా పొరుగునున్న పాకిస్తాన్ దాన్ని తన స్వప్రయోజనాలకు వినియోగించుకునే ప్రమాదం ఉన్నదని, దేశానికి అది చేటు తెస్తుందని కాంగ్రెస్ ఏనాడూ అనుకోలేదు.

ఇప్పుడు కేంద్రం తీసుకున్న చర్యల్ని సమర్థించేవారిలో చాలామంది రాహుల్ అనుయాయులుగా ముద్రపడినవారే. 370 అధికరణ విషయంలో అనేక అభిప్రాయాలున్నాయి. కశ్మీర్ ఎదుర్కొంటున్న సకల సమస్యలకూ అదే మూలమని, ఆ అధికరణ రద్దయితే ఆ రాష్ట్రం అభివృద్ధి ఖాయమని బీజేపీని సమర్థించేవారు చెబుతున్నారు. దాంతో ఏకీభవిస్తూనే అందుకనుసరించిన విధానాన్ని వ్యతిరేకించేవారున్నారు. ఆ చర్య ప్రమాదకరమని, కశ్మీరీలను అది మరింత దూరం చేస్తుందని వాదించేవారున్నారు. కానీ ఆ అధికరణ ఉండాలని చెప్పే ముందు కాంగ్రెస్ తనవైపుగా గతంలో తప్పిదాలు జరిగాయని అంగీకరించి ఉంటే ఆ పార్టీతో ఏకీభవించినా, ఏకీభవించక పోయినా కనీసం దాని చిత్తశుద్ధిని జనం ప్రశంసించేవారు. అది లేకపోబట్టే జనం సంగతలా ఉంచి, పార్టీలోని సీనియర్ నేతలే కాంగ్రెస్ వైఖరితో విభేదిస్తున్నారు. వారిని అవకాశవాదులంటూ నిందించే బదులు ఇతర సీనియర్ నేతలు ఇన్ని దశాబ్దాలుగా కశ్మీర్‌లో తమ విధానాలెలా ఉన్నాయో ఆత్మవిమర్శ చేసుకోవాలి. మాటలకూ, చేతలకూ... సిద్ధాంతాలకూ, ఆచరణకూ పొంతన లేకుండా ఎల్లకాలమూ గడిపేద్దామనుకుంటే చెల్లదని గ్రహించాలి.

### గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు శ్రావణ మాసం, తిథి శు.నవమి ప.2.04 వరకు, తదుపరి దశమి నక్షత్రం అనూరాధ రా.2.21 వరకు, తదుపరి జ్యేష్ఠ, వర్జ్యం ఉ.6.39 నుంచి 8.11 వరకు, దుర్ముహూర్తం ఉ.8.15 నుంచి 9.06 వరకు తదుపరి ప.12.29 నుంచి 1.20 వరకు, అమృతఘడియలు... సా.4.05 నుంచి 5.56 వరకు, వరలక్ష్మీ వ్రతం.

**సూర్యోదయం :** 5.44
**సూర్యాస్తమయం:** 6.27
**రాహుకాలం :** ఉ. 10.30 నుంచి 12.00 వరకు
**యమగండం :** ప.3.00 నుంచి 4.30 వరకు

# ఇంతకూ వైద్యం సేవా.. వ్యాపారమా?

**కార్పొరేట్ వైద్యం రాజ్యమేలుతూ ప్రజల జీవన ప్రమాణాలను పెంచే ప్రాథమిక ఆరోగ్య సేవలు నత్తనడకతో సాగుతున్న పరిస్థితిని సరిచేయడానికి ఫ్యామిలీ మెడిసిన్ ప్రాముఖ్యతని అన్ని దేశాలూ గుర్తిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రం ప్రవేశపెట్టిన జాతీయ వైద్య కమిషన్ బిల్లు ప్రజా వ్యతిరేకత లక్ష్యంతో ఉంది. ఈ కమిషన్ సూచించే నియంత్రణలన్నీ ప్రభుత్వ కళాశాలలకి మాత్రమే వర్తిస్తాయి. అలాంటప్పుడు సమానత్వం ఎక్కడిది? ఒకే రకమైన, నాణ్యమైన విద్య ఎక్కడిది? ప్రైవేట్ వైద్యకళాశాలలు, డీమ్డ్ యూనివర్సిటీల్లో 15 శాతం సీట్లు యాజమాన్యం చేతిలో ఉండగా ఇప్పుడు ఈ బిల్లులో దాన్ని 50 శాతానికి పెంచడం పేదలకు ఎలా ఉపకరిస్తుంది? అందుకే ఇది 'ప్రజా వ్యతిరేక, పేదల వ్యతిరేక బిల్లు' మాత్రమే. మన వైద్య రంగాన్ని నిర్వీర్యపరిచే ఇలాంటి బిల్లులు సమానత్వాన్ని చాటలేవు. వైద్యాన్ని మొత్తంగా ప్రభుత్వపరం చేసి, ప్రభుత్వ ఆసుపత్రులను మెరుగుపరిచే విధానాలు మాత్రమే ప్రజల ఆరోగ్యాన్ని సంపూర్ణంగా కాపాడగలవు.**

మన కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన జాతీయ వైద్య కమిషన్ బిల్లు (ఎన్.ఎం.సి. బిల్) అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. అందుకే దేశవ్యాప్తంగా వైద్యరంగ నిపుణులు, వైద్య విద్యార్థులు తమ నిరసనని తెలుపుతున్నారు. 1956 నాటి భారతీయ మెడికల్ కౌన్సిల్ యాక్ట్‌ని రద్దు చేయాల్సిన అవసరం ఎందుకు వచ్చింది? ఎం.సి.ఐ.లో అవినీతి పేరుకు పోయినందుకు, దాన్ని రద్దుచేసి, వైద్యవిద్య, ఆరోగ్య రంగాల్లో ఈ కొత్త నియంత్రణలని కేంద్రం ప్రతిపాదిస్తోంది. దీని ద్వారా దేశానికి అవసరమైన ఉన్నతస్థాయి వైద్యులని అందించవచ్చని, అత్యాధునిక పరిశోధనని అమలు చేయవచ్చని, వైద్య కళాశాలలపై క్రమబద్ధమైన పర్యవేక్షణ వీలవుతుందని, సమస్యల పరిష్కారానికి తగిన వేదిక ఏర్పడుతుందనీ ప్రభుత్వం వాదిస్తోంది.

కానీ అవినీతి లేనిదెక్కడ? అవినీతిని రూపు మాపడం కోసం ఈ కొత్త కమిషన్‌ని ఏర్పాటు చేయాలని చెప్పే అమాత్యుల్లో ఎంతమంది లంచగొండులున్నారు? ఐదేళ్ల పరిపాలనా కాలంలో వారి ఆస్తులు ఎంత పెరిగాయో లెక్కలు తీసి ఫాస్ట్ కోర్టులకి అప్పగించాలని జస్టిస్ చలమేశ్వర్ సూచించారు. 34 శాతం కొత్త ఎంపీల మీద క్రిమినల్ కేసులు ఉన్నాయని ప్రజాస్వామిక సంస్కరణల సంస్థ (ఏడీఆర్) నిర్ధారించింది. డాక్టర్లు ఎన్నుకున్న ఎంసీఐలో 120 మంది సభ్యులు ఉంటారు. వీరిలో కొందరు అవినీతిపరులున్నారనే నెపంతో ఆ సంస్థనే రద్దు చేస్తే, మరి పై అంచనాల ప్రకారం అసెంబ్లీలు, పార్లమెంట్‌లు ఏమవ్వాలి? ఈ కమిషన్ సూచించే నియంత్రణలన్నీ ప్రభుత్వ కళాశాలలకి మాత్రమే వర్తిస్తాయి. అలాంటప్పుడు సమానత్వం ఎక్కడిది? ఒకే రకమైన, నాణ్యమైన విద్య ఎక్కడిది? ప్రైవేటు కళాశాలలకి నియమ నియంత్రణలు ఉండవు. తనిఖీలు ఉండవు. నామమాత్రపు అనుమతితో కాలేజీ పెట్టవచ్చు. సీట్లు పెంచుకోవచ్చు. దాదాపు 80 మంది ఎంపీలకు ప్రైవేటు వైద్య కళాశాలలతో సంబంధాలున్నాయి. వాటి యజమానులుగానో, ట్రస్టీలుగానో, మేనేజింగ్ భాగస్వాములుగానో వాటిలో వారి ప్రమేయం ఉంది. అందుకే నియంత్రణలో ఈ పక్షపాత వైఖరి.

ప్రైవేటు వైద్య కళాశాలలు 90వ దశకం తర్వాత విపరీతంగా పుట్టుకొచ్చాయి. వాటిని నియంత్రించి, ప్రమాణాలకి చేరని వాటిని రద్దుచేసి, మిగిలిన వాటిని ప్రభుత్వపరం చేయాలి. అప్పుడు నియంత్రణ సజావుగా, సమానంగా ఉంటుంది. అంతేగానీ, హెచ్చుతగ్గులను అలాగే ఉంచి, సమానత్వం ఎలా సాధిస్తారు? ప్రస్తుతం ప్రైవేటు కళాశాలల్లో, డీమ్డ్ యూనివర్సిటీల్లో 80 శాతం సీట్ల ఫీజుని ప్రభుత్వం నిర్ణయిస్తుంటే, 15 శాతం సీట్లు ప్రైవేటు కాలేజీ చేతిలో ఉండేవి. ఇప్పుడు ఈ బిల్లులో దాన్ని 50 శాతం చేశారు. ఇది పేదలకి ఎలా ఉపకరిస్తుంది? అందుకే దీన్ని 'ప్రజా వ్యతిరేక, పేదల వ్యతిరేక బిల్లు'గా డాక్టర్లు అభివర్ణిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో డాక్టర్లని పెంచే దిశగా ఈ బిల్లుని ఏర్పరిచామని చెప్పే ప్రభుత్వం ఇలా ధనికులకి కోటాని పెంచి, పేదలకి అవకాశాలు తగ్గించేస్తోంది.

కమ్యూనిటీ హెల్త్ ప్రొవైడర్లుగా కొందరికి లైసెన్స్ ఇచ్చే అధికారం ఈ కమిషన్‌కి ఉంది. ఈ మధ్యస్థాయి ప్రాక్టీషనర్ల స్థాయి ఏమిటనేది స్పష్టం చేయడం లేదు. కానీ వారు ప్రాథమిక వైద్య స్థాయిలో కొన్ని మందులు వాడవచ్చని ప్రతిపాదించారు. ఎంబీబీఎస్ కాని వారికి ఆరు నెలల బ్రిడ్జి కోర్సు కలిగించి వారిని గ్రామీణ డాక్టర్లుగా గుర్తించే ప్రతిపాదనని అందరూ అడ్డుకోగా, ఇప్పుడు మాటలు మార్చి, అదే ప్రతిపాదనని దొడ్డితోవన తీసుకొచ్చి, నకిలీ డాక్టర్లకి అవకాశం కల్పిస్తున్నారు. అల్లోపతి డాక్టర్లు పల్లెలకు పోవడం లేదని, పల్లెల్లో ఆరోగ్య వ్యవస్థని పటిష్టం చేయడం కోసం ఈ చర్య తప్పదని అంటున్నారు. మనం ప్రతి ఏటా 60 వేల మంది డాక్టర్లని తయారు చేస్తున్నాం. వారిలో కొద్దిమందికి మాత్రమే కాంట్రాక్టు ఉద్యోగాలు దొరుకుతున్నాయి. మిగిలినవారు పల్లెలకి పోతామని, దానికి తగిన వసతులు కల్పించమని, జీతాలు తగినట్టు ఇవ్వమని చెబుతూ కొన్ని సౌకర్యాలు ఇవ్వమని కోరుతున్నారు. కానీ ఈ నిరుద్యోగుల మొర ఆలకించకపోగా, నిపుణులని పక్కకి నెట్టి, అరకొర వైద్యం తెలిసిన వారిని అందలం ఎక్కించి ప్రజారోగ్యాన్ని పణంగా పెడుతున్నారు.




ఏ రంగానికి ఆ రంగాన్ని వృద్ధి చేయకుండా, అడ్డదారిలో వైద్యాన్ని ప్రవేశపెడితే, ఆయుష్ విద్యార్థులు మాత్రం తమ ప్రమాణాలని ఎలా పెంచుకోగలరు? వైద్య రంగానికి బడ్జెట్ కేటాయింపులు పెంచి, ప్రభుత్వ వైద్య సంస్థల ప్రమాణాలని పెంచి, అల్లోపతి డాక్టర్ల నియామకాలను పెంచితే సమస్య పరిష్కారం అవుతుంది కానీ ఇలా చిట్కాలతో సమస్య తీరదు. నిజానికి మనకి డాక్టర్ల కొరత లేదు. స్పెషలిస్టుల కొరత ఉంది. పీజీ సీట్లు పెంచి, వారి నైపుణ్యాన్ని పెంచి, వారిని ప్రభుత్వ రంగంలో నిలిపి ఉంచుకోగలిగితే వైద్య రంగం పురోగమిస్తుంది. కానీ అన్ని రంగాల్లో లాగానే వైద్య రంగంలో కూడా కార్పొరేట్లకి రాయితీలు ఇస్తూ ప్రాథమిక వైద్య సేవలని దెబ్బ తీస్తున్నారు.

మన దేశంలో ప్రాథమిక ఆరోగ్య విధానం దిగజారిపోతోంది. వ్యాధి నిరోధక శక్తిని పెంచే విధానాలు అంటువ్యాధులని నియంత్రించే ప్రాథమిక సూత్రాలు అడుగంటిపోతున్నాయి. జీవన విధాన మార్పులతో వచ్చే వ్యాధులకి మాత్రమే ప్రాధాన్యతనిచ్చే కార్పొరేట్ వైద్యం రాజ్యమేలుతోంది. ప్రజల జీవన ప్రమాణాలని పెంచే ప్రాథమిక ఆరోగ్య సేవలు నత్తనడకన సాగుతున్నాయి. దీన్ని సరిచేయడానికి ఫ్యామిలీ మెడిసిన్ ప్రాముఖ్యతని అన్ని దేశాలూ గుర్తిస్తున్నాయి. కానీ మన దేశంలో మాత్రం ఈ నిపుణుల సేవలని అందిపుచ్చుకోవడంలో విఫలం అవుతున్నాం. అన్ని వయసుల వారిని, అన్ని ప్రాథమిక వ్యాధులని పరీక్షించగల నైపుణ్యంగల ఈ డాక్టర్లని, ఈ రంగాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. ప్రాథమిక వైద్య కేంద్రాల్లో వీరి సేవలను ఉపయోగిస్తే ప్రాథమిక స్థాయిలో ఆరోగ్యం మెరుగుపడుతుంది.

ఏ వృత్తికి ఆ వృత్తి స్వయం నిర్ణయాధికార హక్కు ఉండాలి. అలా వైద్య వృత్తిని వైద్యులు నియంత్రించాలిగానీ ప్రభుత్వాలు కాదు. ప్రైవేటు కళాశాలలని ప్రభుత్వపరం చేయడానికి బదులు వారికి 50 శాతం సీట్ల ఫీజులపై పెత్తనాన్ని అప్పగించడం సమానత్వం ఎలా అవుతుంది? వైద్య విద్యని మేధ కాక డబ్బు నియంత్రిస్తే నీట్ ఎందుకు? నెక్స్ట్ ఎందుకు? కష్టపడి చదవడం ఎందుకు? పేదల నోట్లో మన్ను ఎందుకు? విద్యని కొనుక్కునే డాక్టర్లు సామాన్యుల ఆశాజ్యోతులవుతారా?

విద్య వైద్యం పూర్తిగా ప్రభుత్వపరంగా ఉండి ప్రజల అవసరాలను తీరిస్తేనే దేశం అభివృద్ధి చెందుతుంది. కానీ ప్రస్తుతం ఈ రెండు రంగాల్లో ప్రైవేటు సంస్థలు రాజ్యమేలుతున్నాయి. ప్రభుత్వం తన బాధ్యతని దులిపేసుకోవడంతో ప్రజలు 80 శాతం వైద్య ఖర్చులను తామే భరిస్తూ నిరుపేదలవుతున్నారు. రైతుల ఆత్మహత్యలకి కారణాల్లో వైద్య పరమైన అప్పులు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయంటే అతిశయోక్తి కాదు.

సేవా రంగాలను వ్యాపార రంగాలుగా మార్చడం మానాలి. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు పెంచి, అందులో నైపుణ్యం గల డాక్టర్లని నియమించి, వైద్య విద్యా ప్రమాణాలను పెంచి, వాటి అనుబంధ ఆసుపత్రులకి కేటాయింపులు పెంచి, నాణ్యమైన పరికరాలు అందిస్తే వైద్యం అందరికీ అందుబాటులోకి వస్తుంది.

ప్రాథమిక ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టి ప్రజల జీవన ప్రమాణాలను పెంచాలే తప్ప, అవకతవక సంస్కరణలతో వారిపై భారాన్ని పెంచి వారి ఆరోగ్యాన్ని దెబ్బతీయకూడదు. క్యూబా, థాయ్‌లాండ్, యూరప్ వంటి చోట్ల ఉన్న మెరుగైన వైద్య ఆరోగ్య సేవల అనుభవాన్ని అధ్యయనం చేసి మన వైద్య రంగాన్ని మెరుగుపర్చుకోవాలి. లేదంటే, ఈ తప్పుడు విధానాల వల్ల అంటువ్యాధులు ప్రబలి, జాతీయ భద్రతకే ముప్పు వాటిల్లవచ్చు.

మనవైద్య రంగాన్ని నిర్వీర్యపరిచే ఇలాంటి బిల్లులు సమానత్వాన్ని చాటలేవు. వైద్యాన్ని మొత్తంగా ప్రభుత్వపరం చేసి, ప్రభుత్వ ఆసుపత్రులను మెరుగుపరిచే విధానాలు మాత్రమే ప్రజల ఆరోగ్యాన్ని సంపూర్ణంగా కాపాడగలవు. సేవా రంగాన్ని వ్యాపారం మింగేస్తే అలాంటి దేశానికి భవిష్యత్తు ఉండదు.

**డాక్టర్ నళిని, పిల్లల వైద్య నిపుణులు**

**సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!**




**సోషల్ మీడియా**

### ధనమూలం...



"ఎవరినైనా డబ్బుతో కొనేయగలమని కాంగ్రెస్ భావిస్తుంటుంది. అందువల్లే జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ కశ్మీర్ పర్యటనపై కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గులాం నబీ ఆజాద్ తప్పుడు వ్యాఖ్యానాలు చేస్తున్నారు. ఆజాద్ పలు సంవత్సరాలు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేశారు. కానీ ఆయనకు అక్కడి ప్రజలపై ఎటువంటి అభిప్రాయం ఉందో ఆజాద్ తాజా ప్రకటనలే చెబుతున్నాయి"

– ప్రీతీ గాంధీ, ఇన్‌చార్జి, బీజేపీ సోషల్ మీడియా విభాగం

### తారుమారు



"కేంద్రం తీసుకున్న చర్యలపై పాకిస్తాన్ తీవ్రంగా స్పందించింది. ఇరు దేశాల మధ్య విమాన రాకపోకలు రద్దు, వాణిజ్యానికి వీడ్కోలు, దౌత్యపరమైన సంబంధాల స్థాయి తగ్గింపు వగైరా వగైరాలు అందులో ఉన్నాయి. ఇవన్నీ భారత్–పాకిస్తాన్ సంబంధాల్లో నిరంతరం జరుగుతున్నవే. కాకపోతే ఈసారి పాత్రలు మారాయి. గతంలో ఉగ్రవాద కార్యకలాపాలను పాకిస్తాన్ ప్రోత్సహిస్తున్నదని ఆరోపిస్తూ మన దేశం ఈ తరహా కఠిన చర్యలు తీసుకునేది. ఇప్పుడు పాకిస్తాన్ అదే బాటలో పయనిస్తూ సరిగ్గా అలాంటి చర్యలే తీసుకుంది. ఏదో ఒక మార్పు ఉండాలిగా!"

– శేఖర్ గుప్తా, సీనియర్ జర్నలిస్టు

### గాంధీ సూక్తి



"సావర్కర్ అనుయాయులను ఉద్దేశించి 1909లో మహాత్మా గాంధీ ఒక మాటన్నారు. 'లక్ష్యసాధనకూ, అందుకోసం అనుసరించే మార్గానికీ మధ్య ఏ సంబంధమూ ఉండదనుకునే మీ విశ్వాసం తప్పు. దుర్గంధాన్ని వెదజల్లే మొక్కను పాతి, దానికి గులాబి పూస్తుందనుకోవడం లాంటిదే ఇది' అని అప్పట్లో ఆయనన్నారు. కశ్మీర్ విషయంలో కేంద్ర ప్రభుత్వ ప్రస్తుత వైఖరికి ఇది నూటికి నూరు శాతం సరిపోతుంది"

– రామచంద్ర గుహ, చరిత్రకారుడు

### నిరాశ



"కశ్మీర్‌పై మన ప్రభుత్వం తీసుకున్న చర్యలకు నిరసనగా హిందీ చిత్రాలను నిషేధిస్తూ పాకిస్తాన్ చర్య తీసుకుంది. దీనివల్ల ఆ చిత్రాల్లో తమను తాము చూసుకుని ఆస్వాదించే పాకిస్తాన్ అభిమానులు ఎంతో నిరాశ, నిస్పృహలకు లోనయ్యారు. వాణిజ్యమూ అంతే. భారత్ మార్కెట్లో ముమ్మరంగా వ్యాపారం చేసుకునే పాక్ వ్యాపారవేత్తలు అక్కడి పాలకుల చర్యవల్ల ఎంతో నష్టపోయారు"

– శశిథరూర్, కాంగ్రెస్ నేత

### జోస్యం



"ఇవాళ పర్యావరణ ముప్పుపై 'న్యూయార్క్ టైమ్స్'లో వచ్చిన వ్యాసం అందరి కళ్లూ తెరిపించాలి. ఇప్పుడున్న జలసంక్షోభం విస్తృతి ఎంతో ఆ వ్యాసంతోపాటు ఉన్న పటం ద్వారా చూపించారు. అంతేకాదు, ముందు ముందు ఎలాంటి ప్రమాదకర పరిస్థితుల్లో కూరుకుపోతామో కూడా తెలిపారు. ప్రపంచ మానవాళిలో 25 శాతంమంది ఈ సంక్షోభానికి లోనవుతారని చెబుతున్న ఆ వ్యాసం అందరిలో ఆందోళన కలిగిస్తుంది"

– శేఖర్ కపూర్, చలనచిత్ర దర్శకుడు

## అడవి ఆదివాసులదే!

ఆదివాసులు వేల సంవత్సరాల నుండి పోడు వ్యవసాయం చేస్తూ అడవుల్లోనే జీవిస్తున్నారు. కానీ భూమిపై తమ హక్కు కోసం ఆదివాసులు చేయని పోరాటం లేదు. చేయని ఉద్యమం లేదు. నిజాంకు వ్యతిరేకంగా పోరాడి విజయం సాధించిన వీరుడు కొమురం భీం. మన్యం ప్రాంతంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడి విజయం సాధించిన వీరుడు అల్లూరి సీతారామరాజు. జార్ఖండ్ ప్రాంతంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన వాడు బిర్సాముండా. సమ్మక్క, సారలమ్మ పన్ను రద్దు కోసం కాకతీయులపై పోరాడి విజయం సాధించినటువంటి వీర వనితలు. బ్రిటిష్ శాస్త్రవేత్త అయిన హైమాన్ డార్ఫ్ ఆదివాసుల జీవన విధానం పట్ల ఆకర్షితుడై ఆదిలాబాద్ జిల్లా జైనూర్ మండలంలోని మార్లవాయి గ్రామంలో తన నివాసం ఏర్పర్చుకున్నారు. కానీ నేడు ఆదివాసులను అడవులకు దూరం చేసే కుట్రలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమగ్నమై ఉన్నాయి. నల్లమలలో యురేనియం తవ్వకాల పేరుతో అక్కడి చెంచుల్ని, గోదావరి పరివాహక ప్రాంతంలో ఓపెన్ కాస్టు పేరుతో అక్కడి ఆదివాసీలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా దోపిడీ చేస్తున్నాయి. అలాగే అమ్రాబాద్, కవ్వాల్‌లలో టైగర్ జోన్‌ల పేరుతో స్థానిక ఆదివాసీ గూడేలని ఖాళీ చేయిస్తున్నారు. అధికార మార్పిడి తర్వాత దేశీయ పాలకులు ఆదివాసీల సర్వ హక్కులను రద్దు చేశారు. కేంద్రం అడవిలో నుండి ఆదివాసీలను గెంటి వేసే ప్రక్రియను, రాష్ట్రం హరితహారం పేరుతో పోడు భూములను గుంజుకునే ప్రక్రియను మొదలెట్టాయి. ప్రభుత్వాలు ఇప్పటికైనా ఆదివాసుల జీవన విధానాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

(నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం)

**కల్యాణ్ ప్రభ, హైదరాబాద్ | 93477 78790**

# మోదీ పూసిన మలాము

**విశ్లేషణ**



**మాడభూషి శ్రీధర్**

రాజ్యాంగం (జమ్మూకశ్మీర్‌కు వర్తింపు) ఉత్తర్వు 2019 అనే పేరుతో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఒక ఉత్తర్వు జారీ చేశారు. అది గెజిట్‌లో ప్రచురించి దాని ప్రతిని అమిత్ షా పార్లమెంటులో ప్రకటించి తర్వాత తీర్మానంగా మార్చి ఓటింగ్‌కు పెట్టారు. పార్లమెంటు ఆమోదించిన తరువాత కేంద్ర మంత్రి మండలి.. రాష్ట్రపతి చేత ఉత్తర్వు సంతకం చేయించిందని అనుకోవాలా? లదాఖ్‌ను జమ్మూకశ్మీర్ నుంచి విడదీసి రెండింటినీ విడివిడిగా కేంద్ర పాలిత ప్రాంతాలుగా ప్రకటించే జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ బిల్లు 2019 రాజ్యసభ ఆమోదం కూడా పొందింది. జమ్మూకశ్మీర్‌కు ఇక గవర్నర్ ఉండరు. కేంద్ర హోంమంత్రికి నివేదించే కింది ఉద్యోగిగా లెఫ్టినెంట్ గవర్నర్ ఉంటారు. కశ్మీర్ సీఎం కన్నా శ్రీనగర్ మేయర్‌కు ఎక్కువ అధికారాలుంటాయి. ఆర్టికల్ 370 రాజ్యాంగం 21వ భాగంలోని అనేక ప్రత్యేక తాత్కాలిక నియమాలలో ఒకటి. దీన్ని అనుసరించి 1954 ఆర్డర్ ద్వారా రాష్ట్రపతి ఆర్టికల్ 35ఎ చేర్చారు. ఇది రాజ్యాంగం ప్రధానభాగంలో కనిపించదు. చివరన అనుబంధం1లో ఉంటుంది. జమ్మూకశ్మీర్ శాశ్వత నివాసులెవరు, వారి ప్రత్యేక హక్కులు అధికారాలు ఏమిటి అని ఇది వివరిస్తుంది. 35ఏని రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చకుండా 370 దారిలో చేర్చడం తప్పు అని వాదిస్తూ ఒక పిటిషన్ ఇంకా విచారణలో ఉంది.

ఆర్టికల్ 370 తాత్కాలిక నియమం. దీన్ని మార్చాలన్నా, తొలగించాలన్నా, కొనసాగించాలన్నా అధికారం జమ్మూకశ్మీర్ రాజ్యాంగ నిర్ణాయకసభకు మాత్రమే ఉంది. రాజ్యాంగసభ తమకోసం రాజ్యాంగం రూపొందించి, ఆమోదించి, 370 కొనసాగించాలని నిర్ణయించి, అందులో మార్పులు చేయాలంటే రాజ్యాంగసభ సిఫార్సు అవసరమని నిర్ధారించి రాజ్యాంగ సభను రద్దు చేసింది. జనాభిప్రాయసేకరణ చేసి అందుకు అనుగుణంగా శాశ్వత నియమం చేసేందుకుగాను 370ని తాత్కాలికం అన్నారని రాజ్యాంగ నిపుణుల అభిప్రాయం. ఈ 370 ఒక మోసమని, ఈ తాత్కాలిక నియమం తొలగించాలని కుమారి విజయలక్ష్మి ఝా 2017లో ఢిల్లీ హైకోర్టులో యూనియన్ ఆఫ్ ఇండియా కేసును కొట్టివేశారు. (https://indiankanoon.org/doc/153910827/). రాజ్యాంగంలో తాత్కాలికం అని రాసి ఉన్నప్పటికీ 370 తాత్కాలికం కాదని ఏప్రిల్ 2018లో సుప్రీంకోర్టు మరో కేసులో చెప్పింది. 2017లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కేసు (https:// indiankanoon.org/doc/105489743/) వింటూ సుప్రీంకోర్టు జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదా ఇచ్చేందుకు చారిత్రక కారణాలు ఆధారమని సమర్థించింది. ఎస్‌బీఐ కేసులో సుప్రీం కోర్టు మన రాజ్యాంగం ఫెడరల్ రాజ్యాంగమనీ, కశ్మీర్‌కు ప్రత్యేక హోదా అవసరమనీ, 370 తాత్కాలికం కాదనీ మళ్లీ చెప్పింది. 369 ఆర్టికల్‌కు అయిదేళ్ల కాలపరిమితి ఉంది. 370లో అదేమీ లేదు. జమ్మూకశ్మీర్ రాజ్యాంగసభ ఆమోదం లేకుండా 370ని తొలగించడానికి వీల్లేదని సుప్రీంకోర్టు పునరుద్ఘాటించింది. పార్లమెంటుకు, రాష్ట్రపతికి 370(2) తాత్కాలిక నియమాల కింద లభించిన అధికారాలు జమ్మూకశ్మీర్ రాజ్యాంగసభ తుది ఆమోదంపైనే కొనసాగుతాయని 1959లో ప్రేమ్‌నాథ్ కౌల్ కేసులో అయిదుగురు జడ్జీల సుప్రీంకోర్టు ధర్మాసనం (https://indiankanoon.org/doc-/816126/) నిర్ణయించింది. జమ్మూకశ్మీర్ రాజ్యాంగసభ రద్దయిన తరువాత కూడా 370 కొనసాగుతుందని, అది ఎన్నడూ నిలిచిపోదని అయిదుగురు జడ్జీల సుప్రీంకోర్టు ధర్మాసనం వివరించింది.

ఏ ట్రీటీలో (ఒప్పందం), అక్సెసన్ డీడ్‌లో, కోర్టు తీర్పులో, చట్టంలో, నియమాల్లో, ఆచారంలో, వాడుకలో ఏమున్నా తమ ఉత్తర్వు మాత్రమే చెల్లుతుందని ఆగస్టు 5 నాటి రాష్ట్రపతి ఉత్తర్వులో పేర్కొన్నట్టు హోంమంత్రి పార్లమెంటు ఆమోదించిన తీర్మానంలో పేర్కొన్నారు. అంతకు ముందు 370ని కాంగ్రెస్ ప్రభుత్వాలు కూడా దారుణంగా దుర్వినియోగం చేశాయి. రాజ్యాంగంలోని కేంద్ర అధికారాల జాబితాలోని 97 ఎంట్రీలలో 94 జమ్మూకశ్మీర్‌కు వర్తింపచేశాయి కాంగ్రెస్ ప్రభుత్వాలు. 395 అధికరణాలలో 260 వర్తిస్తాయి. 12 షెడ్యూళ్లలో 7 వర్తిస్తాయి. జమ్మూకశ్మీర్ రాజ్యాంగంలో అనేకానేక సవరణలు చేసింది కేంద్రం. అన్నింటికీ మించి రాష్ట్రపతి పాలన విధించే 356 నిబంధన కూడ జమ్మూకశ్మీర్‌కు వర్తింపచేశారు. గవర్నర్‌ను శాసనసభ ఎంపిక చేయాలన్న రాష్ట్ర రాజ్యాంగ నియమాన్ని నీరుగార్చి గవర్నర్‌ను రాష్ట్రపతి నియమించాలన్న నియమాన్ని కూడా చాలా నిశ్శబ్దంగా అందరి ఆమోదంతో మార్చేశారు. నెహ్రూ పాలనలో 1954 ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ద్వారా దాదాపు మొత్తం రాజ్యాంగాన్ని, కొన్ని వివాదాస్పద సవరణ చట్టాలతో సహా జమ్మూ కశ్మీర్‌కు వర్తింపచేశారు. మిగిలిన అడుగూబొడుగూ నియమాలేవైనా ఉంటే మోదీ సర్కార్ వాటిని కూడా విస్తరించింది. ఇద్దరు ప్రధానులూ ఘోరాలు చేశారా, ఒకరిది ఘోర తప్పిదమా, మరొకరిది చరిత్రాత్మక విజయమా, ఎవరిదేది? ఎక్కువ రాజ్యాంగ నియమాలను కశ్మీర్‌కు వర్తింపచేసిన ప్రధాని ఎవరు అనే క్విజ్ పెడితే మోదీ గెలుస్తారా? షా నిలుస్తారా? మహావక్త, మంచి ప్రధానిగా పేరుతెచ్చుకున్న అటల్ బిహారీ వాజ్‌పేయీ కశ్మీరియత్, ఇన్సానియత్, జమ్హూరియత్ ద్వారా కశ్మీర్‌తో స్నేహ సౌహార్ద సంబంధాలు పెంచుకోవాలన్నారు. మరి నెహ్రూనే కాదు వాజ్‌పేయి కూడా ఘోరతప్పిదం చేసినట్టేనా?

వ్యాసకర్త బెన్నెట్ యూనివర్సిటీ ప్రొఫెసర్, కేంద్ర సమాచార మాజీ కమిషనర్
madabhushi.sridhar@gmail.com

## త్యాగదినం బక్రీద్

ఈదుల్ అజ్ హా ఒక పర్వదినం. మహత్తర త్యాగదినం. ప్రపంచంలోని ముస్లిం సోదరులంతా జిల్ హజ్ మాసం పదవ తేదీన పండుగ జరుపుకుంటారు. దీన్ని బక్రీద్ పండుగ అని కూడా అంటారు. ఇదేరోజు అరేబియా దేశంలోని మక్కా నగరంలో 'హజ్' ఆరాధన జరుగుతుంది. లక్షలాదిమంది యాత్రికులతో ఆ పవిత్రనగరం కళకళలాడుతూ ఉంటుంది. 'లబ్బైక్' నినాదాలు సర్వత్రా మిన్నంటుతూ ఉంటాయి. అల్లాహ్ ఆదేశాలను, ప్రవక్తవారి సంప్రదాయాలను పాటించడంలో భక్తులు నిమగ్నమై ఉంటారు. నేల ఈనినట్లు కనిపించే ఆ జనవాహినిలో 'తవాఫ్' చేసేవారు కొందరు, 'సఫా మర్వా' కొండల మధ్య 'సయీ' చేసేవారు కొందరు, 'జమరాత్'పై రాళ్ళు రువ్వేవారు కొందరు, 'జమ్ జమ్' జలం గ్రోలే వారు మరికొందరు.




యావత్ ప్రపంచ ముస్లిం సమాజానికి ప్రధాన పుణ్యక్షేత్రమైన మక్కాలో జరిగే హజ్ ఆరాధనకు, ప్రపంచవ్యాప్తంగా ముస్లిం సమాజం జరుపుకునే ఈదుల్ అజ్ హా (బక్రీద్ ) పండుగకు అవినాభావ సంబంధం ఉంది. ఈ పండుగకు, హజ్, ఖుర్బానీలకు మూలకారణం హజ్రత్ ఇబ్రాహీం అలైహిస్సలాం. ప్రపంచవ్యాప్తంగా ఈనాడు ముస్లిం సమాజం జరుపుకుంటున్నబక్రీద్ పండుగ ఆ మహనీయుల త్యాగస్మరణే. ఆర్థికస్తోమత కలిగినవారు హజ్ యాత్రకు వెళ్ళగలిగితే, స్తోమత లేనివారు తమతమ ఇళ్ళవద్దనే పండుగ జరుపుకుంటారు. ఖుర్బానీలు ఇస్తారు. అందుకని పండుగ సంతోషాన్ని గుండెల్లో నింపుకొని, హద్దుల్ని అతిక్రమించకుండా పండుగ జరుపుకోవాలి. సాటివారి సంక్షేమంకోసం ఎంతో కొంత త్యాగం చేసే గుణాన్ని అలవరచుకోవాలి. ఈవిధమైన త్యాగభావాన్ని మానవుల్లో జనింపజేయడమే ఈదుల్ అజ్ హా (బక్రీద్ ) పర్వదిన పరమార్థం.

(12–8–2019న బక్రీద్ పర్వదినం)

**– యండి. ఉస్మాన్ ఖాన్**

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

టోల్ ఫ్రీ నం: 1800 270 1083



చేనూతనం
ఫ్యాషన్
పేజీలో



స్క్రీన్
టెస్ట్

పుకార్లను
పట్టించుకోవడం
మానేశా

సినిమా పేజీలో



**భార్యాభర్తల గొడవల్లో**
**ఎవరూ తలదూర్చరు!**
**ఒక విషయంలోనైతే..**
**చట్టం కూడా జోక్యం చేసుకోదు.**
**ఆ విషయమే.. 'మ్యారిటల్ రేప్'!**
**ఏది అత్యాచారమో**
**చట్టం స్పష్టంగా నిర్వచించింది.**
**కానీ ఏ నిర్వచనంలోనూ..**
**భార్య సమ్మతి లేకుండా భర్త**
**ఆమెను లోబరుచుకోవడం**
**అత్యాచారం అని చెప్పలేదు!**
**దీనిపై 'రిట్' (యదార్థం) అనే సంస్థ**
**ఒక ఉద్యమం ప్రారంభించింది.**
**మ్యారిటల్ రేప్‌ను**
**శిక్ష వేయవలసిన నేరంగా**
**గుర్తించాలని కోరుతోంది.**




# ప్లీజ్ అరెస్ట్ మీ

క్యాబ్ పోలీస్ స్టేషన్ ముందు ఆగింది. క్యాబ్‌లోంచి దిగాడు అతను. దిగే ముందు కొన్ని క్షణాలు క్యాబ్‌లోనే ఆలోచిస్తున్నట్లుగా కూర్చుని, ఆ తర్వాత దిగాడు. వయసు ముప్పై, ముప్పై ఐదు మధ్య ఉంటుంది. గళ్ల చొక్కా. నెరిసిన గడ్డం, కళ్లద్దాలు. ఎత్తుగా, బలంగా ఉన్నాడు. కానీ మనిషి నలిగినట్లుగా ఉన్నాడు. ముఖంలో బాధ. వడివడిగా స్టేషన్‌లోకి నడిచాడు. కంప్లయింట్ డెస్క్ దగ్గర ఆగాడు.

''సర్, నేను ఫిర్యాదు ఇవ్వాలి''.

డెస్క్ మీద ఇద్దరు పోలీసు సిబ్బంది ఉన్నారు. ఫిర్యాదులు తీసుకునే స్టాఫ్ వాళ్లు. వాళ్లలో ఒకతను అతడి వైపు తలెత్తి చూశాడు.

ఆ వచ్చినతను మళ్లీ చెప్పాడు. ''సర్, నేను కంప్లయింట్ ఇవ్వాలి''.

''నేరం ఏమిటి?''

''రేప్, సర్''

'రేపా!! నాతో రా''.. పైకి లేచాడు ఆ పోలీస్ క్లర్క్. ఇద్దరూ లోపల ఇంకో గదిలోకి వెళ్లారు.

''చెప్పండి.. బాధితురాలు ఎవరు?''.. కంప్లయింట్ రాయబోతూ అడిగాడు పోలీస్ క్లర్క్.

''నా భార్య సర్. ఆమెపై అత్యాచారం జరిగింది''

''ఆమెను రేప్ చేసిన వారెవరో మీకు తెలుసా?''

''తెలుసు సర్''

''ఎవరు?''

''నేనే సర్. నేనే నా భార్యను రేప్ చేశాను. ప్లీజ్ నన్ను అరెస్ట్ చెయ్యండి సర్'' అన్నాడు అతను! అతడి కళ్లలో నీళ్లు.

పోలీస్ క్లర్క్ కళ్లలో క్వొశ్చన్ మార్క్! భార్యను రేప్ చేయడం ఏంటి? రేప్ చేసినందుకు భర్తను అరెస్ట్ చెయ్యడం ఏంటి?

''నీకేమైనా మతిపోయిందా? తాగొచ్చావా?

''సర్, నేను తప్పు చేశాను. రాత్రి తనకస్సలు బాగోలేదు. కానీ నేను తనను బలవంత పెట్టాను. తను వద్దంటున్నా వినకుండా..'' ఆగాడతను.

''నువ్వామెను కొట్టావా?''

''లేదు సర్''

పోలీస్ క్లర్క్ ఇంటర్‌కమ్‌లో తన పై అధికారికి చెప్పాడు.. ''సర్, ఇక్కడ ఒకతను భార్యను రేప్ చేశానని, తనను అరెస్ట్ చెయ్యమని కంప్లయింట్ ఇవ్వడానికి వచ్చాడు'' అని చెప్పాడు.

''లోపలికి పంపించు'' అన్నాడు పోలీస్ ఆఫీసర్.

లోపలికి వెళ్లాడతను. అక్కడా అదే మాట. ''సర్.. నన్ను అరెస్ట్ చెయ్యండి''

''ముందు మీరు కూర్చోండి'' అన్నాడు పోలీస్ ఆఫీసర్.

కూర్చున్నాడు అతను.

''ముందొక మాట చెప్పండి. మీ భార్యకు 18 ఏళ్లు నిండాయా?''

''నిండాయి సర్. ఆమె వయసు 24''

''నిన్న రాత్రి ఆమెపై మీరు చెయ్యి చేసుకున్నారా?''


సమీర్


లాయర్ విక్రమ్ శ్రీవాత్సవ

''లేదు సర్''

''మీరు చెబుతున్న దానిని బట్టి మీరు మీ భార్య పట్ల ఏ విధంగానూ అనుచితంగా ప్రవర్తించలేదు. రేప్ చేశానని మాత్రం అంటున్నారు.''

> ### సెక్షన్ 375
>
> ఏది 'అత్యాచారం' అవుతుందనే విషయమై భారత శిక్షా స్మృతిలోని సెక్షన్ 375 ఆరు విధాలైన నిర్వచనాలను ఇచ్చింది. దాని ప్రకారం : 1) ఆమెకు ఇష్టం లేనప్పుడు, 2) ఆమె సమ్మతి లేనప్పుడు, 3) ఆమెను బెదిరించి, 4) పెళ్లి చేసుకుంటానని నమ్మించి, సమ్మతి పొంది లోబరుచుకున్నప్పుడు, 5)సమ్మతి తోనే అయినా, సమ్మతి ఇచ్చిన సమయంలో ఆమె మానసిక స్థితి సరిగా లేనప్పుడు, 6)సమ్మతి ఇచ్చినా, ఇవ్వకున్నా ఆమె వయసు 18 ఏళ్లు నిండనప్పుడు అది రేప్ కింద పరిగణించబడుతుంది. అయితే ఈ సెక్షన్‌లో ఎక్కడా కూడా 'మ్యారిటల్ రేప్' గురించి ప్రస్తావన లేదు!



''అవును సర్''

''కానీ చట్టప్రకారం భార్యను రేప్ చేయడం రేప్ అవదు. కనుక అది నేరం అవదు'' అన్నాడు పోలీస్ ఆఫీసర్. ''కనుక కంప్లయింట్ తీసుకోలేము'' అని కూడా చెప్పాడు. ''ఇది మీకు, మీ భార్యకు మధ్య పూర్తి వ్యక్తిగతమైన విషయం. మీరూ మీరూ పరిష్కరించుకోవలసిన సంగతి'' అన్నాడు.

''ఒకే సర్'' అన్నాడు అతను.

''మీరిక వెళ్లొచ్చు'' అన్నాడు పోలీస్ ఆఫీసర్.

అక్కడి నుంచి అతడు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ మాధుర్ వర్మ దగ్గరకు వెళ్లాడు.

''మ్యారిటల్ రేప్.. రేప్ కాదు'' అన్నారు ఆయన.

అక్కడి నుంచి అతను లాయర్ విక్రమ్ శ్రీవాత్సవ దగ్గరికి వెళ్లారు.

''చట్టంలో మ్యారిటల్ రేప్ అనే మాట లేదు. భార్య సమ్మతి లేకున్నా ఆమె నుంచి లైంగిక సుఖాన్ని పొందడం నేరం కాదు'' అన్నారు ఆయన.

ఇక అక్కడి నుంచి అతడు ఎక్కడికీ వెళ్లలేదు. బయటికి వచ్చి చేతుల్లో ముఖం దాచుకుని పెద్దగా ఏడ్చాడు. ఢిల్లీ అంతటికీ, దేశం అంతటికీ వినిపించేలా.. 'మ్యారిటల్ రేప్‌కి శిక్ష వేసే చట్టాన్ని తీసుకురండి' అని పెద్దగా అరచి చెప్పాలనిపించింది అతడికి.

చట్టం తేవడం తేలికా?

మగవాళ్లలో మార్పు తేవడం తేలికా?

కళ్లు తుడుచుకుంటూ ఆలోచిస్తున్నాడతడు. అతడి పేరు సమీర్. జర్నలిస్టు. సోషల్ యాక్టివిస్టు కూడా.

అతడిలా పోలీస్ స్టేషన్ గడప, పోలీస్ కమిషనర్ గడప, లాయర్ గడప ఎక్కి దిగడానికి మూడు రోజుల ముందు...

•••

సమీర్ ఆమె వైపు చూశాడు. ''మ్యారిటల్ రేప్ మీద ఒక చట్టాన్ని తేవలసిన అవసరం ఉందని ప్రభుత్వానికి, ప్రజలకు చెప్పేందుకు కొంతమంది బాధితురాళ్ల ఇంటర్వ్యూలు చేస్తున్నాను. వాటితో ఒక వీడియోను తయారు చేసి.. ముందు సోషల్ మీడియాలోకి పంపుతాం. తర్వాత న్యాయస్థానం దృష్టికి. తర్వాత ప్రభుత్వం దృష్టికి. భార్య అంగీకారం లేకుండా ఆమె నుంచి బలవంతంగా లైంగిక తృప్తిని పొందడం నేరం అనే చట్టం రావాలి. మన దేశంలో ఇంతవరకు అలాంటి చట్టం లేదు'' అన్నాడు.

''అవును. చట్టం రావాలి. వస్తే బాగుంటుంది'' అంది ఆమె.

''ఒక బాధితురాలిగా మీరేం చెప్పదలచుకున్నారో చెప్పండి. వీడియోలో మిమ్మల్ని చూపించం. మీ మాట మాత్రమే వినిపిస్తుంది'' నమ్మకం ఇచ్చాడు సమీర్. ఆమె చెప్పడం మొదలు పెట్టింది.

''మాకు పెళ్లయి ఆరేళ్లయింది. అతను చదువుకున్న వాడే. అన్నీ అర్థం చేసుకోగలిగిన వాడే. ఇది ఎందుకు అర్థం కాదో నాకు తెలియదు. ఒంట్లో బాగోలేనప్పుడు బలవంతం చేస్తాడు. అప్పుడెలాగో భరిస్తాను. మనసు సిద్ధంగా లేనప్పుడు కూడా ముందుకొస్తాడు. అది భరించలేకపోతాను. ఈ విషయం మీద చాలాసార్లు మా మధ్య మనస్పర్థలు వచ్చాయి. మాట్లాడుకోని రోజులు కూడా ఉన్నాయి. అప్పుడు కూడా 'నీ మాటల్తో నాకు పనేముంది' అన్నట్లుగా మీద పడేవాడు. ప్రతిఘటిస్తే అనరాని మాటలు అనేవాడు. చివరికి లోబరుచుకునేవాడు. ''ఛీ.. భార్యను బతిమాలుకునే ఖర్మ పట్టింది'' అని లేచి వెళ్లిపోయేవాడు. ఇదంతా కాదు.. ''బాగో లేదు'' అని చెప్పినప్పుడు.. కనీసం ''ఏం బాగో లేదు'' అని కూడా అడిగేవాడు కాదు. అది నన్ను ఇంకా బాధించేది. ఇప్పటికీ అంతే. ప్రతి రోజూ నాకీ నరకం ఉండాల్సిందే. భార్య విన్నపాన్ని మన్నించని వ్యక్తి భర్త ఎలా అవుతాడు!'' అందావిడ.


మాధుర్ వర్మ

ఆమెతో పాటు మరికొంత మందిని.. ఢిల్లీలోని వేర్వేరు ప్రదేశాలలో వేర్వేరు నేపథ్యాల బాధిత మహిళల్తో మాట్లాడాడు సమీర్.

**బాధితురాలు 1**

''ఇష్టం లేనప్పుడు బలవంతపెట్టడం అన్యాయం అనిపిస్తుంది. నేనేం బొమ్మను కాదు కదా. కానీ బొమ్మలా పడి ఉండాల్సిందే. భర్త భరించే వాడు కాకపోయినా పర్వాలేదు, భార్య 'ఇప్పుడు కాదు' అన్నప్పుడు అర్థం చేసుకునేవాడై ఉండాలి''

**బాధితురాలు 2**

''భార్యనైనా, ఇంకెవర్నైనా ఫోర్స్ చెయ్యడం కరెక్ట్ కాదు. భర్త ఆకలి అవుతోంది అంటే.. 'ఇదిగో చేసిపెట్టాను. ఆ డబ్బాలో ఉన్నాయి తిను' అని భార్య అనడం లాంటిది కాదిది. భార్యాభర్తల్లో ఒకరికి ఉత్సాహంగా ఉండి, ఇంకొకరికి ఉత్సాహం లేనప్పుడు.. ఉత్సాహం లేని వాళ్ల అభిప్రాయానికే రెస్పెక్ట్ ఇవ్వాలి. నా భర్తకు ఇది అర్థం కాదు. 'అదంతా నాకు తెలీదు' అనేస్తాడు. అప్పుడు.. ఇదేం నరకమని పారిపోవాలనిపిస్తుంది''.

**బాధితురాలు 3**

''అతను నా భర్త మాత్రమే. నా పై హక్కుదారు కాదు. కానీ హక్కుదారులా ప్రవర్తిస్తాడు. ఎంత హక్కుదారుకైనా కొన్ని హక్కులు ఉండవు. భార్యాభర్తలుగా మేమిద్దరం ఒకటే కావచ్చు. దేహాలుగా మాత్రం ఇద్దరం. ఒక దేహంలో 'సంసిద్ధత' లేనప్పుడు సంసిద్ధంగా లేని ఆ దేహాన్ని రెండో దేహం ఆక్రమించుకోవడం హక్కును కాలరాయడమే. చట్టం దృష్టిలో వైవాహిక అత్యాచారం.. అత్యాచారం కాకపోవచ్చు. మనిషిగా నా దేహంపై నాకు హక్కు ఉంటుంది. దాన్ని ఉల్లంఘించడం భర్త గానీ, ఇంకొకరు కానీ చేయతగని పని''.

**బాధితురాలు 4**

''నా బాధను అమ్మకు చెప్పుకున్నాను. ఇంకా, ఇంట్లోని మిగతా పెద్దవాళ్లయిన ఆడవాళ్లకూ. వాళ్లూ అర్థం చేసుకోలేదు. 'చిన్న చిన్న విషయాలకు కాపురాన్ని పాడు చేసుకోకు' అని సలహా ఇచ్చారు! చిన్న విషయమా ఇది. ఎలా హింస నుంచి తప్పించుకోవడం?''

ఇలా.. ఒక్కొక్కరిదీ ఒక్కో ఆవేదన.

''దీనిని మ్యారిటల్ రేప్ అంటారు. సమ్మతి లేకుండా దేహవాంఛను తీర్చుకోవడం. శిక్షార్హమైన నేరంగా దీనిని చట్టంగా తేవాలని మీరు అనుకుంటున్నారా?'' అని సమీర్ వాళ్లను అడిగాడు.

అవుననీ చెప్పలేదు. కాదనీ అనలేదు. కానీ.. భర్త అలా చేయకుండా ఉంటే బాగుంటుందని అన్నారు. ''చట్టం వస్తే అలా చేయకుండా ఉంటారేమో'' అని సమీర్ అన్నప్పుడు 'అయితే మంచిదే' అని మాత్రం అన్నారు!


అనూజా కపూర్

ఆ తర్వాత అనూజా కపూర్ అనే సైకాలజిస్టును కలిశారు సమీర్. ''కట్టుబాట్లు, కుటుంబ గౌరవాలకు ప్రాముఖ్యం ఇచ్చే సమాజంలో వ్యక్తిగతమైన సమస్యలు.. ముఖ్యంగా మహిళల సమస్యలు.. ఇంకా ముఖ్యంగా మహిళల వైవాహిక సమస్యలు అప్రాముఖ్యమైనవిగా కనిపిస్తాయి. అందుకే మ్యారిటల్ రేప్‌పై దాదాపుగా ఫిర్యాదులు ఉండవు. అయితే మ్యారిటల్ రేప్‌ను నేరంగా పరిగణించే ఒక చట్టమైతే రావలసి ఉంది'' అని అనూజా అన్నారు.

•••

'కట్టుకున్నదానిపై' సర్వహక్కులూ ఉంటాయని భావించే పురుషాధిపత్య సమాజం ఆలోచనను మార్చేందుకు ఢిల్లీలోని 'రిత్' అనే ఫౌండేషన్ సమీర్‌తో ఈ వీడియోను తయారు చేయించింది. 'రిత్' అంటే సంస్కృతంలో యదార్థం అని అర్థం. భార్యను రేప్ చేసిన భర్త పాత్రగా సమీర్‌ను చూపించింది 'రిత్'. ఆ పాత్ర తప్ప వీడియోలోని సన్నివేశాలన్నీ నిజమైనవి.

•

చెట్టు నీడ

## సహచరి

పూర్వం ఇశ్రాయేలు దేశంలో కరువు వచ్చింది. దాంతో అక్కడ నివసించే ఎలీమెలెకు అనే అతడు తన భార్య నయోమి, ఇద్దరు కుమారులతో కలిసి పొరుగు దేశమైన మోయాబు దేశానికి వలస వెళ్లాడు. వారు ఆ దేశంలో ఉన్న కొంత కాలానికి నయోమి భర్త చనిపోయాడు. తర్వాత తన ఇద్దరు కుమారులైన మహ్లోను, కిల్యోనుకు మోయాబు దేశపు యువతులైన ఓర్పా, రూతులతో వివాహ ం చేసిందామె. కొంతకాలానికి నయోమి ఇద్దరు కుమారులు మరణించారు.

ఇలా అనేక బాధలు అనుభవిస్తున్న నయోమికి తన దేశమైన యూదా బెత్లెహేములో దేవుడు కరువు లేకుండా ఆహారాన్ని ప్రసాదించాడని తెలుసుకొని, ఇరువురి కోడళ్లను పిలిచి – మీరు మీ పుట్టింటికి వెళ్లి మరలా వివాహం చేసుకుని బిడ్డలతో సుఖసంతోషాలతో జీవించండని చెప్పింది.

అందుకు తన పెద్ద కోడలు ఓర్పా దుఃఖంతో తన అత్తను ముద్దుపెట్టుకొని తిరిగి తన స్వజనుల వద్దకు వెళ్లిపోయింది. తన రెండవ కోడలు రూతు మాత్రం తన అత్తను హత్తుకొని ''నా వెంబడి రావద్దని, నన్ను విడిచి పెట్టుమనీ నన్ను బతిమాలుకొనవద్దు. నీవు వెళ్లే చోటికే నే నూ వస్తాను, నీవు నివసించు చోటే నేనూ ఉంటాను. నీ జనమే నా జనం. నీ దేవుడే నా దేవుడు... మరణం తప్ప మరి ఏదైనను నిన్ను నన్ను ప్రత్యేకించిన యెడల యెహోవా నాకు ఎంత కీడైనా చేయును గాక'' (రూతు 1:16–17) అని తన దేశాన్ని, స్వజనులను విడిచి తన అత్తతో కలిసి వెళ్లింది.



నయోమి వంటి మంచి మనస్తత్వం గల అత్తలు ఎందరుంటారు? సహచరులుగా వుంటూ మాట తప్పేవారు ఉన్న రోజుల్లో 'సహచరి' అంటే ఇలాంటి వారని నిరూపించిన రూతు వంటి ఉత్తమ స్త్రీలు ఎందరుంటారు? రూతు అంత మంచి మనస్తత్వం గలది కాబట్టే ఏసు తన పుట్టుకకు ఆమె వంశాన్నే ఎంచుకున్నారు.

– బి.బి.చంద్రపాల్ కోట

బ్యూటిప్స్

## మొటిమలు, మచ్చలు మాయం



ఎటువంటి దుష్ఫలితాలూ లేకుండా మొటిమలను, మచ్చలను సులువుగా తగ్గించుకునే ఔషధాన్ని ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు. అదెలాగో చూద్దామా...

**జాజికాయ, మిరియాలు, మంచి గంధం...**

ఈ మూడింటిని తీసుకుని ఒక్కొక్కటి విడివిడిగా ఒక రాయి మీద కొంచెం కొంచెం నీళ్లు జల్లుకుంటూ అరగదీయాలి. అలా అరగదీయగా వచ్చిన మూడు రకాల పేస్టులను ఒక చిన్న కప్పులోకి తీసుకుని ఒకదానితో ఒకటి బాగా కలపాలి.

ఆ మిశ్రమాన్ని పడుకునే ముందు మొటిమలు, మచ్చలు ఉన్న చోట రాసుకుని నిద్రపోవాలి. మరునాడు పొద్దున్నే లేచి ముఖాన్ని గోరు వెచ్చని నీటితో శుభ్రంగా కడుక్కోవాలి. ఈ విధంగా మూడు నుండి ఏడు రోజుల వరకు చేసినట్లయితే ఎలాంటి మొటిమలు అయినా, మొండి మచ్చలయినా సులభంగా తొలగిపోతాయి.



పోలీసమ్మ

# లా అండ్ లాలన

పోలీసు శాఖ అంటేనే మానవత్వం లేని శాఖగా అభివర్ణిస్తారు చాలా మంది. కానీ ఖాకీ డ్రెస్ వెనుక కాఠిన్యమే కాదు.. మానవత్వం, ప్రేమ కూడా ఉంటాయని నిరూపించారు సీఐ మాధవి.

**అమ్మతనానికి నిలువెత్తు నిదర్శనం**

కరీంనగర్ జిల్లా హుజురాబాద్ సీఐగా విధులు నిర్వహిస్తున్న వి. మాధవి మూడేళ్లక్రితం రాజన్న సిరిసిల్ల జిల్లాలో వేములవాడ రూరల్ సీఐగా పని చేసేవారు. ఆ సమయంలో కోనరావుపేట మండలం నిమ్మపల్లికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన భార్యాభర్తలు అనారోగ్యంతో మరణించగా వారి పిల్లలు అనాథలయ్యారని పత్రికల్లో చదివి అప్పటి డీఎస్పీ దామెర నర్సయ్యతో కలిసి వెళ్లి పరామర్శించారు. ఆ చిన్నారులను చూసి చలించిపోయిన మాధవి వారికి దాతల సాయంతో ఆర్థికంగా ఆసరా ఇప్పించారు. అంతేకాదు, పిల్లల్లో ఒకరైన భవానిని దత్తత తీసుకుని చదివించారు. భవాని టెన్త్‌లో 9.7 గ్రేడ్‌ను సాధించి రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎస్పీ, కలెక్టర్‌ల ప్రశంసలు అందుకుంది. భవానికి చదువుపై ఉన్న శ్రద్ధను గమనించిన మాధవి ఆమెను తన పిల్లలు చదివే కాలేజీలోనే చేర్పించి, ఆలనాపాలనా చూడడమే కాకుండా ఒక తల్లిగా మంచిచెడులు చెప్తూ ఇంటర్‌లో మంచి మార్కులు సాధించాలని ఆ దత్త పుత్రికకు స్ఫూర్తిని ఇచ్చారు. భవాని కష్టపడి చదివి ఇంటర్‌లో 969 మార్కులు సాధించింది. ప్రస్తుతం ఆమె హైదరాబాద్‌లోని ఒక మంచి కాలేజీలో ఇంజనీరింగ్ చదువుతోంది. తన 'పోలీస్ అమ్మ' కోరిక మేరకు సివిల్స్ సాధించడమే తన లక్ష్యమని చెప్తోంది భవాని.


ఎక్కడికి వెళ్లినా ఆడపిల్లల్ని ఎత్తుకుని ముద్దు చేయకుండా మాధవి ఉండలేరు

**మాటే మంత్రం**

స్టేషన్‌కి వచ్చే బాధితులతో ఒక పోలీస్‌గా కాకుండా ఒక ఆత్మీయురాలిగా మాట్లాడతారు మాధవి. కుటుంబ కలహాలతో తన దగ్గరకి వచ్చినవారికి క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు ఎంతటి ఉపద్రవానికి దారి తీస్తాయో చెబుతూ చక్కటి కౌన్సెలింగ్ ఇస్తారు. ఆమె మాట మంత్రంగా పని చేసి ఆ జంట కలిసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.


దత్తపుత్రిక గుమ్మడి భవానీతో సీఐ మాధవి

**ప్రకృతి ప్రేమికురాలు**

ఆమె ఏ స్టేషన్‌లో విధులు నిర్వహించినా అక్కడ పచ్చదనం కనిపించేలా చూస్తుంది. మానకొండూర్ పీఎస్‌లో సీఐగా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో పోలీస్‌స్టేషన్ పరిసరాలు ఉద్యానవనాన్ని తలపించేలా గార్డెనింగ్ చేయించింది. అందుకే జిల్లాలోనే అంతటి పచ్చదనం ఉన్న పోలీస్‌స్టేషన్‌గా గుర్తింపు తెచ్చుకుంది. ఇంత మంచి మనసున్న పోలీస్ మాధవమ్మ జీవితం కూడా పచ్చగా ఉండాలని కోరుకుందాం.

– **స్వర్ణ మొలుగూరి**, సాక్షి, హైదరాబాద్




సాక్షి
# ఫ్యామిలీ సినిమా

నల్లగొండ ॥ శుక్రవారం
9-8-2019

## లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సార్! నేనొక అమ్మాయిని లవ్ చేశాను. ప్రపోజ్ చేసి వన్ ఇయర్ అవుతోంది. ఇంతవరకు రిప్లై ఇవ్వలేదు. ఏం చెయ్యమంటారు? తను వేరే అబ్బాయితో చనువుగా ఉందని నేను ఫీల్ అవుతుంటే.. నేను అడగకుండానే "తను మా పెద్దమ్మ కొడుకు" అని నాకు వినిపించేలా.. వాళ్ల ఫ్రెండ్‌తో చెప్పింది. దాని అర్థమేంటో నాకు అర్థం కాలేదు. అప్పుడు నేను విన్నానో లేదోనని తొంగి చూసింది కూడా. ఇప్పుడు ఏం చేయమంటారు? మళ్లీ ప్రపోజ్ చేయనా సార్?

– రామారావు

నువ్వు తొంగి చూడన్నా!!

'అమ్మాయి హృదయంలోకా సార్?'

అవును నీలూ! అమ్మాయిలాగ తొంగి చూస్తే.. తనకు కూడా అర్థమవుతుంది నీలూ!!

'తొంగి చూసిన అమ్మాయికి ఏం అర్థమైంది సార్?'

రామారావు గిలగిలా కొట్టుకు చస్తున్నాడని తెలిసింది నీలూ!

'అయితే కావాలనే తొంగి చూసిందా సార్?'

పుండు మీద కారం జల్లి ఎలా ఉంటుందో చూసి నవ్వుకుంది నీలూ!

'తొంగి చూసిన అమ్మాయి హార్ట్‌లో ఏముందో మీకు ఎలా తెలుసు సార్?'

లాలిపాప్ కోసం సొంగలు కార్చుకుంటూ తిరుగుతున్న రామారావుని చూశాక ఏ పిల్లకైనా ఆటపట్టించాలని ఉండదా సార్?'

భలే కనిపెట్టావు నీలూ!

'అయితే.. రామారావు మళ్లీ ప్రపోజ్ చెయ్యడమే కరెక్ట్ సార్!' అని నవ్వింది నీలాంబరి.

lovedoctorram@sakshi.com

## కాసుకో సుడోకు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 8 | 5 | 4 | | | | | | 2 |
| | | 7 | | | 1 | | | |
| 1 | 3 | 9 | 4 | | | 8 | | |
| 5 | 7 | | 3 | 9 | | 4 | | |
| | 1 | | 2 | | 4 | | 6 | |
| | | 2 | | 1 | 5 | | 9 | 8 |
| | | 5 | | | 3 | 2 | 8 | 4 |
| | | | 5 | | | 6 | | |
| 4 | | | | | | 9 | 1 | 5 |

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 8 | 2 | 6 | 5 | 4 | 1 | 9 | 3 | 7 |
| 4 | 1 | 3 | 2 | 7 | 9 | 6 | 8 | 5 |
| 9 | 5 | 7 | 3 | 6 | 8 | 4 | 2 | 1 |
| 3 | 6 | 2 | 7 | 9 | 5 | 8 | 1 | 4 |
| 7 | 8 | 5 | 4 | 1 | 6 | 3 | 9 | 2 |
| 1 | 9 | 4 | 8 | 2 | 3 | 5 | 7 | 6 |
| 6 | 3 | 8 | 1 | 5 | 2 | 7 | 4 | 9 |
| 2 | 7 | 9 | 6 | 8 | 4 | 1 | 5 | 3 |
| 5 | 4 | 1 | 9 | 3 | 7 | 2 | 6 | 8 |

# టీజర్ వచ్చేస్తోంది


లొకేషన్‌లో సినిమాటోగ్రాఫర్ రిచర్డ్‌తో పూజ


వరుణ్ తేజ్

వరుణ్ తేజ్ విలనిజమ్ ఎలా ఉంటుందో చిన్న ప్రీ–టీజర్‌తో టీజ్ చేశారు 'వాల్మీకి' టీమ్. ఇప్పుడు టీజర్‌ను రెడీ చేస్తున్నారని తెలిసింది. హరీష్ శంకర్ దర్శకత్వంలో వరుణ్‌తేజ్, అథర్వ మురళి నటిస్తున్న చిత్రం 'వాల్మీకి'. పూజా హెగ్డే కథానాయిక. 14 రీల్స్ ప్లస్ బ్యానర్ నిర్మిస్తోంది. తమిళ చిత్రం 'జిగర్తండా' చిత్రానికి ఇది తెలుగు రీమేక్. ఇందులో వరుణ్ తేజ్ నెగటివ్ రోల్ చేస్తున్నారు. ఓ వారం పది రోజుల్లో చిత్రం టీజర్‌ను రిలీజ్ చేయడానికి టీమ్ ప్లాన్ చేస్తోందని తెలిసింది. షూటింగ్ కూడా చివరి దశకు వచ్చేసింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ జరుగుతోంది. మరో 10–15 రోజుల్లో షూటింగ్ మొత్తం పూర్తి చేసి, గుమ్మడికాయ కొట్టేస్తారని సమాచారం. సెప్టెంబర్ 13న విడుదల కానున్న ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జే మేయర్, కెమెరా: అయాంకా బోస్.

# ఫిట్ అవడానికే హీరోగా చేస్తున్నా


వీవీ వినాయక్

"నేను హీరోగా పరిచయం చేసిన సాయి శ్రీనివాస్‌కి 'రాక్షసుడు' సినిమాతో హిట్ రావడం చాలా ఆనందంగా ఉంది. తనకంటే కూడా నాకే ఎక్కువ సంతోషంగా అనిపించింది. దానికి కారణమైన రమేశ్ వర్మకి నా అభినందనలు'' అని డైరెక్టర్ వీవీ వినాయక్ అన్నారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమా పరమేశ్వరన్ జంటగా రమేష్ వర్మ పెన్మత్స దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రాక్షసుడు'. కోనేరు సత్యనారాయణ నిర్మించిన ఈ సినిమాని అభిషేక్ నామా ఈ నెల 2న విడుదల చేశారు. ఆ సినిమా మంచి హిట్ కావడం సంతోషంగా ఉందని వినాయక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ– "'రాక్షసుడు' నిర్మాత కోనేరు సత్యనారాయణగారి అబ్బాయి హవీష్ కూడా హీరోనే. అయినా కూడా 'రాక్షసుడు' కథకి సాయి కరెక్ట్‌గా సరిపోతాడని, నిర్మాణంలో ఎక్కడా రాజీ పడకుండా ఓ సూపర్‌హిట్ సినిమాని సాయికి అందించినందుకు మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. అందరూ రీమేక్ చేయడం చాలా ఈజీ అంటారు.. కానీ చాలా కష్టం. 'రాక్షసన్' తమిళ సినిమా నేను చూశా. మొదటి నుంచి చివరి వరకు ఆ సినిమా టెంపోని ఎక్కడా మిస్ అవకుండా రమేశ్ చాలా బాగా తెరకెక్కించాడు. డైరెక్షన్ వైపు ఎందుకొచ్చావని రమేశ్‌ని అడిగితే.. దాదాపు 800 సినిమాలకు డిజైనర్‌గా పనిచేశాను.. బోర్ కొట్టి డైరెక్షన్ వైపు వచ్చానని చెప్పడం నాకు చాలా బాగా నచ్చింది. అయితే డైరెక్షన్ ఎప్పుడూ బోర్ కొట్టదు.. నువ్వు ఇంకా మంచి మంచి సినిమాలు తీయాలి. సాయితో మళ్లీ హిట్ సినిమా తీయాలి. సాయికి ఇంకా మంచి హిట్లు రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా'' అన్నారు.

**ఈ సందర్భంగా విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఆయన బదులిస్తూ....**

- ఓ కమర్షియల్ హీరోగా ఇండస్ట్రీకి పరిచయం చేయాలంటే ఏ అంశాలు అవసరమో అవన్నీ సాయితో తీసిన 'అల్లుడు శీను'లో ఉన్నాయి. కొన్ని కథకి అవసరం లేకున్నా యాడ్ చేశాం.. ఎందుకంటే హీరోని (సాయి శ్రీనివాస్) ఎలివేట్ చేయడానికి చేసిన మ్యాజిక్ అది.. సినిమాకి అది బాగా వర్కవుట్ అయింది.
- ఈ మధ్య పేపర్లో చదివా.. 'మా అబ్బాయి శ్రీనుని 'రాక్షసుడు' సినిమాతో ప్రేక్షకులు నటుడిగా గుర్తించారు' అని బెల్లంకొండ సురేశ్‌గారు అన్నారు. అది అబద్ధం. 'అల్లుడు శీను' నుంచి 'రాక్షసుడు' వరకూ అన్ని సినిమాలకు సాయిని నటుడిగా గుర్తించారు ప్రేక్షకులు.
- తొలి సినిమా 'అల్లుడు శీను'కే ది బెస్ట్ ఇచ్చాడు. వినోదం పండించడం చాలా కష్టం.. కానీ ఆ సినిమాలో బాగా చేశాడు. 'రాక్షసుడు'లో కథ టెంపో ఏ మాత్రం తగ్గకుండా, బాగా ఇన్‌వాల్వ్ అయి నటించాడు.. దాంతో తనకు మంచి పేరొచ్చింది. తను ఏ పాత్ర అయినా చేయగలడు.
- 'అల్లుడు శీను' సినిమా వచ్చి ఐదేళ్లు అయిందంటే రోజులు ఎంత స్పీడుగా అయిపోతున్నాయా అనిపిస్తోంది. ఆ సినిమా నిన్నకాక మొన్ననే విడుదల చేసినట్లుంది నాకు. ప్రతి ఒక్కరూ సినిమా సినిమాకి కొంచెం నేర్చుకుంటూ ఉంటారు. సాయి మాత్రం అనుభవం ఉన్నవాడిలా అన్నీ ఒకే టేక్‌లోనే చేసేవాడు. నాకు చాలా సంతోషంగా, పెద్ద హీరోతో చేసినట్టు అనిపించింది. అప్పటికీ ఇప్పటికీ తనలో నాకు తేడా కనిపించడం లేదు. కథకు ఏది అవసరమో దాన్ని చేస్తున్నాడు. నేను–సాయి కలిసి మళ్లీ సినిమా చేయాలనుంది. అయితే పెద్ద సినిమా తీయాలి. అందుకు మంచి కథ కుదిరితే చేస్తాం.
- నేను సినిమా చేస్తున్నదే ఫిట్ అవడానికి.. అంతేకానీ హీరో అయిపోవాలని కాదు (నవ్వుతూ). బాడీ ఫిట్ అవడానికి ఏదో ఓ కారణం కావాలి.. అందుకు సినిమాని కారణంగా పెట్టుకుని చేస్తున్నా'' అంటూ హీరోగా తాను ఓ సినిమా కమిట్ అయిన విషయం గురించి చెప్పారు వినాయక్.

# డబుల్ మీనింగ్ కాదు.. సింగిల్ మీనింగ్‌లోనే రాశాను


రాహుల్

"నేను నటుడిగా చేసినప్పుడు దర్శకుడు ఏది చెబితే అది చేసేవాడిని. దర్శకుడిగా మారాక నాలో మానసిక ఆందోళన పెరిగింది. తర్వాతి రోజు షూటింగ్ ఉందంటే నాకు నిద్రపట్టదు. దర్శకుడిగా నేను నిద్రపోవడం నేర్చుకోవాలి'' అన్నారు నటుడు–దర్శకుడు రాహుల్ రవీంద్రన్. నాగార్జున, రకుల్‌ప్రీత్ సింగ్ జంటగా రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించిన చిత్రం 'మన్మథుడు 2'. నాగార్జున, పి. కిరణ్ నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా రాహుల్ చెప్పిన విశేషాలు.

- నాలుగు తరాలుగా పోర్చుగల్‌లో నివాసం ఉంటున్న ఓ తెలుగు కుటుంబానికి చెందిన కథ ఇది. ఇందులో నాగార్జునగారి క్యారెక్టర్‌కు డబుల్ లైఫ్ ఉంటుంది. అమ్మాయిలపై గౌరవం ఉంటుంది. కానీ కొన్ని సంఘటనల వల్ల వారితో ఎమోషనల్ ఎటాచ్‌మెంట్‌ను ఇష్టపడరు. నా సెకండ్ సినిమాకే నాగార్జున వంటి స్టార్ హీరోతో చేయడం లక్కీ అనిపించింది. మా సినిమాలో కొన్ని డబుల్ మీనింగ్ డైలాగ్స్ ఉన్నాయంటున్నారు. కానీ నేను వాటిని సింగిల్ మీనింగ్‌లోనే రాశాను. అవి నాటీగా ఉంటాయి కానీ ఇబ్బందిగా ఉండవు. హై రొమాంటిక్ సీన్‌తో టిక్కెట్లు అమ్మాలని ఒక్క షాట్ కూడా తీయలేదు. 'పిల్లలకు కోచింగ్ ఇవ్వాల్సిన వయసులో నువ్వు బ్యాటింగ్‌కు దిగుతావా?' అని రావు రమేష్‌గారు ట్రైలర్‌లో చెప్పిన డైలాగ్ కూడా చాలా నార్మల్‌గా రాసిందే. హీరో వయసు గురించి పంచ్ వేద్దామని రాసిన డైలాగ్ అది. ఓ సీన్‌ని డెవలప్ చేస్తున్నప్పుడు సమంత అతిథి పాత్రలో అయితే బాగుంటుందనిపించింది. నాగార్జునగారు కూడా అదే అన్నారు.
- యాక్టర్‌గా నార్మల్ సినిమాల్లో నటించను. నా దర్శకత్వంలో దగ్గుబాటి అభిరామ్ హీరోగా సినిమా చేయబోతున్నాడనే వార్తల్లో నిజం లేదు. సితార ఎంటర్‌టైన్మెంట్స్‌లో ఓ సినిమా గురించి చర్చలు జరుగుతున్నాయి.

**చిన్మయి (రాహుల్ భార్య) నాకు మంచి ఎమోషనల్ సపోర్టింగ్ సిస్టమ్. తన సపోర్ట్ లేకుండా నేను లేను. సంగీతమే ఆమె ప్రపంచం. సోషల్ మీడియాలో చిన్మయి ప్రస్తావించిన అంశాలు కొందరికి అర్థం కానప్పుడు స్పందిస్తాను. ప్రతి విషయానికీ స్పందించను.**

# పుకార్లను పట్టించుకోవడం మానేశా


అనసూయ

"ఎంబీఏ పూర్తి చేశాక ఉద్యోగం చేస్తున్న టైమ్‌లో పెళ్లి కుదిరింది. అప్పుడు ఉద్యోగం నుంచి బ్రేక్ తీసుకున్నప్పుడు ఓ యాడ్ చేశా. ఆ తర్వాత విజువల్ ఎఫెక్ట్స్ చేస్తున్నప్పుడు సినిమాల్లో నటించమని అవకాశాలొచ్చాయి. కానీ, మా పేరెంట్స్ ఒప్పుకోలేదు. పెళ్లి తర్వాత నా భర్త భరద్వాజ్ సపోర్ట్‌గా ఉండటం వల్లే ఈ స్థాయిలో ఉన్నా'' అన్నారు అనసూయ. 'క్షణం, రంగస్థలం' వంటి హిట్ చిత్రాల్లో కీలక పాత్రలు చేసిన అనసూయ లీడ్ రోల్ చేసిన చిత్రం 'కథనం'. రాజేష్ నాదెండ్లను దర్శకత్వంలో బి.నరేంద్రరెడ్డి, శర్మ చుక్కా నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా అనసూయ పంచుకున్న విశేషాలు.

- నేను ఇండస్ట్రీకి వచ్చి పదేళ్లవుతోంది. హీరోయిన్ కావాలనుకోలేదు. నాకు లీడ్ రోల్ చేసే అవకాశం వస్తుందని ఊహించలేదు. లీడ్ రోల్ అన్నది ఓ బాధ్యత కూడా. 'రంగస్థలం' సినిమాలో డైరెక్టర్ సుకుమార్‌గారు చెప్పింది చేశా. 'కథనం' సినిమాలోనూ అంతే. దర్శకుడు చెప్పింది చేశా.
- 'రంగస్థలం– కథనం' సినిమాలకి మధ్యలో దాదాపు 13 కథలు విన్నా. కొన్ని కథలు నచ్చకపోవడం ఓ కారణం.. కొత్త ప్రొడక్షన్ కంపెనీలు కావడంతో సినిమాని విడుదల చేస్తారో? లేదో? అనే మరో కారణంతోనూ చేయలేదు. ఓ సినిమా కోసం ఎంతో కష్టపడతాం. చేసిన పనికి గుర్తింపు రాకపోతే నేను ఒత్తిడికి లోనవుతా.
- రాజేష్‌కి 'కథనం' తొలి సినిమా అయినా చక్కగా తీశాడు. నా కోసమే ఈ కథ రాశాడేమో అనిపిస్తోంది. ఈ చిత్రంలో అను అనే అసిస్టెంట్ డైరెక్టర్ పాత్ర నాది. డైరెక్టర్ కావాలని కథలతో నిర్మాతలను కలుస్తూ ఇబ్బందులు పడుతుంటా. నేను రాసుకున్న ఓ కథ ప్రకారమే రెండు హత్యలు జరుగుతాయి. వాటిపై జరిగే విచారణ ఆసక్తిగా ఉంటుంది.
- నటిగా ఉండటం అదృష్టం.. దౌర్భాగ్యం కూడా. సోషల్ మీడియాలో నా గురించి రకరకాల పుకార్లు వస్తుంటాయి. వీటి గురించి మా ఇంట్లో వాళ్లు అస్సలు బాధపడరు.. మొదట్లో నేనే బాధపడేదాన్ని. ఆ తర్వాత పట్టించుకోవడం మానేశాను. నాకు 'బిగ్‌బాస్'లో అవకాశం వచ్చింది. కానీ, నా కుటుంబానికి నేను బానిస అయిపోయా. వారిని వదిలి అన్ని రోజులు ఉండలేననే చేయలేదు.
- 'క్షణం' నటిగా ధైర్యం ఇచ్చింది. 'రంగస్థలం'ని కన్నడ, తమిళ్, మళయాళంలో డబ్బింగ్ చేసి విడుదల చేశారు. ఆ చిత్రం రిలీజ్ తర్వాత ఆ భాషల నుంచి అవకాశాలు వచ్చాయి కానీ చేయలేదు. ప్రస్తుతం ఓ సినిమాలో సెకండ్ లీడ్ రోల్ చేస్తున్నా. మరో సినిమాలోనూ నటిస్తున్నాను.

# కొబ్బరి మట్టకు ఐదేళ్లు పట్టలేదు


షకీలా, సంపూర్ణేష్ బాబు, సాయి రాజేశ్, రూపక్, సందీప్ కిషన్

"ఒక వ్యక్తికి సినిమా పట్ల ఎంత ప్యాషన్ ఉంటుందో సాయి రాజేష్‌ని చూసి తెలుసుకోవచ్చు. మట్టి నుండి తెచ్చిన వినాయకుడి విగ్రహాన్ని మనం పూజిస్తామో.. అలా మట్టిలో నుంచి సంపూని తెచ్చి ఒక స్టార్‌ని చేయడానికి చాలా కష్టపడుతున్నారు. సంపూ ఎంత పెద్ద నటుడు అనేది ఆల్రెడీ ప్రూవ్ అయింది'' అని డైరెక్టర్ మారుతి అన్నారు. సంపూర్ణేష్ బాబు హీరోగా రూపక్ రొనాల్డ్ సన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కొబ్బరిమట్ట'. సాయి రాజేష్ నిర్మించిన ఈ సినిమా రేపు విడుదలవుతోంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో నిర్మాత 'మధుర' శ్రీధర్ మాట్లాడుతూ– "సంపూర్ణేష్ సినిమాలంటే చాలా ఇష్టం. ఈ సినిమా టీజర్, ట్రైలర్ చూశాక మళ్లీ మళ్లీ చూడాలనిపించే కథ అనిపించింది. అందుకే ఉదయం 8:45 గంటల ఆటకి టికెట్ బుక్ చేసుకున్నాను'' అన్నారు. "జంధ్యాల, ఈవీవీగార్ల వినోదం తర్వాత సాయిరాజేశ్ కామెడీ నాకు నచ్చుతుంది. రాజేష్, సంపూగారి వల్లే ఈ సినిమా చేశాను'' అన్నారు రూపక్ రొనాల్డ్ సన్. "ఈ సినిమా కోసం నేను, సంపు, రూపక్.. మా కెరీర్‌లను వదులుకుని మరీ చేశాం. 'కొబ్బరి మట్ట' ఐదేళ్లు చేశామని అంటున్నారు, కానీ మేం షూటింగ్ చేసింది 39 రోజులు మాత్రమే'' అన్నారు సాయి రాజేశ్. "నిజాయతీతో సినిమా చేసిన టీమ్ ఇది. తప్పకుండా సినిమా చూడండి'' అన్నారు హీరో సందీప్ కిషన్. "ఈ సినిమాలో భాగం అయినందుకు గర్వంగా ఉంది'' అన్నారు నటి షకీలా. సంపూర్ణేశ్ బాబు, నటులు శివ బాలాజీ, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

# తాతలా...


కరీనా, తైమూర్

బాలీవుడ్ స్టార్ కిడ్స్‌లో సైఫ్ అలీఖాన్, కరీనా కపూర్‌ల తనయుడు తైమూర్ అలీ ఖాన్ చాలా పాపులర్. తైమూర్ కూడా వాళ్ల తల్లీదండ్రుల్లా సినిమా ఫీల్డ్‌లోనే ఉంటాడు అనుకుంటారు ఎవరైనా. కానీ కరీనా మాత్రం తైమూర్ వాళ్ల తాతలా క్రికెటర్ కావాలనుకుంటున్నారు.

తైమూర్ తాతయ్య సైఫ్ అలీ ఖాన్ నాన్న మన్సూర్ అలీ ఖాన్ పటౌడి టీమ్ ఇండియా మాజీ కెప్టెన్. ఇంతకీ తైమూర్ వాళ్ల అమ్మానాన్నల్లా ఇండస్ట్రీలో హీరోగా బాక్సాఫీస్ బద్దలు కొడతాడా? అమ్మ కోరినట్టు క్రికెటర్‌గా బౌండరీలు బాదుతాడా? అనేది తెలియాలంటే ఇంకా కనీసం పదీ పదిహేనేళ్లయినా ఆగాల్సిందే.

# రాహు కాలంలో చిక్కుకుందా?


కృతి గార్గ్

బ్యాడ్ టైమ్‌లో బ్యాడ్ ప్లేస్‌లో ఓ అమ్మాయి చిక్కుకుంది. మరి ఆ చిక్కుల్లో నుంచి ఎలా తప్పించుకుంది? అనే కథాంశంతో రూపొందుతోన్న చిత్రం 'రాహు'. కృతి గార్గ్, అభిరామ్ వర్మ, కాలకేయ ప్రభాకర్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఏవీఆర్ స్వామీ, శ్రీ శక్తి బాబ్జి, రాజా దేవరకొండ, సుబ్బు వేదుల నిర్మిస్తున్న ఈ చిత్రానికి సుబ్బు దర్శకుడు. ఇటీవల రిలీజ్ చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌కు మంచి స్పందన లభిస్తోందని చిత్రబృందం తెలిపింది. "కొత్త దర్శకులు విభిన్న ఆలోచనలతో న్యూ ఏజ్ సినిమాలు తీస్తున్నారు. ఇది కూడా అలాంటిదే'' అన్నారు నిర్మాతలు. ఈ చిత్రానికి కెమెరా: సురేశ్ రగుతు, సంగీతం: ప్రవీణ్ లక్కరాజు.







టైగర్ ష్రాఫ్

ఫ్యాషన్

# చేనూతనం

చేనేత...
ఒకప్పుడు సంప్రదాయపు హంగు.
మలివయసు హుందాతనం.
చేనేత...
ఇప్పుడు నవతరపు ఐకాన్.
హుందాతనానికి, స్టైలిష్‌కి
పెట్టింది పేరు.
ఇప్పుడిక నిత్యం చేనూతనమై
వెలుగొందుతోంది చేనేత.



హ్యాండ్లూమ్స్ నేటి తరం మెచ్చాలి

నిఫ్ట్‌లో ఫ్యాషన్ డిజైనింగ్ చేశాను. పెళ్లయ్యాక హాబీగా చిన్న డిజైనర్ బొటిక్ స్టార్ట్ చేశాను. మా అన్నయ్య హేమంత్ కూడా టెక్స్‌టైల్ డిజైనర్. హ్యాండ్లూమ్స్ అంటే ఇద్దరికీ చిన్నప్పటి నుంచి చాలా ఇష్టం. ఇండియన్ సంస్కృతి ప్రతిబింబించేలా మోడ్రన్ డ్రెస్ డిజైన్స్ చేయాలనుకున్నాం. హేమంత్ ఓ ప్రమాదంలో చనిపోవడంతో తన కల నేను నెరవేర్చాలనుకున్నాను. అప్పటి నుంచి తన పేరుమీదుగా హేమంత్‌సిరి అనే లేబుల్‌తో డ్రెస్‌లను డిజైన్ చేస్తున్నాను. హ్యాండ్లూమ్ చీరలు చీరలుగానే కాకుండా వాటికి ఇండోవెస్టన్ లుక్ తీసుకురావాలని, నేటి తరానికి హ్యాండ్లూమ్స్‌ని దగ్గర చేయాలని, చేనేతకారులకు ఉపయోగపడాలనేది నా తపన. ఒక డ్రెస్ చూస్తే దాంట్లో డిజైనర్ టేస్ట్ కనిపించాలనుకుంటాను. అలా, ఈ మోడ్రన్ డిజైన్స్‌ని ఒక ఛాలెంజింగ్‌గా తీసుకున్నాను. కొందరు సినిమా సెలబ్రిటీస్‌కి, మిథాలీరాజ్ వంటి స్పోర్ట్స్ పర్సన్స్‌కి, మ్యాగజీన్ కవర్ పేజీ మోడల్స్‌కి డ్రెస్సులు డిజైన్ చేశాను. బెంగుళూర్ ఫ్యాషన్‌వీక్‌లో పాల్గొన్నాను. అనంతపూర్ దగ్గర నిమ్మలకుంట తోలుబొమ్మలకు ప్రసిద్ధి. ఆ తోలుబొమ్మల కాన్సెప్ట్ నా డ్రెస్ డిజైన్స్ మీదకు తీసుకున్నాను. ఈ జర్నీ మొదట హాబీగా స్టార్ట్ చేశాను కానీ, ఇప్పుడు ఇదే నా జీవితం అయ్యింది.

**- హేమంత్‌సిరి,**
మణికొండ, హైదరాబాద్



నీలంరంగులోని ఈ స్టైలిష్ కుర్తా, పైజామాను డిజైన్ చేసింది ఒక హ్యాండ్లూమ్ శారీతో. టాప్‌ని అంచులు అసిమెట్రికల్‌గా తీసుకున్నాం. కొంగుభాగాన్ని పొడవాటి చేతులకు డిజైన్ చేశాం.



క్యాజువల్ లుక్ కోసం డిజైన్ చేసిన మోడ్రన్ డ్రెస్సులివి. లాంగ్ గౌన్, మిడ్ ఫ్రాక్స్‌తో ఈ డిజైన్ డ్రెస్సులు యువతరాన్ని ఆకట్టుకుంటాయి.



టీనేజ్ అమ్మాయిల లుక్ మరింత స్టైలిష్‌గా మారిపోవాలంటే సింపుల్ టెక్నిక్ హ్యాండ్లూమ్ డ్రెస్ డిజైన్స్ అధునాతనంగా తీసుకోవడం. ఇక్కత్, నారాయణ్ పేట్ ఫ్యాబ్రిక్ కాంబినేషన్స్‌తో డిజైన్ చేసిన డ్రెస్ ఇది



టీనేజర్స్, యువకులు సంప్రదాయ హ్యాండ్లూమ్స్‌తోనూ స్టైలిష్‌గా ఇలా కనిపించవచ్చు. దీనికి బాటమ్‌గా ట్రౌజర్ లేదా ధోతీని ధరించవచ్చు.

నిర్వహణ:
**- నిర్మలారెడ్డి**



చేనేతకారుల చేతిలో రూపుదిద్దుకున్న ధర్మవరం చీరతో ఈ డ్రెస్‌ను డిజైన్ చేశాం. టాప్‌ని లేయర్డ్ ఫ్రిల్స్‌తో తీర్చిదిద్ది, అదే మెటీరియల్ పలాజోతో రూపుకట్టాం. దీంతో ఈ డ్రెస్‌కి ఒక స్టైలిష్ లుక్ వచ్చింది. ఈ డ్రెస్ పార్టీవేర్‌గానూ, క్యాజువల్ వేర్‌గానూ ధరించవచ్చు.



ఈ ఇండోవెస్టన్ డ్రెస్‌ను ఇక్కత్, నారాయణ్‌పేట్ శారీస్‌తో డిజైన్ చేశాం. ఇక్కత్ మెటీరియల్‌తో క్రాప్‌టాప్, పలాజో డిజైన్ చేశాం. దానికి పూర్తి కాంట్రాస్ట్ కలర్ బ్లూ నారాయణ్‌పేట్ శారీని తీసుకొని లాంగ్ జాకెట్‌ను రూపుకట్టాం. ఈ డ్రెస్ గెట్ టు గెదర్, ఈవెనింగ్ పార్టీలలో స్టైలిష్ లుక్‌తో ఆకట్టుకుంటుంది.





ఈ గౌన్ విత్ జాకెట్ స్టైల్ డ్రెస్‌ని మైకా ఫ్యాబ్రిక్‌తో డిజైన్ చేశాం. టీనేజర్స్, కార్పోరేట్ ఉద్యోగులు ఇలా హ్యాండ్లూమ్స్‌తోనూ ఆధునికతను హుందాగా చూపవచ్చు.



ఆర్గంజా సిల్క్ హ్యాండ్లూమ్ శారీకి ఇక్కత్ సిల్క్ ఫ్యాబ్రిక్‌ను అంచుగా జత చేశాం. ఈ స్టైల్ డిజైన్ ఫ్యాషన్ వేదికలలో ఆహూతులను అమితంగా ఆకట్టుకుంది.

## కాస్మటాలజి కౌన్సెలింగ్

### ప్రెగ్నెన్సీ తర్వాత ముఖం మీద నల్లమచ్చలు... ఎందుకిలా?

నా వయసు 28 ఏళ్లు. నా ముఖం మీద నల్ల మచ్చలు ఉన్నాయి. అవన్నీ ఒక రకమైన ఆకృతితో ఉన్నాయి. నా ప్రెగ్నెన్సీ తర్వాత ఈ మచ్చలు రావడం గమనించాను. ఫెయిర్‌నెస్ క్రీమ్స్ వాడుతున్నప్పటికీ ఇవి తగ్గడం లేదు. ఇవి రావడానికి కారణం ఏమిటి? నా సమస్యకు పరిష్కారం చెప్పండి.

**- అంబిక, వరంగల్**

మీ సమస్యను క్లో ఆస్మా లేదా మెలాస్మా అంటారు. ఈ సమస్య ఉన్నవారిలో ఒక రకమైన ఆకృతితో నుదుటిమీద, ముక్కు, చెంపల మీద నల్లమచ్చలు వస్తాయి. ఎలాంటి సంరక్షణ లేకుండా నేరుగా ఎండలో తిరుగుతూ సూర్యకిరణాలకు అదే పనిగా ఎక్స్‌పోజ్ అయినప్పుడు ఇవి రావడం జరుగుతుంది. ఇక ఫెయిర్‌నెస్ క్రీమ్ వాడటం వల్ల ఈ మచ్చలు తగ్గవు. మెడికల్ పీల్స్ చేయించుకోవడంతోపాటు, కొన్ని మెడికేటెడ్ క్రీమ్స్ వాడాల్సి ఉంటుంది. మీరొకసారి కాస్మటాలజిస్ట్‌ను సంప్రదించండి. ఇవి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూడా తెలుసుకోండి.



### బయట ఆహారం తీసుకున్న ప్రతిసారీ మొటిమలు!

నా వయసు 23 ఏళ్లు. తరచూ మొటిమలు వస్తున్నాయి. నేను బయట ఆహారం తీసుకున్నప్పుడల్లా ఇలా జరగడం చూస్తున్నాను. మొటిమల కారణంగా వచ్చిన మచ్చలతో నాకు తీవ్రమైన మనోవేదన కలుగుతోంది. మొటిమలు రాకుండా ఉండాలంటే ఎలాంటి ఆహారం తీసకూడదో చెప్పండి.

**- వంశీ, హైదరాబాద్**

మొటిమలు రావడానికి గల అనేక కారణాలలో ఆహారపు అలవాట్లు కూడా ముఖ్యమైనవి. కొంతమందికి పాలతో కూడిన పదార్థాల వల్ల ఇవి వస్తే, మరికొందరిలో చక్కెర ఎక్కువగా ఉండే పదార్థాలైన చాక్లెట్లు... అలాగే నూనెలు ఎక్కువగా ఉండే పదార్థాలు తిన్న తర్వాత ఇవి వస్తాయి. మీరు బయట తిన్న ప్రతిసారీ ఇవి కనిపిస్తున్నాయి కాబట్టి మీరు ఏ రకమైన ఆహారాలు తిన్న తర్వాత ఇవి వస్తున్నాయో గమనించండి. ఆ తర్వాత వాటిని అవాయిడ్ చేసి చూడండి. మీ ఆహారపు అలవాట్లను గమనించి, మీ డాక్టర్‌తో చర్చిస్తే మీకు సరిపడని ఆహారాలకు బదులు ఏవైనా ప్రత్యామ్నాయాలను వారు సూచించడం జరుగుతుంది. ఒకసారి డాక్టర్‌ను సంప్రదించండి.



## ఫ్యామిలీ డాక్టర్

### పాపల మాడు మీద విపరీతంగా దురద... తగ్గేదెలా?

నాకు ఇద్దరు పిల్లలు. పెద్ద పాపకు ఎనిమిదేళ్లు. రెండో పాపకు ఆరేళ్లు. ఇటీవల మా పిల్లలు రోజూ మాడును విపరీతంగా గీరుకుంటున్నారు. నిద్రలో మరీ ఎక్కువగా ఇలా చేస్తున్నారు. ఇద్దరూ ఇలా ఎందుకు చేస్తున్నారో అర్థం కావడం లేదు. మా పాపల విషయంలో తగిన పరిష్కారం సూచించండి.

**- శాంత, బెంగళూరు**

మాడు (స్కాల్ప్)పైన వాడే కొన్ని ఉత్పాదనలు (అంటే ఉదాహరణకు షాంపూ లేదా కొన్ని నూనెలు) పిల్లలకు సరిపడనప్పుడు ఇలాంటి సమస్యలు వచ్చేందుకు అవకాశం ఉంది. వారిద్దరూ స్కూల్‌కు వెళ్లే పిల్లలు కాబట్టి పేల ప్రభావం వల్ల కూడా ఇలా జరిగేందుకు అవకాశం ఉంది. పేలు ఒకరి నుంచి మరొకరికి చాలా సులభంగా వ్యాపిస్తాయి. కాబట్టి మీ పిల్లలిద్దరికీ ఒకేసారి దురదలు రావడం జరిగిందని అనుకోవచ్చు. దురద విపరీతంగా ఉంటే నిద్రకు ఆటంకం కలిగి వారి ఎదుగుదల అంశం కూడా ప్రభావితం అయ్యే ప్రమాదం ఉంది. కాబట్టి మీరు వెంటనే పిల్లలను డాక్టర్‌కు చూపించండి. సమస్యను బట్టి డాక్టర్లు పరిష్కారం సూచిస్తారు.



**డాక్టర్ సుభాషిణి జయం,**
కన్సల్టెంట్ మెడికల్ కాస్మటాలజిస్ట్,
ఎన్‌ఛాంట్ మెడికల్ కాస్మటాలజీ క్లినిక్,
శ్రీనగర్‌కాలనీ, హైదరాబాద్

## పరి పరిశోధన

### వీడియో సెల్ఫీతో రక్తపోటు తెలిసిపోతుంది!




రక్తపోటు తెలుసుకోవాలంటే ఇప్పుడు నానా అవస్థలు పడాల్సి ఉంటుంది. త్వరలోనే ఈ సమస్యలు తీరిపోతాయి. ఎందుకంటారా? కేవలం ఒక్క వీడియో సెల్ఫీతో రక్తపోటును లెక్క వేయగల సరికొత్త టెక్నాలజీ అందుబాటులోకి వస్తోంది మరి. అధిక రక్తపోటు అనేది ప్రపంచ వ్యాప్తంగా ఓ తీవ్ర సమస్యగా మారిపోతున్న ఈ తరుణంలో ఈ టెక్నాలజీ అందుబాటులోకి వస్తుండటం గమనార్హం. చేతి మణికట్టుకు బిగించుకోగల పరికరాలతో బీపీ చూసుకునే అవకాశమున్నప్పటికీ అవి ఎల్లప్పుడు మన చేతికి అంటిపెట్టుకుని ఉన్న అవకాశం తక్కువ. ఈ నేపథ్యంలో టొరంటో యూనివర్శిటీ శాస్త్రవేత్త కాంగ్ లీ ఈ వీడియో సెల్ఫీ టెక్నాలజీని అభివృద్ధి చేశారు. చర్మం లోపలి చిత్రాలు తీయగల సాఫ్ట్‌వేర్‌తో తాము ముందుగా కొంతమంది ముఖాల వీడియోలు తీశామని.. రెండు నిమిషాల ఈ వీడియోల ద్వారా సేకరించిన రక్తపోటు వివరాలకు.. భౌతికంగా సేకరించిన వివరాలను సరిపోల్చి ఈ సాఫ్ట్‌వేర్‌ను సిద్ధం చేశారు. మెషీన్ లెర్నింగ్ పద్ధతులను వాడటం ద్వారా ఈ సాఫ్ట్‌వేర్ మన ముఖంలోని రక్తప్రసరణలో వచ్చే మార్పులను గుర్తించి.. దాని ఆధారంగా రక్తపోటును లెక్కకట్టగలదు. ఈ పద్ధతి ద్వారా వచ్చే వివరాలు 95 శాతం కచ్చితత్వంతో ఉన్నట్లు తమ అధ్యయనాల్లో తెలిసిందని కాంగ్ లీ తెలిపారు. మరిన్ని పరిశోధనల ద్వారా ఈ ఫలితాలను నిర్ధారించుకోగలిగితే.. సమీప భవిష్యత్తులోనే అరనిమిషం వీడియో సెల్ఫీ మీ రక్తపోటు వివరాలను అందించవచ్చునని అంటున్నారు కాంగ్ లీ.

### గుండె మరమ్మతులకు కొత్త పద్ధతి...



గుండెపోటు కారణంగా నష్టపోయిన కండరాలకు చికిత్స కల్పించేందుకు మూలక ణాల ద్వారా అభివృద్ధి చేసిన గుండె కండరకణాలు ఉపయోగపడతాయని గుర్తించారు అలబామా యూనివర్శిటీ శాస్త్రవేత్తలు. గుండెపోటు వల్ల కండరంలోని కొంతభాగం చచ్చుబడిపోతుందన్న విషయం తెలిసిందే. తగిన చికిత్స లేని పక్షంలో ఈ కండర భాగం కారణంగా గుండె మొత్తం ఉబ్బిపోయి సమస్య జటిలం కావచ్చు. ఈ నేపథ్యంలో అలబామా యూనివర్శిటీకి చెందిన బయో మెడికల్ ఇంజినీర్లు కొన్ని ప్రయోగాలు చేశారు. కార్డియో మయోసైట్స్ నుంచి సేకరించిన మూలకణాలను గుండె గాయం వద్ద ఇంజెక్ట్ చేసినప్పుడు రక్తాన్ని పంప్ చేసే సామర్థ్యం కొంచెం పెరిగినట్లు తెలిసింది. అయితే కార్డియో మయోసైట్స్‌లో తాము అత్యంత చురుకైన, పూర్తి డీఎన్‌ఏ ఉన్న కణాలను సేకరించి వాటిద్వారా మూలకణాలను సిద్ధం చేశామని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త రామస్వామి కన్నప్పన్ తెలిపారు. కణాలను వేగంగా పెంచే క్రమంలో డీఎన్‌ఏ దెబ్బతింటుందని, వీటిని గుండెపై వాడటం వల్ల ప్రయోజనం ఏమీ ఉండదని వివరించారు. ఇలాంటి కణాలను వదిలేసేందుకు తాము ఒక పద్ధతిని ఆవిష్కరించామని చెప్పారు. గుండెపోటుకు గురైన ఎలుకలకు సుమారు తొమ్మిది లక్షల మూలకణాలను అందించినప్పుడు నాలుగు వారాల తరువాత గుండె సామర్థ్యం పెరిగిందని తెలిపారు.

### ఈ పూవుతో కేన్సర్ మందు!



ఫొటోలో ఉన్న పువ్వును మీరెప్పుడైనా చూశారా? చూసే ఉంటారులెండి. ఈ పూల నుంచి సేకరించిన ఒక రసాయనం కేన్సర్‌కు విరుగుడుగా పనిచేస్తుందని అంటున్నారు బర్మింగ్‌హామ్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు. ఫీవర్‌ఫ్యూ అని పిలిచే ఈ పువ్వును కొన్ని చోట్ల చాలాకాలంగా తలనొప్పి నివారణకు వాడుతూంటారు. కానీ పువ్వులోని పార్థీనియోలైడ్ అనే రసాయనం క్రానిక్ లింఫోసైటిక్ లుకేమియా కణాలపై ప్రభావం చూపుతున్నట్లు బర్మింగ్‌హామ్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు గుర్తించారు. కేన్సర్ కణాల్లోని రియాక్టివ్ ఆక్సిజన్ స్పీషీస్ (రాస్) మోతాదులను పెంచడం ద్వారా ఈ రసాయనం పని చేస్తున్నట్లు తెలిసింది. కేన్సర్ కణాల్లో సహజంగానే ఎక్కువగా ఉండే రాస్‌ను మరింత పెంచడం ద్వారా ఈ రసాయనం కణాలను నాశనం చేస్తోందని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త జాన్ ఫోసే తెలిపారు. మెడ్‌కెమ్ కామ్ జర్నల్ తాజా సంచికలో ఈ పరిశోధన వివరాలు ప్రచురితమయ్యాయి. మరిన్ని జంతు, మానవ ప్రయోగాలు జరిగితే పార్థీనియోలైడ్‌కున్న లక్షణాలు నిర్ధారణ అవుతాయని తద్వారా దీన్ని కేన్సర్ చికిత్సకు మరో మందుగా వాడుకునేందుకు అవకాశం ఏర్పడుతుందని చెప్పారు.

## పాటలమ్మ



# పాటలే పాఠాలుగా...

**బోధనలో ఒక్కో ఉపాధ్యాయుడిది ఒక్కో శైలి. అయితే ఈ విషయంలో అందరి లక్ష్యమూ ఒక్కటే. పిల్లలను ఆకట్టుకుని పాఠం వాళ్ల మెదళ్లలో నిక్షిప్తమై పోయేలా చేయడమే. మంచిర్యాల జిల్లాకు చెందిన ఓ ప్రధానోపాధ్యాయురాలు అందరికంటే భిన్నం. ఈ టీచర్ నైతిక విలువలతో కూడిన పాఠాలు చెప్పడమే కాకుండా పిల్లలకు విద్య గొప్పతనాన్ని తెలియజేయడం కోసం పాటలు రాశారు. వాటికి బాణీ కట్టారు. ఆలపించారు. పిల్లల నుంచి మంచి ఫలితాలను రాబట్టారు.**



మంచిర్యాలలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తున్న శారద గాయని కూడా. వృత్తి బోధన అయితే ప్రవృత్తి పాటలు రాయడం, బాణీలు కట్టడం, పాడడం. శారద పాడే పాటలన్నీ సమాజ హితాన్ని కాంక్షించేవే. భావి భారత పౌరుల భవితకు బంగారు బాటలు వేసేవే. అలా ఇప్పటివరకూ 800 కుపైగా పాటలు పాడారు. ''చెట్టమ్మా చెట్టమ్మా చెట్టమ్మా... నీ పుట్టుక ఎంత గొప్పదమ్మా..నీవు లేని లోకాన్ని ఊహించలేనమ్మా.. మానవ మనుగడకే నీవు తొలి మెట్టమ్మా'' అనేది శారద గళం నుంచి వచ్చిన పాటల్లో మచ్చుకు ఒకటి. 'బడి బయట ఏముందిరా.. బడిలో భవిత ఉంది... రా.. బడిలో ఆట ఉందిరా.. చిన్నా బడిలోనూ పాట ఉందిరా.. బడిలో చదువుకో ''.. అంటూ పాడిన పాట పిల్లలతోపాటు పెద్దలను కూడా ఆలోచింపజేస్తుంది. బాల్యం నుంచే శారదకు పాటలంటే ఇష్టం. చిన్నప్పుడు బడి సెలవురోజుల్లో అమ్మతోపాటు పొలం వెళ్లేది. పొలంలో పనిచేసే సమయంలో ఆ కష్టం తెలియకుండా ఉండడం కోసం, కూలీలను ఉత్సాహవంతంగా ఉంచడంకోసం శారద తల్లి లక్ష్మి పాటలు పాడుతుండేది. తల్లి శ్రావ్యమైన గానం శారదను కట్టిపడేసింది. చదువు పూర్తయ్యాక టీచర్‌గా విధుల్లో చేరిన శారద ఆ వృత్తిలో కొనసాగుతూనే తీరిక సమయంలో రాగాలు తీయడం ప్రారంభించారు. ఆ తర్వాత కొంతకాలంపాటు ఓ గురువు వద్ద సంగీతంలో శిక్షణ పొందారు. ఆ తర్వాత పాడడం ప్రారంభించారు. అక్కడి నుంచి పాటలు రాయడం, పాడడం ప్రారంభించారు. అలా ఇప్పటి దాకా 800 పాటలు పాడారు. స్వరాంజలి మ్యూజిక్ అకాడమీకి చెందిన వేంకటేశ్ స్వరకల్పన, సంగీతం, రచనలో బడి బయట ఏముందిరా అనే పాటలతోపాటు, చెట్టుమ్మా పాటలు ఆడియో పూర్తయ్యాయి. ఇది విన్న వారంతా కొన్ని దృశ్యాలు జతచేసి వీడియో రూపంలో తీసుకువస్తే బాగుంటుందని శారదకు సూచించారు. ఈ సలహా... శారదను ఆ దిశగా నడిపించింది. ఈ నేపథ్యంలో పాటలు పాడడమే కాకుండా నటించారు కూడా.



**ఆత్మరక్షణ విద్యలు నేర్పుతాం**

"పాఠాలతోపాటు నైతిక విలువలను ఎక్కువగా చెబుతుంటా. ఆడపిల్లలకు కర్రసాము, కత్తిసాము వంటి ఆత్మరక్షణ విద్యలను బడి సమయం తర్వాత ప్రత్యేకంగా నేర్పిస్తాం. ఏ పోటీలు పెట్టినా మా బడి పిల్లలే ముందుంటారు. ఢిల్లీలో జరిగిన ఎన్సీసీ ప్రోగ్రాంలో మా బడి పిల్లలు పాల్గొన్నారు. ఇది ఎంతో ఆనందం కలిగించే విషయం. గతేడాది 100 శాతం మార్కులు సాధించిన పిల్లలందరికీ నా చేత్తో అన్నం తినిపించా. పిల్లల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా తరచూ వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాం. ఆశాజ్యోతి ఫౌండేషన్ సహకారంతో మా బడి పిల్లలకు బ్యాగు, పుస్తకాలు ఇప్పించాం.

**– శారద,** ప్రధానోపాధ్యాయురాలు

**వసతుల కల్పన... విలువల బోధన**

2002లో స్కూల్ అసిస్టెంట్‌గా చేరిన శారద... ఏడేళ్లలోనే ప్రధానోపాధ్యాయురాలిగా పదోన్నతి పొందారు. 2009లో బెల్లంపల్లి పాఠశాలలో చేరిన సమయంలో 200 మంది పిల్లలు ఉండగా ఆ తర్వాత ఆ సంఖ్య 850కి చేరుకుంది. పిల్లలను ఆకట్టుకునేలా బోధించడంలో వైవిధ్యమే ఇందుకు తోడ్పడింది. ఆశాజ్యోతి సంస్థ సహకారంతో పిల్లలకు ఉచితంగా బ్యాగులు అందేలా చేశారు. పాఠశాలలో అనేక మౌలిక వసతులు కల్పించారు.

ప్రస్తుతం శారద హెచ్.ఎం.గా విధులు నిర్వర్తిస్తున్న పాఠశాల ఫలితాల్లో జిల్లాస్థాయిలో అగ్రస్థానంలో నిలిచింది. 92 శాతం ఫలితాలు వచ్చాయి. పాఠాలే కాదు, ఈ బడిలో రోజుకు ఒకటి లేదా రెండు క్లాసులు తీసుకుని కేవలం నైతిక విలువలు బోధిస్తారు. దానికే అత్యధిక ప్రాధాన్యమిస్తారు. గతేడాది ఈ పాఠశాల విద్యార్థినులు జాతీయస్థాయి క్రీడాపోటీల్లో పాల్గొనగా ఈ ఏడాది యోగా పోటీల్లో పాల్గొనే అవకాశం లభించింది.

**– కొల్లూరి సత్యనారాయణ**
సాక్షి, స్కూల్ ఎడిషన్

epaper.sakshi.com




ఈ రోజు మహేశ్‌బాబు పుట్టినరోజు. ఈ సూపర్ స్టార్ సినిమా, వ్యక్తిగత జీవితం లోని ముఖ్యమైన సంఘటనల క్విజ్ ఈ వారం స్పెషల్.



**1** ప్రిన్స్ మహేశ్‌బాబు ఏ సంవత్సరంలో పుట్టారో తెలుసా?
ఎ) 1975 బి) 1973 సి) 1974 డి) 1977

**2** మహేశ్‌బాబు నిర్మాతగా మారిన మొదటి సినిమా ఏంటి?
ఎ) అతడు బి) పోకిరి సి) ఖలేజా డి) శ్రీమంతుడు

**3** మహేశ్ స్క్రీన్‌పై కనిపించిన మొదటి చిత్రం 'నీడ'. ఈ చిత్రంలో హీరోగా రమేశ్‌బాబు నటించారు. ఆ చిత్రదర్శకుడు ఎవరో తెలుసా?
ఎ) కోడి రామకృష్ణ బి) ఆదుర్తి సుబ్బారావు సి) దాసరి నారాయణరావు డి) కె.యస్.ఆర్. దాస్



**4** మహేశ్‌బాబు నటించిన 'పోకిరి' చిత్రకథను దర్శకుడు పూరి జగన్నాథ్ మొదట ఓ హీరోకి చెప్పారు. ఆ హీరో ఈ కథ మీద ఇంట్రస్ట్ చూపకపోవటంతో మహేశ్‌బాబుకి ఈ సినిమా కథ చెప్పారు. పూరి ఏ హీరోకి మొదట ఈ సినిమా కథ చెప్పారో తెలుసా?
ఎ) రవితేజ బి) యన్టీఆర్ సి) రామ్‌చరణ్ డి) పవన్ కల్యాణ్



**5** ప్రస్తుతం మహేశ్‌బాబు నటిస్తున్న చిత్రం 'సరిలేరు నీకెవ్వరు'. ఆ చిత్రంలోని ఓ ముఖ్యమైన పాత్రలో డైనమిక్ లేడీ సూపర్ స్టార్ నటిస్తున్నారు. ఆ స్టార్ ఎవరో తెలుసా?
ఎ) నదియా బి) విజయశాంతి సి) సుహాసిని డి) రాధ

**6** బుజ్జి మహేశ్‌బాబును దాసరి పెద్ద తెరకు పరిచయం చేశారు. కె.రాఘవేంద్రరావు దర్శకత్వం వహించిన 'రాజకుమారుడు' చిత్రంతో హీరోగా మారారు. మహేశ్ మొదటి చిత్రంలో హీరోయిన్ ఎవరో తెలుసా?
ఎ) బిపాసా బసు బి) సిమ్రాన్ సి) ప్రీతీ జింతా డి) సాక్షీ శివానంద్

**7** మహేశ్‌బాబు 'ఒక్కడు' సినిమా కోసం భారీ చార్మినార్ సెట్ వేశారు. ఆయన మరో సినిమా 'అర్జున్' కోసం మధురై మీనాక్షి టెంపుల్‌ను సెట్‌గా వేశారు. మీనాక్షి టెంపుల్ సెట్ వేసిన ఆర్ట్ డైరెక్టర్ ఎవరో తెలుసా?
ఎ) ఆనంద్ సాయి బి) అశోక్ కుమార్ సి) తోట తరణి డి) ఎ.యస్. ప్రకాశ్

**8** మహేశ్‌బాబు ఇప్పటివరకు నాలుగు సినిమాలకు వాయిస్ ఓవర్ ఇచ్చారు. ఆయన వాయిస్ ఓవర్ ఇచ్చిన మొదటి చిత్రం ఏంటో తెలుసా?
ఎ) బాద్‌షా బి) జల్సా సి) శ్రీశ్రీ డి) మనసుకు నచ్చింది

**9** "ఇప్పటికింకా నా వయసు నిండా పదహారే, చీటికి మాటికి చెయ్యేస్తు చుట్టూ కుర్రాళ్లే" పాట 'పోకిరి' చిత్రంలోనిది. ఆ చిత్ర సంగీతదర్శకుడెవరో తెలుసా?
ఎ) రమణ గోగుల బి) మణిశర్మ సి) చక్రి డి) దేవిశ్రీ ప్రసాద్

**10** మహేశ్‌బాబు తన కెరీర్‌లో ఐదుగురు దర్శకులతో రెండుసార్లు పని చేశారు. ఒక దర్శకునితో మాత్రమే ఆయన మూడు సినిమాలు చేశారు. ఎవరా దర్శకుడు తెలుసా?
ఎ) త్రివిక్రమ్ శ్రీనివాస్ బి) శ్రీను వైట్ల సి) గుణశేఖర్ డి) కొరటాల శివ

**11** మహేశ్‌బాబు, నమ్రత మొదటిసారి 2000 సంవత్సరంలో కలిశారు. 2005లో వారి ప్రేమ పెళ్లిగా మారింది. వారిద్దరూ కలిసి నటించిన మొదటి చిత్రదర్శకుడు ఎవరో తెలుసా?
ఎ) వైవీయస్ చౌదరి బి) బి. గోపాల్ సి) కృష్ణవంశీ డి) శోభన్

**12** ఇప్పుడు ఎక్కడ చూసినా సోషల్ మీడియా హవా కొనసాగుతోంది. మహేశ్‌బాబు ట్వీటర్ ఎకౌంట్ హ్యాండిల్ ఏంటో తెలుసా?
ఎ) యువర్స్ ట్రూలీ మహేశ్ బి) మీ మహేశ్ సి) మన మహేశ్ డి) యువర్స్ మహేశ్



**13** మహేశ్‌బాబు నటించిన 'నాని' చిత్రంలో హీరోయిన్ ఎవరో గుర్తుందా?
ఎ) అమీషా పటేల్ బి) రక్షిత సి) ఇలియానా డి) కాజల్ అగర్వాల్

**14** మహేశ్‌బాబు తాను హీరోగా నటించిన 'శ్రీమంతుడు' చిత్రం ఇన్స్పిరేషన్‌తో మహబూబ్‌నగర్ జిల్లాలోని ఓ గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. ఆ గ్రామం పేరేంటి?
ఎ) సిద్ధాపూర్ బి) జడ్చర్ల సి) కోయిలకొంట్ల డి) దేవరకొండ

**15** మహేశ్‌బాబు హీరోగానే కాకుండా అనేక వ్యాపారాలు చేస్తున్నారు. ఎ.యం.బి మాల్‌లోని సినిమా థియేటర్లే కాకుండా ప్రస్తుతం మరో వ్యాపార రంగంలోకి ఆయన అడుగు పెడుతున్నారు. ఏ రంగంలో ఆయన వ్యాపారం మొదలు పెడుతున్నారో తెలుసా?
ఎ) విమాన రంగం బి) విద్యారంగం సి) వస్త్ర వ్యాపారం డి) వైద్య రంగం





**16** 2015లో విడుదలైన 'శ్రీమంతుడు' మహేశ్ హీరోగా నటించిన ఎన్నో సినిమానో తెలుసా?
ఎ) 21 బి) 25 సి) 17 డి) 19

**17** ప్రస్తుతం మహేశ్ హీరోగా నటిస్తున్న 'సరిలేరు నీకెవ్వరు' చిత్రానికి అనిల్ రావిపూడి దర్శకుడు. ఈ చిత్రంలో హీరోయిన్ ఎవరో తెలుసా?
ఎ) పూజా హెగ్డే బి) రష్మికా మండన్నా సి) తమన్నా డి) కియరా అద్వాని

**18** మహేశ్‌బాబు చైల్డ్ ఆర్టిస్ట్‌గా మొత్తం ఎన్ని సినిమాల్లో నటించారో తెలుసా? ('నీడ' సినిమా కాకుండా)
ఎ) 10 బి) 5 సి) 4 డి) 8

**19** మహేశ్‌బాబు ఏ సినిమా షూటింగ్ చేస్తున్నప్పుడు నమ్రతను పెళ్లాడారో తెలుసా?
ఎ) బాబి బి) మురారి సి) అతడు డి) ఒక్కడు

**20** మహేశ్‌బాబు కుమారుడు గౌతమ్‌కృష్ణ ఒకే ఒక్క చిత్రంలో బాలనటునిగా నటించాడు. ఆ చిత్రదర్శకుడెవరో కనుక్కోండి?
ఎ) శ్రీకాంత్ అడ్డాల బి) సుకుమార్ సి) వంశీ పైడిపల్లి డి) ఎ.ఆర్. మురుగదాస్

జవాబులు:
1) ఎ 2) డి 3) సి 4) డి
5) బి 6) సి 7) సి 8) బి 9) బి
10) సి 11) బి 12) ఎ 13) ఎ
14) ఎ 15) సి 16) ఎ 17) బి
18) డి 19) సి 20) బి

మీరు 6 సమాధానాల కంటే తక్కువ చెబితే... మీకు సినిమా అంటే ఇష్టం
10 సమాధానాల వరకూ చెప్పగలిగితే... మీకు సినిమా అంటే ఇంట్రెస్ట్
15 సమాధానాల వరకూ చెప్పగలిగితే... మీకు సినిమా అంటే పిచ్చి
20 సమాధానాలూ చెప్పగలిగితే... ఇంకోసారి ఈ క్విజ్ చదవకండి!

నిర్వహణ: శివ మల్లాల

## న్యూ ఇయర్ గిఫ్ట్


కమల్‌హాసన్

సమాజంలో లంచాన్ని నిర్మూలించాలని స్వాతంత్ర్య సమరయోధుడు సేనాపతిగా 'భారతీయుడు' సినిమాలో కమల్‌హాసన్ పోరాటం చేశారు. ఇప్పుడు మరోసారి సేనాపతిగా తిరిగి రానున్న సంగతి తెలిసిందే. ఈ సేనాపతి తమిళ కొత్త సంవత్సరం రోజున థియేటర్స్‌లోకి రానున్నారని టాక్. కమల్‌హాసన్ – దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో 1996లో వచ్చిన చిత్రం 'భారతీయుడు'. ఇప్పుడు ఆ సినిమాకు సీక్వెల్ రూపొందుతోంది. కాజల్, రకుల్‌ప్రీత్ సింగ్, సిద్ధార్థ్, ప్రియా భవానీ శంకర్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. కమల్‌హాసన్ రాజకీయాల్లో బిజీగా ఉండటంతో ఈ సినిమాకు చిన్న బ్రేక్ వచ్చింది. ప్రస్తుతం షూటింగ్ రాజమండ్రిలో జరుగుతోంది. ఈ చిత్రాన్ని 2021 ఏప్రిల్ 14న తమిళ సంవత్సరాది సందర్భంగా రిలీజ్ చేయాలనుకుంటున్నారు. లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి అనిరుధ్ సంగీత దర్శకుడు.

## ఒప్పుకో.. లేదా చచ్చిపో

అతని పేరు రాయ్. అతనికి ఎక్కువ అవకాశాలు ఇవ్వడం ఇష్టం ఉండదు. ఒకటే అతను చెప్పిన దానికి ఒప్పుకోవడం లేదా చచ్చిపోవడం. సింపుల్. 'సాహో'లో ఇలాంటి పాత్రనే పోషిస్తున్నారు బాలీవుడ్ నటుడు జాకీ ష్రాఫ్. 'సాహో' సినిమాలోని ఒక్కో క్యారెక్టర్ పోస్టర్‌ను రిలీజ్ చేస్తూ వస్తున్నారు. గురువారం 'రాయ్' పాత్రధారి జాకీ ష్రాఫ్ లుక్‌ను రిలీజ్ చేశారు. ప్రభాస్ హీరోగా నటించిన ఈ సినిమాను సుజీత్ దర్శకత్వం వహించారు. వంశీ, ప్రమోద్, విక్కీలు నిర్మించారు. ఆగస్ట్ 30న విడుదల కానున్న ఈ చిత్రం ట్రైలర్ రేపు రిలీజ్ కానుంది.


జాకీ ష్రాఫ్

## నవ్వు.. భయం...


విజయ్

నటుడు శివాజీ రాజా తనయుడు విజయ్ హీరోగా తెలుగు తెరకు పరిచయం అవుతున్న చిత్రం 'ఏదైనా జరగొచ్చు'. ఈ చిత్రంలో పూజా సోలంకి, శశిసింగ్ కథానాయికలుగా నటించారు. వెబ్ బ్రెయిన్ ఎంటర్‌టైన్మెంట్, సుధర్మ్ ప్రొడక్షన్స్ నిర్మించాయి. సుదర్శన్ హనగోడు సహ–నిర్మాత. కె. రమాకాంత్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈ నెల 23న విడుదల కానుంది. ''ఆల్రెడీ విడుదల చేసిన పాటలు, టీజర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. యాక్షన్, కామెడీ, థ్రిల్లర్, హారర్ అంశాలను మేళవించి తెరకెక్కించిన చిత్రం ఇది. ప్రేక్షకులకు నచ్చుతుంది'' అని చిత్ర బృందం పేర్కొంది. బాబీ సింహా, వైవా రాఘవ, నాగబాబు, 'వెన్నెల' కిశోర్, అజయ్ ఘోష్ తదితరులు నటించిన ఈ సినిమాకు శ్రీకాంత్ పెండ్యాల సంగీతం అందించారు.








## టి20ల్లో తొలిసారి 7 వికెట్ల ఘనత

టి20 క్రికెట్‌లో ప్రపంచ రికార్డు బౌలింగ్ గణాంకాలు నమోదయ్యాయి. ఇంగ్లండ్ కౌంటీల్లో బుధవారం బర్మింగ్‌హామ్ బేర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో లీసెస్టర్‌షైర్ బౌలర్ కొలిన్ అకెర్‌మన్ ఈ ఘనత సాధించాడు. నాలుగు ఓవర్లలో అతను 18 పరుగులిచ్చి 7 వికెట్లు పడగొట్టాడు. టి20 మ్యాచ్‌లో అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన ఇప్పటి వరకు సోమర్సెట్ బౌలర్ అరుల్ సపయ్య (3.4–0–5–6) పేరిట ఉంది. 2011లో సపయ్య సోమర్‌సెట్ తరఫున గ్లామోర్గాన్‌పై ఈ ఫీట్‌ను సాధించాడు. ఇన్నింగ్స్‌లో ఒక బౌలర్ 7 వికెట్లు పడగొట్టడం మాత్రం ఇదే తొలిసారి.

# వాన దోబూచులాట





భారత్–వెస్టిండీస్ తొలి వన్డేను వరుణుడు వీడని నీడలా వెంటాడాడు. అటు కుండపోతగానైనా కురవక... ఇటు పూర్తిగానూ ఆగక ఒకటికి రెండుసార్లు అంతరాయం కలిగించాడు. ఇలా మ్యాచ్ మొదలైందో లేదో... అలా వస్తూ, పోతూ ఆటగాళ్లతో దోబూచులాడాడు. మొత్తమ్మీద 13 ఓవర్ల ఆటను మాత్రమే సాగనిచ్చాడు. భారత కాలమానం ప్రకారం గురువారం రాత్రి 12.30 గంటల సమయానికీ వర్షం పడుతుండటంతో మ్యాచ్‌ను రద్దు చేశారు.



**భారత్, వెస్టిండీస్ తొలి వన్డే రద్దు ● వరుస అంతరాయాలతో రెండు సార్లు ఓవర్ల కుదింపు**

**ప్రావిడెన్స్ (గయానా):** కరీబియన్ పర్యటనలో టి20లను ఆడుకోనిచ్చిన వరుణుడు వన్డే సిరీస్‌కు మాత్రం అడ్డంకిగా నిలిచాడు. గురువారం భారత్– వెస్టిండీస్ తొలి వన్డే ఒక అడుగు ముందుకు... పది అడుగులు వెనక్కు తరహాలో సాగి చివరికి రద్దయింది. ప్రావిడెన్స్‌లో ఉదయం నుంచి వర్షం కురుస్తుండటంతో పిచ్ పరిసరాలను పూర్తిగా కవర్లతో కప్పి ఉంచారు. టాస్ గంటన్నర ఆలస్యమైంది. దీంతో మ్యాచ్‌ను 43 ఓవర్లకు కుదించారు. టాస్ గెలిచిన భారత కెప్టెన్ విరాట్ కోహ్లి బౌలింగ్ ఎంచుకున్నాడు. టి20 సిరీస్‌లో అవకాశం లభించని మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ శ్రేయస్ అయ్యర్‌ను ఈ మ్యాచ్ తుది జట్టులోకి తీసుకున్నారు. 25 నిమిషాలు సాగిన వెస్టిండీస్ ఇన్నింగ్స్‌లో 5.4 ఓవర్లు ఆడి 7 పరుగులు చేసింది. ఈ దశలో వాన గంటా 15 నిమిషాలు అంతరాయం కలిగించింది. అనంతరం మ్యాచ్‌ను 34 ఓవర్లకు తగ్గించారు. మరో 8 ఓవర్ల పాటు కొనసాగిన ఆటలో విండీస్ ఓపెనర్ క్రిస్ గేల్ (31 బంతుల్లో 4) వికెట్ కోల్పోయింది. చివరకు 13 ఓవర్లలో వికెట్ నష్టానికి 54 పరుగులు చేసింది. అవతలి ఎండ్‌లో ఓపెనర్ ఎవిన్ లూయిస్ (36 బంతుల్లో 40 నాటౌట్; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) మాత్రం ధాటిని ప్రదర్శించాడు. ఖలీల్ అహ్మద్‌పై విరుచుకుపడ్డాడు. ఇంతలోనే చినుకులు పెద్దవి కావడంతో అంపైర్లు మైదానాన్ని వీడాల్సిందిగా ఆటగాళ్లకు సూచించారు. ఎంత వేచి చూసినా ఫలితం లేకపోవడంతో భారత కాలమానం ప్రకారం రాత్రి 12.45కు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. సిరీస్‌లో భాగంగా రెండో వన్డే ఆదివారం పోర్ట్ ఆఫ్ స్పెయిన్‌లో జరుగుతుంది.

## విహారి అజేయ సెంచరీ



**టరోబా (ట్రినిడాడ్ అండ్ టొబాగో):** వెస్టిండీస్‌తో జరుగుతున్న మూడో అనధికారిక టెస్టులో శుబ్‌మన్ గిల్ (165 బ్యాటింగ్; 16 ఫోర్లు, 1 సిక్స్), హనుమ విహారి (104 బ్యాటింగ్; 10 ఫోర్లు, 1 సిక్స్) వీరోచిత శతకాలతో భారత్ 'ఎ' భారీ లక్ష్యం నిర్దేశించే దిశగా సాగుతోంది. కడపటి వార్తలందేసరికి భారత్ 'ఎ' రెండో ఇన్నింగ్స్‌లో 78 ఓవర్లలో 4 వికెట్లకు 309 పరుగులు చేసింది. 50 పరుగులకే 4 వికెట్లు కోల్పోగా గిల్, విహారి ఐదో వికెట్‌కు అబేధ్యమైన భాగస్వామ్యాన్ని జోడిస్తున్నారు. ప్రస్తుతం భారత్ 316 పరుగుల ఆధిక్యంలో ఉంది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 201, వెస్టిండీస్, 194 పరుగులు చేశాయి. ఆటకు నేడు ఆఖరి రోజు.

### క్రీడల మంత్రిత్వ శాఖతో

## బీసీసీఐ సీఈవో భేటి

**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సీఈవో రాహుల్ జోహ్రి కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ కార్యదర్శి రాధేశ్యామ్‌తో తో శుక్రవారం భేటీ కానున్నారు. ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో భారత్‌లో జరిగే దక్షిణాఫ్రికా 'ఎ', మహిళల సిరీస్‌లకు క్రీడల మంత్రిత్వ శాఖ నుంచి ఇంకా అనుమతి లభించలేదు. భారత్‌లో జరిగే ఏదైనా సిరీస్‌కు ప్రభుత్వ అనుమతి తీసుకోవడం బీసీసీఐకి తప్పనిసరి. అదే విధంగా 30 నుంచి 45 రోజుల్లో అనుమతి లభించడం ఆనవాయితీ. దక్షిణాఫ్రికా 'ఎ', మహిళల సిరీస్‌ల అనుమతి కోసం బీసీసీఐ మార్చిలో దరఖాస్తు చేసుకున్నా... ఇప్పటి వరకు క్రీడల మంత్రిత్వ శాఖ నుంచి ఎటువంటి సమాధానం లేకపోవడంతో ఈ విషయమై చర్చించేందుకు జోహ్రి సిద్ధమయ్యారు. మరోవైపు జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) నిబంధనలను బీసీసీఐ తప్పనిసరిగా పాటించేలా ఒత్తిడి తీసుకురావడం కోసమే క్రీడల మంత్రిత్వ శాఖ వచ్చే నెలలో జరిగే సిరీస్‌లకు అనుమతి పత్రం ఇవ్వలేదని తెలుస్తోంది. ఒకవేళ ఇదే నిజమైతే భారత సీనియర్ జట్టు ఆడే బంగ్లాదేశ్, దక్షిణాఫ్రికా సిరీస్‌లకు సంబంధించిన అనుమతులు కూడా ఆలస్యమయ్యే అవకాశం ఉంది.

## అండర్–19 వన్డే వర్షార్పణం

**బెకెన్‌హామ్ (ఇంగ్లండ్):** ముక్కోణపు యూత్ వన్డే సిరీస్‌లో భారత్, బంగ్లాదేశ్ అండర్–19 జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్ వర్షంతో రద్దయింది. దీంతో ఇరు జట్లకు చెరో పాయింట్ లభించింది. వర్షం రాకముందు బ్యాటింగ్‌కు దిగిన భారత అండర్–19 జట్టు 49.3 ఓవర్లలో 244 పరుగుల వద్ద ఆలౌటైంది. షోరిఫుల్ ఇస్లామ్ (3/43) ధాటికి 65 పరుగులకే కీలకమైన 4 వికెట్లు కోల్పోయిన జట్టును శుభాంగ్ హెగ్డే (69), దివ్యాన్ష్ సక్సేనా (37), కరణ్ లాల్ (25) ఆదుకున్నారు. భారత్ ఇన్నింగ్స్ సమయంలోనూ వర్షం పడటంతో రెండుసార్లు ఆటకు అంతరాయం ఏర్పడింది. తర్వాత బంగ్లా లక్ష్యఛేదనకు దిగగా వర్షంతో ఆట నిలిచే సమయానికి 5.5 ఓవర్లలో 2 వికెట్లకు 19 పరుగులు చేసింది. తెరిపినివ్వని వానతో మైదానం చిత్తడిగా మారడంతో చేసేదేమీ లేక మ్యాచ్‌ను రద్దు చేశారు.

# ఆమ్లా అల్విదా

**రిటైర్మెంట్ ప్రకటించిన దక్షిణాఫ్రికా దిగ్గజం ● ప్రపంచ క్రికెట్‌పై తనదైన ముద్ర**

దక్షిణాఫ్రికా క్రికెట్ జట్టు మూడు రోజుల వ్యవధిలో మరో దిగ్గజ క్రికెటర్ సేవలు కోల్పోయింది. సోమవారం స్టెయిన్ టెస్టుల రిటైర్మెంట్ తర్వాత మరో సీనియర్ బ్యాట్స్‌మన్ ఆటకు గుడ్‌బై చెప్పాడు. దశాబ్దన్నర కాలం పాటు సఫారీ బ్యాటింగ్ మూలస్థంభాల్లో ఒకడిగా నిలిచిన హషీమ్ మొహమ్మద్ ఆమ్లా అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. టెస్టు క్రికెట్‌లో పలు ఘనతలను తన ఖాతాలో వేసుకున్న ఆమ్లా వన్డేల్లోనూ తన సత్తా చాటాడు.

**జొహన్నెస్‌బర్గ్:** రుషిలాంటి ఏకాగ్రత...వీరుడిలాంటి పోరాటపటిమ... హషీమ్ ఆమ్లా రిటైర్మెంట్ సందర్భంగా సహచర క్రికెటర్ ఒకరు చేసిన ప్రశంస ఇది. అద్భుతమైన బ్యాటింగ్ టెక్నిక్, గంటల కొద్దీ క్రీజ్‌లో పాతుకుపోయే తత్వం, చూడముచ్చటైన స్ట్రోక్‌లు, వివాదాలు లేని, బ్యాట్‌తోనే తప్ప ఏనాడూ నోటితో సమాధానం చెప్పని తనదైన ప్రత్యేక వ్యక్తిగత జీవన శైలి...ఇవన్నీ హషీం ఆమ్లాను విశేష క్రికెటర్‌గా నిలబెట్టాయి. దక్షిణాఫ్రికా క్రికెట్ దిగ్గజాలలో ఒకడిగా గుర్తింపు తెచ్చుకున్న అతను ఇప్పుడు ఆటకు గుడ్‌బై చెప్పాడు. అంతర్జాతీయ స్థాయిలో అన్ని ఫార్మాట్‌ల నుంచి రిటైర్ అవుతున్నట్లు 36 ఏళ్ల ఆమ్లా ప్రకటించాడు. దేశవాళీ క్రికెట్‌కు మాత్రం అందుబాటులో ఉంటానని అతను వెల్లడించాడు. ఇటీవల ముగిసిన ప్రపంచకప్‌లో శ్రీలంకతో జరిగిన మ్యాచ్ ఆమ్లా కెరీర్‌లో చివరిది. లంకపైనే ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆమ్లా తన ఆఖరి టెస్టు ఆడాడు. గత కొంత కాలంగా ఫామ్ కోల్పోయి ఇబ్బంది పడుతున్న ఈ సఫారీ స్టార్ చివరకు ఆట ముగించాలని నిర్ణయించుకున్నాడు. టెస్టుల్లో గత 29 ఇన్నింగ్స్‌లలో ఒక్క సెంచరీ కూడా చేయలేకపోయిన అతను... వన్డే ప్రపంచ కప్‌లో కూడా 7 ఇన్నింగ్స్‌లలో కలిపి 203 పరుగులే చేయగలిగాడు.

**అద్భుతమైన ప్రదర్శనలతో...**

2002 అండర్–19 ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికాకు కెప్టెన్‌గా వ్యవహరించిన ఆమ్లా కోల్‌కతాలో భారత్‌పైనే 2004లో టెస్టుల్లో అరంగేట్రం చేశాడు. తొలి 3 టెస్టుల్లో కలిపి 62 పరుగులే చేయడంతో జట్టులో చోటు కోల్పోయాడు. అయితే 15 నెలల తర్వాత తిరిగి వచ్చి కివీస్‌పై భారీ సెంచరీతో చెలరేగాడు. ఆ తర్వాత కూడా కొంత తడబడ్డా 2007లో వరుసగా రెండు టెస్టుల్లో శతకాలు బాదడంతో అతనికి ఎదురు లేకుండా పోయింది. మరుసటి ఏడాది లార్డ్స్ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో ఫాలోఆన్ ఆడుతూ సెంచరీతో తన జట్టును రక్షించడంతో ఆమ్లా పోరాటపటిమ క్రికెట్ ప్రపంచానికి తెలిసింది. ఆస్ట్రేలియా గడ్డపై 2012 సిరీస్‌లో చేసిన రెండు సెంచరీలు, అంతకు ముందు ఏడాది స్వదేశంలో అదే జట్టుపై సాధించిన రెండు వరుస శతకాలు ఆమ్లా కెరీర్‌లో చెప్పుకోదగ్గవి. 2012లో ఇంగ్లండ్‌పై ఓవల్ మైదానంలో 13 గంటలకు పైగా క్రీజ్‌లో నిలిచి అజేయంగా సాధించిన 311 పరుగులు అతని కెరీర్‌లో హైలైట్. 2006నుంచి 2015 మధ్య కాలంలో దక్షిణాఫ్రికా జట్టు విదేశాల్లో ఒక్క సిరీస్ కూడా కోల్పోలేదంటే అందులో ఆమ్లా పోషించిన పాత్ర అద్భుతం. 14 టెస్టుల్లో సఫారీ జట్టుకు అతను కెప్టెన్‌గా వ్యవహరించాడు.

**భారత్‌లో సూపర్...**

ఆమ్లా భారత్‌లో 3 సార్లు పర్యటించాడు. 2004లో విఫలమైన అతను 2008 సిరీస్‌లో అద్భుతమైన సెంచరీతో చెలరేగాడు. 2010 సిరీస్‌లోనైతే ఆడిన మూడు ఇన్నింగ్స్‌లలో వరుసగా 253 నాటౌట్, 114, 123 నాటౌట్ పరుగులతో మన బౌలర్లను ఒక ఆటాడుకున్నాడు. 2015లో కెప్టెన్‌గా వచ్చి 0–3తో సిరీస్ చేజార్చుకున్నా...ఢిల్లీ టెస్టులో మ్యాచ్‌ను కాపాడేందుకు 244 బంతుల్లో 25 పరుగులు చేసిన అతని పట్టుదలను ఎవరూ మరచిపోలేరు.

**వన్డేల్లోనూ దూకుడు...**

శైలిపరంగా చూస్తే టెస్టు క్రికెట్ కోసమే పుట్టినట్లుగా అనిపించినా...వన్డేల్లోనూ ఆమ్లాకు అద్భుతమైన రికార్డు ఉంది. 2010లో విండీస్‌పై ఐదు వన్డేల సిరీస్‌లో 402 పరుగులు చేయడంతో అతని వన్డే సత్తా బయటపడింది. ఇదే ఏడాది మొత్తం 15 ఇన్నింగ్స్‌లలో కలిపి ఏకంగా 75 సగటు, 104 స్ట్రైక్‌రేట్‌లో 1058 పరుగులు చేయడం విశేషం. ఒక దశలో అతను వేగంలో కోహ్లితో పోటీ పడ్డాడు. కెరీర్‌లో 2 వేల పరుగుల నుంచి 7 వేల పరుగుల వరకు ప్రతీ వేయి పరుగుల మైలురాయిని అందరికంటే వేగంగా ఆమ్లానే చేరుకోవడం మరో ఘనత. దక్షిణాఫ్రికా తరఫున వన్డేల్లో అత్యధిక సెంచరీలు (27) సాధించిన బ్యాట్స్‌మన్‌గా ఆమ్లా నిలిచాడు.



టెస్టుల్లో దక్షిణాఫ్రికా తరఫున ట్రిపుల్ సెంచరీ (311 నాటౌట్) సాధించిన ఏకైక క్రికెటర్ ఆమ్లా

**హషీమ్ ఆమ్లా కెరీర్**

| | మ్యాచ్‌లు | పరుగులు | సగటు | అత్యధిక స్కోరు | 100 | 50 |
|---|---|---|---|---|---|---|
| టెస్టులు | 124 | 9282 | 46.64 | 311* | 28 | 41 |
| వన్డేలు | 181 | 8113 | 49.46 | 159 | 27 | 39 |
| టీ20 | 44 | 1277 | 33.60 | 97* | 0 | 8 |

## క్వార్టర్స్‌లో సౌరభ్ వర్మ



**సాక్షి, హైదరాబాద్:** బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్–100 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. పురుషుల విభాగంలో ఐదో సీడ్ శుభాంకర్ డే, ఏడో సీడ్ సౌరభ్ వర్మ, అజయ్ జయరామ్ క్వార్టర్స్‌కు చేరుకోగా... మహిళల సింగిల్స్ కేటగిరీలో ఆకర్షి కశ్యప్, చుక్కా సాయి ఉత్తేజితరావు పోరాటం ప్రిక్వార్టర్స్‌లోనే ముగిసింది. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్ మ్యాచ్‌ల్లో శుభాంకర్ డే 21–16, 21–15తో చికో అరా వార్డొయో (ఇండోనేసియా)పై గెలుపొందగా... సౌరభ్ వర్మ 21–16, 21–11తో సన్ పెయ్ జియాంగ్ (చైనా)ను, అజయ్ జయరామ్ 21–18, 21–13తో జియా వీ తాన్ (మలేసియా)ను ఓడించారు. మరో మ్యాచ్‌లో నాలుగో సీడ్ పారుపల్లి కశ్యప్ 21–17, 15–21, 19–21తో లోహ్ కియాన్ యు (సింగపూర్) చేతిలో ఓడిపోయి టోర్నీ నుంచి నిష్క్రమించాడు. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో సాయి ఉత్తేజిత రావు 10–21, 21–9, 8–21తో క్వాలిఫయర్ బెన్‌యప ఎమ్‌సార్డ్ (థాయ్‌లాండ్) చేతిలో, క్వాలిఫయర్ ఆకర్షి కశ్యప్ 18–21, 13–21తో రెండో సీడ్ అన్ సు యంగ్ (కొరియా) చేతిలో పరాజయం పాలయ్యారు. దీంతో మహిళల సింగిల్స్‌లో భారత క్రీడాకారుల పోరాటం ముగిసింది.

## పరాజయాల టైటాన్స్



పట్నా: ప్రొ కబడ్డీ ఏడో సీజన్‌లో తెలుగు టైటాన్స్ ఇప్పట్లో బోణీ కొట్టేలా కనిపించడం లేదు. గురువారం బెంగళూరు బుల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 47–26తో ఓడిన టైటాన్స్ సీజన్‌లో మరో పరాభవాన్ని మూటగట్టుకుంది. టైటాన్స్ రైడర్ సిద్ధార్థ్ దేశాయ్ 11 పాయింట్లతో తొలిసారి తన స్థాయికి తగ్గ ప్రదర్శన కనబరిచినా... బుల్స్ రైడర్ పవన్ కుమార్ (17 పాయింట్లు) రైడింగ్ ముందు నిలబడలేకపోయాడు. దీంతో సీజన్‌లో ఇప్పటి వరకు ఆడిన 6 మ్యాచ్‌ల్లో ఐదింటిలో ఓడి, ఒక దాంట్లో 'టై'తో సరిపెట్టుకున్న టైటాన్స్ పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో కొనసాగుతుంది. **నేడు జరిగే మ్యాచ్‌ల్లో యు ముంబాతో బెంగాల్ వారియర్స్, పట్నా పైరేట్స్‌తో యూపీ యోధ తలపడతాయి.**


**APS RTC**
**ఇ-వేలం**

ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ ఆధారంగా ప్రాతిపదికన APSRTC యొక్క దిగువ తెలిపిన కోర్ట్ వద్ద ప్రతిదానికిదురుగా తెలిపిన తేదీలలో పనికిరాని వాహనాలు/స్క్రాప్ & టైర్ మెటీరియల్/ట్యూబ్స్/ఫ్లాప్స్/రబ్బర్ ఇతర్ పౌడర్/మెషినరీ/వాడకంలో లేని మిగులు విడిభాగాలు/ పనికిరాని మెటీరియల్ యొక్క ఇ-వేలం నిర్వహించబడును. విజయనగరం : 04-09-2019, నెల్లూరు : 12-09-2019, విజయవాడ : 18-09-2019, కడప : 25-09-2019. వివరముల కొరకు వెబ్‌సైట్ www.mstcecommerce.com మరియు APSRTC వెబ్‌సైట్ https://www.apsrtc.ap.gov.in/ Tenders ను చూడగలరు మరియు వెబ్‌సైట్ www.mstcindia.co.in (forth coming e-auctions) నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.

నెం. COS(C)II/DIS/55-11/2019-20, తేది:12-07-2019 సం/- చీఫ్ కంట్రోలర్ ఆఫ్ స్టోర్స్

**INDIAN INSTITUTE OF SCIENCE EDUCATION AND RESEARCH TIRUPATI**

Tender Notice No.: IISERT/ SE/ EOI/02/2019 Dated: 09/08/2019

**EOI for Design, Supply and Erection of Multi- Purpose Dining hall with associated services at IISER Tirupati**

The Institute invites expression of interest (EOI) for Design, Supply and Erection of Multi- Purpose Dining hall with associated services at IISER Tirupati. Last date for submission of tender (EOI) is 28.08.19 up to 3:30 P.M. and the same will be opened at 04:00 P.M. on the same day in the presence of the available tenderers at IISER Tirupati. For further details log on to our website http://www.iisertirupati.ac.in/tenders/

Superintending Engineer, IISER Tirupati

**Real Time Governance Society (RTGS)**
**Government of Andhra Pradesh**
Block 1, AP Secretariat, Velagapudi, Guntur

**Request for Proposal - Call Notice for**

Real Time Governance Society invites Request for Proposals (RFP) for "Selection of Field Operations Agency (FOA) to Train, Engage and Moniter Grama Volunteers in order to improve service delivery of the government programmes at the grassroots level in Andhra Pradesh".

Time Schedule of Proposal related various events:

| Description | Date and Time |
|---|---|
| Release of Request for Proposal (RFP) | Friday, August 9th, 2019, 11:00AM |
| Last Date for Submission of online Questions by bidders | Tuesday 13th August 2019, 05:00PM |
| Pre-Bid Conference | Wednesday 14th August 2019, 11:00AM O/o 4th Floor, Commissioner Panchayat Raj, Tadepalli, Guntur (DT) |
| Date of Issue of Clarifications | Tuesday 20th August 2019, 5:00PM |
| Last Date for Submission of bids | Thursday 29th August 2019, 3:00PM |
| Pre-Qualification Evaluation | Friday 30th August 2019, 3:00PM |
| Technical Evaluation | Saturday 31st August 2019, 3:00PM |
| Commercial Evaluation | Monday 2nd September 2019, 3:00PM |
| RFP Document Cost | Rs. 5,00,000 (in words five lakhs only) |

Issued by
Real Time Governance Society (RTGS),
On behalf of Commissioner, Panchayat Raj and Rural Development Department ("PRRD") and Commissioner, Municipal Administration and Urban Development ("MAUD"), Government of Andhra Pradesh.
The complete set of bid documents is available online on the below mentioned websites from 09-Aug-2019 at 2.00 PM. IST onwards.
(i) http://www.rtgs.ap.gov.in/ - RTGS website
(ii) http://www.apeprocurement.gov.in - AP eProcurement website

Sd/- CEO, RTGS

DIPR Ro.No.83PP/CL/ADVT/1/1/2019-20, Dt:08-08-2019

**INDIAN INSTITUTE OF TOURISM AND TRAVEL MANAGEMENT, NELLORE**
(An Autonomous Body under Ministry of Tourism, Govt. Of India)
E-mail: nellore@iittm.ac.in website: iittmsouth.org

**WALK -IN- INTERVIEW**

**Project Associate** under Swachhta Action Plan (SAP) Sponsored by Ministry of Tourism, Govt. of India, willing for extensive outside travel for a period of 5 months (Extendable as per requirement) purely on temporary basis, on a consolidated remuneration of **Rs: 30,000/- pm,** may attend the Walk-in-interview on **14.08.2019 at 10AM** along with all original Certificates in support of basic qualification and experience, **at IITTM South Campus, Golagamudi (Village & Post), Via Sarvepalli, SPSR Nellore Dist. - 524321 A.P. Contact no. 9490764454, 09866274350**

**Basic qualification:** 1st Class Master Degree in Tourism or 1st Class in two years full time PGDM Programmes of IITTM and One year teching experience or Project work.

**Desirable:** Proficiency in Telugu, Kannada and Tamil

No TA will be paid for attending the Walk-in-interview.

Director, IITTM. NELLORE

సాక్షి బిజినెస్
శుక్రవారం
9-8-2019
WWW.SAKSHIBUSINESS.COM

**స్టాక్ మార్కెట్లు**

దేశీ సూచీలు

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 637 ▲ | 177 ▲ |
| 37,327 | 11,032 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30గం॥లకు)

| సూచీ | విలువ | మార్పు |
|---|---|---|
| నాస్‌డాక్ | 8,003 | ▲ 140 |
| డోజోన్స్ | 26,285 | ▲ 278 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,286 | ▲ 87 |
| డాక్స్ | 11,845 | ▲ 195 |
| షాంఘై | 2,794 | ▲ 26 |
| నికాయ్ | 20,593 | ▲ 77 |

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

**ఫారెక్స్ రేట్లు** రూ. లలో

| కరెన్సీ | | • కొనుగోలు | • అమ్మకం |
|---|---|---|---|
| యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 70.00 | 71.64 |
| బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 84.63 | 87.72 |
| యూరో | ఎస్‌బీఐ | 77.95 | 80.85 |
| జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 65.43 | 67.91 |
| ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 46.97 | 49.11 |
| సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 50.4 | 52.16 |
| సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.07 | 19.84 |
| యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.50 | 20.07 |
| చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.41 | 10.76 |

# కియా 'మేడిన్ ఆంధ్రా'

# సెల్టోస్ వచ్చేసింది..

**అనంతపురం ప్లాంటులో తొలి కారు ఆవిష్కరణ**

- మూడు వారాల్లోనే 23వేల పైచిలుకు ప్రీ–బుకింగ్స్
- ఆగస్టు 22 నుంచి డెలివరీలు
- భారత్‌లో 2 బిలియన్ డాలర్ల పెట్టుబడులు
- అనంతపురం ప్లాంటుపై 1.1 బిలియన్ డాలర్లు వ్యయం
- 11,000 మందికి ఉపాధి





ప్లాంట్ నుంచి బయటికొస్తున్న కియా సెల్టోస్ కారు. పక్క చిత్రంలో కొత్త కారుపై సంతకాలు చేస్తున్న మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్, రోజా తదితరులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం

దక్షిణ కొరియా ఆటోమొబైల్ దిగ్గజం కియా మోటార్స్ తాజాగా భారత్‌లో తమ తొలి కారు 'సెల్టోస్'ను ఆవిష్కరించింది. అనంతపురం ప్లాంటులో గురువారం జరిగిన ఆవిష్కరణ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, ఏపీఐఐసీ చైర్మన్ రోజా, భారత్‌లో దక్షిణ కొరియా రాయబారి షిన్ బాంగ్–కిల్, కియా మోటార్స్ ఇండియా ఎండీ కూక్ హున్ షిమ్ పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో టెస్టింగ్ చేసిన అనంతరం సెల్టోస్ వాహనాల పూర్తి స్థాయి ఉత్పత్తి ప్రారంభించినట్లు కియా మోటార్స్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ మనోహర్ భట్ తెలిపారు. జూలై 16న ప్రీ–బుకింగ్స్ ప్రారంభమైనప్పట్నుంచి కేవలం మూడు వారాల వ్యవధిలోనే రికార్డు స్థాయిలో 23,311 కార్లు బుక్ అయ్యాయని ఆయన వివరించారు. ఆగస్టు 22 నుంచి కారు డెలివరీలు ప్రారంభించనున్నట్లు భట్ వివరించారు. 'ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందించిన ఎనలేని సహాయ, సహకారాల తోడ్పాటుతో మేం నిర్దేశించుకున్న రికార్డు సమయంలో సెల్టోస్ కార్లను ఉత్పత్తి చేయగలిగాం. భారత మార్కెట్‌కి సంబంధించిన మా నిబద్ధతకు ఈ తొలి సెల్టోస్ నిదర్శనం' అని ఈ సందర్భంగా కూక్ హున్ షిమ్ చెప్పారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి శంకరనారాయణ, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, విప్ కాపు రామచంద్రారెడ్డి, ఇతర ఎమ్మెల్యేలు, కియా ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### విదేశాలకు ఇక్కణ్నుంచే ఎగుమతులు..

సెల్టోస్ కారును ఇక్కణ్నుంచే దక్షిణాఫ్రికాతో పాటు ఇతర ప్రపంచ దేశాలకు కియా మోటార్స్ ఎగుమతి చేయనుంది. భారత్‌లో కియా మోటార్స్ దాదాపు 2 బిలియన్ డాలర్ల మేర ఇన్వెస్ట్ చేసింది. ఇందులో 1.1 బిలియన్ డాలర్లు అనంతపురం ప్లాంటుపైనే ఇన్వెస్ట్ చేసింది. దీనితో 11,000 మందికి ఉపాధి లభిస్తుందని కియా తెలిపింది. వీరిలో పర్మనెంటు సిబ్బంది 4,000 మంది కాగా, 7,000 మంది తాత్కాలిక సిబ్బంది ఉంటారు.

### 536 ఎకరాల్లో ప్లాంటు ..

అనంతపురం జిల్లా పెనుగొండలో సుమారు 536 ఎకరాల్లో కియా ప్లాంటు ఏర్పాటైంది. వార్షికంగా దీని ఉత్పత్తి సామర్థ్యం 3 లక్షల కార్లు కాగా, భవిష్యత్‌లో 7 లక్షల యూనిట్లకు కియా పెంచుకోనుంది. హైబ్రిడ్, ఎలక్ట్రిక్ వాహనాలను కూడా తయారుచేసేలా ఈ ప్లాంటును ఏర్పాటు చేశారు. ఈ ఏడాది జనవరిలో కియా మోటార్స్ ట్రయల్ ఉత్పత్తి ప్రారంభించింది. రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అత్యాధునిక టెక్నాలజీలను ఈ ప్లాంటులో వినియోగిస్తోంది.



### సెల్టోస్ ప్రత్యేకతలివీ ..

మధ్య స్థాయి స్పోర్ట్స్ యుటిలిటీ వాహనాల కోవకి చెందినది కియా సెల్టోస్. కొత్తగా ప్రకటించిన బీఎస్6 కాలుష్య ప్రమాణాలకు అనుగుణంగా సెల్టోస్ కార్లు ఉంటాయని కంపెనీ వెల్లడించింది. 1.5 పెట్రోల్, 1.5 డీజిల్, ఈ విభాగంలో తొలి సారిగా 1.4 టర్బో పెట్రోల్ వేరియంట్స్‌లో కారు లభిస్తుంది. వాహనదారుల అవసరాలు, అభిరుచులకు అనుగుణంగా 3 ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ వేరియంట్స్ లోను, 6 స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ వేరియంట్‌లలోనూ సెల్టోస్ లభిస్తుంది.

## సంపూర్ణ సహకారం

- వైజాగ్–చెన్నై–బెంగళూరు పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు
- ఆర్టీసీలో క్రమంగా అన్నీ ఎలక్ట్రిక్ బస్సులు
- సెల్టోస్ ఆవిష్కరణ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ సందేశం

ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు అపార అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన సదుపాయాలతో పాటు రాయితీలు కల్పిస్తామని ఆయన హామీనిచ్చారు. దివంగత నేత, తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చొరవతో కియా కార్ల పరిశ్రమ ఏర్పాటు జరిగిందని పేర్కొన్నారు. అయితే, అనివార్య కారణాల వల్ల హాజరుకాలేకపోతున్నానని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ద్వారా పంపిన సందేశంలో జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. వాస్తవానికి కియా సెల్టోస్‌ను మార్కెట్లో విడుదల చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్వయంగా రావాలని భావించినప్పటికీ.. ఢిల్లీలో పరిణామాలతో పాటు గోదావరి వరద ముంపు ప్రాంతాలను పరిశీలించే పని ఉండటంతో హాజరుకాలేకపోయారని ఆర్థిక మంత్రి బుగ్గన తెలిపారు.

**పారిశ్రామిక కారిడార్‌ల ఏర్పాటు..**

''ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు అపార అవకాశాలు ఉన్నాయి. అదేవిధంగా రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు, పరిశ్రమలకు కావాల్సిన అన్ని సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. తద్వారా రాష్ట్రంలోని యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయనేది ప్రభుత్వ ఆకాంక్ష. వాస్తవానికి కియా మోటార్స్ ఏర్పాటు అనేది దివంగత నేత, మా నాన్న వైఎస్ రాజశేఖరరెడ్డికి 2007లో హ్యుందాయ్ మోటార్స్ సంస్థ ఇచ్చిన హామీ. అందుకు అనుగుణంగా రాష్ట్రంలో కార్ల తయారీ యూనిట్‌ను కియా ఏర్పాటు చేసింది. అందువల్ల వ్యక్తిగతంగా హాజరుకావాలని భావించాను. అయితే, అనివార్య కారణాల వల్ల రాలేకపోతున్నాను. సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని హామీనిస్తున్నాను. కియా ఏర్పాటు వల్ల ఇక్కడ ఆటోమొబైల్ రంగంతో పాటు విడిభాగాల తయారీ యూనిట్లను నెలకొల్పేందుకు అనేక సంస్థలు ముందుకు వస్తున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నాయి. విశాఖపట్నం–చెన్నై, చెన్నై–బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌ల ఏర్పాటు వల్ల పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయి. ఈ కారిడార్‌ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోంది'' అని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తన సందేశంలో పేర్కొన్నారు.

**ఆటోమొబైల్‌కు అనుకూలం..**

''అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, వైఎస్సార్ కడప జిల్లాలో ఆటోమొబైల్ పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం ఎక్కువగా ఉంది. ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుంది'' అని జగన్ తెలిపారు. ఇక రాష్ట్రంలో ఆర్టీసీలో ప్రస్తుతమున్న బస్సుల స్థానంలో క్రమంగా ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడతామని ప్రకటించారు. కియాకు ఏపీఐఐసీ మరో 143 ఎకరాల స్థలం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ఏపీఐఐసీ చైర్మన్ రోజా తెలిపారు. పరిశ్రమల్లో స్థానికులకు కచ్చితంగా 75 శాతం ఉద్యోగాలివ్వాలంటూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన చట్టానికి అనుగుణంగా కియా మోటార్స్ కూడా స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలని ఆమె సూచించారు.



అనంతపురం ప్లాంట్‌లో కియా 'సెల్టోస్' కారును ఆవిష్కరిస్తున్న మంత్రులు, కంపెనీ ప్రతినిధులు

## షావోమీ 100 మెగాపిక్సెల్ కెమెరా ఫోన్!




హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇప్పటి వరకు స్మార్ట్‌ఫోన్లలో 48 మెగాపిక్సెల్ కెమెరాను మాత్రమే చూశాం. త్వరలో 64 ఎంపీ కెమెరాతో శాంసంగ్, షావోమీతోపాటు రియల్‌మీ స్మార్ట్‌ఫోన్లు విడుదల చేయనున్నాయి. ఇదంతా ఒక ఎత్తైతే కనీవినీ ఎరుగని రీతిలో 100 ఎంపీ కెమెరా స్మార్ట్‌ఫోన్‌కు శ్రీకారం చుట్టినట్టు షావోమీ ప్రకటించింది. శాంసంగ్ సెన్సార్‌తో ఇది రూపుదిద్దుకోనుందని సమాచారం. 108,000,000 పిక్సెల్స్, 12032X9024 రిజొల్యూషన్ ఉండనుంది. అల్ట్రా క్లియర్ కెమెరా ఆవిష్కరించనున్నట్టు షావోమీ ఇండియా హెడ్ మను కుమార్ జైన్ వెల్లడించారు. ప్రపంచంలో ఈ స్థాయి కెమెరా ఉన్న స్మార్ట్‌ఫోన్ ఇదే కానుంది. 100 ఎంపీ కెమెరా మోడల్‌ను అభివృద్ధి చేస్తున్నట్టు ఈ ఏడాది మార్చిలో లెనొవో ప్రకటించడం గమనార్హం. కాగా, 100కు బదులుగా 108 ఎంపీతో షావోమీ ఫోన్ వచ్చే అవకాశం ఉంది.

## మార్కెట్‌లోకి 'బీఎస్–సిక్స్' మారుతీ ఎర్టిగా

**ధర రూ.7,54,689**



న్యూఢిల్లీ: దేశీ ఆటోమొబైల్ దిగ్గజం మారుతీ సుజుకీ మల్టీపర్పస్ వెహికల్ 'ఎర్టిగా'లో కొత్త వెర్షన్‌ను గురువారం మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. భారత్ స్టేజ్ – సిక్స్ ప్రమాణాలతో విడుదలైన ఈ కారు పెట్రోల్ వేరియంట్ ధరను రూ.7,54,689 (ఎక్స్‌షోరూం–ఢిల్లీ)గా నిర్ణయించింది. బీఎస్–సిక్స్ నిబంధనలకు అనుగుణంగా తన పోర్టిఫోలియోలో విడుదలైన ఆరవ కారుగా ఎర్టిగా నిలిచినట్లు కంపెనీ తెలిపింది. ఇంతకుముందు ఆల్టో, వాగన్‌ఆర్, స్విఫ్ట్, బాలెనో, డిజైర్ కార్లు ఈ ప్రమాణాలతో విడుదలయ్యాయి. నూతన నిబంధనల గడువు తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో తాజాగా ఎర్టిగాను ఇందుకు అనుగుణంగా మార్కెట్లోకి విడుదల చేశామని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శశాంక్ శ్రీవాస్తవ వెల్లడించారు.

**ప్రాఫిట్ ప్లస్ | డైలీ**

## ఇండియాఫస్ట్ లైఫ్ 'స్మార్ట్ పే' ప్లాన్

ముంబై: బీమా సంస్థ ఇండియాఫస్ట్ లైఫ్ ఇన్సూరెన్స్ కొత్తగా 'స్మార్ట్ పే ప్లాన్' పేరిట మనీ బ్యాక్ పాలసీని ఆవిష్కరించింది. పరిమిత కాలం ప్రీమియం చెల్లింపులు, ఒకవేళ ఏదైనా ఒకసారి ప్రీమియం కట్టకపోయినా జీవిత బీమా కవరేజీ కొనసాగింపు తదితర ప్రత్యేకతలు ఇందులో ఉన్నాయి. కాలావధి తీరిన తర్వాత పాలసీదారుకు మెచ్యూరిటీ మొత్తంతో పాటు అప్పటిదాకా జమయిన బోనస్ కూడా చెల్లించేలా ఈ పాలసీని రూపొందింది. ఒకవేళ పాలసీదారు మరణించినా, ప్రమాదవశాత్తూ శాశ్వత వైకల్యం లేదా తీవ్ర అనారోగ్యాల బారిన పడినా తదుపరి ప్రీమియంలు చెల్లించనక్కర్లేకుండా వెయివర్ ఆఫ్ ప్రీమియం రైడరును కూడా పాలసీకి చేర్చుకోవచ్చని సంస్థ తెలిపింది. బ్యాంక్ ఆఫ్ బరోడా, ఆంధ్రా బ్యాంకు సంయుక్తంగా 'ఇండియా ఫస్ట్ లైఫ్'ను ప్రమోట్ చేస్తున్నాయి.

## బీఎస్‌ఎన్‌ఎల్ భూములు

# ప్రత్యేక సంస్థకు బదిలీ



- రుణాలు కూడా బదలాయింపు
- ప్రతిపాదనపై కేంద్రం కసరత్తు
- అసెట్స్ విలువ తగ్గించేస్తున్నారని యూనియన్ ఆరోపణ

న్యూఢిల్లీ: నష్టాలు, రుణభారంతో కుదేలవుతున్న ప్రభుత్వ రంగ టెలికం దిగ్గజం బీఎస్‌ఎన్‌ఎల్‌ను గాడిన పెట్టేందుకు కేంద్రం కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్‌పీవీ) ఏర్పాటు చేసి బీఎస్‌ఎన్‌ఎల్‌కి ఉన్న రుణాలు, స్థలాలను దానికి బదలాయించే ప్రతిపాదన పరిశీలిస్తోంది. స్థలాల విక్రయం ద్వారా వచ్చే నిధులతో బీఎస్‌ఎన్‌ఎల్‌కి ఉన్న దాదాపు రూ. 15,000 కోట్ల రుణాలను తీర్చేయొచ్చని, తద్వారా కంపెనీని రుణరహిత సంస్థగా మార్చవచ్చని భావిస్తోంది. అయితే, బీఎస్‌ఎన్‌ఎల్ భూముల విలువను చాలా తక్కువగా చూపే ప్రయత్నం జరుగుతోందని ఉద్యోగుల సంఘం ఆరోపించింది. పెద్ద నగరాల్లోని కీలక ప్రాంతాల్లో ఉన్న ఈ స్థలాల విలువ చాలా ఎక్కువగా ఉంటుందని, కానీ వీటి వేల్యుయేషన్‌ను అతి తక్కువగా లెక్కించేందుకు కసరత్తు జరుగుతోందని పేర్కొంది. మరోవైపు, ఈ ఆరోపణలన్నీ నిరాధారమైనవని బీఎస్‌ఎన్‌ఎల్ సీఎండీ పి.కె. పుర్వార్ కొట్టి పారేశారు. 'కేవలం క్యాబినెట్ నోట్ రూపొందించే ఉద్దేశంతో సూత్రప్రాయంగా విలువ లెక్కించడం జరిగింది. ప్రభుత్వం వద్ద రిజిస్టర్ అయిన వేల్యుయర్ తుది వేల్యుయేషన్ లెక్కిస్తారు. పైగా బీఎస్‌ఎన్‌ఎల్ తరహాలోనే ఎస్‌పీవీలో కూడా 100 శాతం వాటాలు కేంద్ర ప్రభుత్వానికే ఉంటాయి, అని ఆయన చెప్పారు. కార్పొరేట్లకు కారుచౌకగా బీఎస్‌ఎన్‌ఎల్ భూములు కట్టబెట్టే ప్రయత్నం జరుగుతోందని టెలికం శాఖ కార్యదర్శికి బీఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగుల యూనియన్ లేఖ రాసింది.

## భారత్‌లో 'టిఫనీ' బ్రాండ్..!

రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో భాగస్వామ్యం




న్యూఢిల్లీ: ప్రముఖ అమెరికన్ జ్యుయలరీ సంస్థ టిఫనీ అండ్ కో భారత మార్కెట్లోకి ప్రవేశించనుంది. ముఖేష్ అంబానీ సారథ్యంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ భాగస్వామ్యంతో ఈ ఏడాదిలోనే తొలుత దేశ రాజధాని ఢిల్లీలో స్టోర్‌ను ఏర్పాటుచేయనుంది. వచ్చే ఏడాదిలో ముంబైలో రెండవ స్టోర్ ఏర్పాటుచేయాలని భావిస్తోంది. ఈ అంశానికి సంబంధించి రిలయన్స్ బ్రాండ్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దర్శన్ మెహతా మాట్లాడుతూ.. 'టిఫనీ ప్రఖ్యాత ఆభరణాలు, అత్యుత్తమ వజ్రాభరణాలను భారత మార్కెట్లో పరిచయం చేయాలని భావిస్తున్నాం' అని వ్యాఖ్యానించారు. ప్రపంచవ్యాప్తంగా 25 దేశాల్లో 320 స్టోర్లను టిఫనీ నిర్వహిస్తోంది. మొత్తం 14 ఈ–కామర్స్ వెబ్‌సైట్ల ద్వారా విక్రయాలను కొనసాగిస్తోంది.

## పసిడి కొత్త రికార్డు

10 గ్రాముల ధర రూ.38,470కి అప్



న్యూఢిల్లీ: దేశీయ స్పాట్ మార్కెట్లలో పసిడి గురువారం సరికొత్త రికార్డులను నెలకొల్పింది. న్యూఢిల్లీలో 99.9 స్వచ్ఛత, 99.5 స్వచ్ఛత 10 గ్రాముల ధరలు రూ.550 చొప్పున పెరిగి, వరుసగా రూ.38,470, రూ.38,300గా నమోదయ్యా యి. అంతర్జాతీయంగా పసిడి ఔన్స్ (31.1గ్రా) ధరలు బుధవారం ఆరేళ్ల గరిష్టస్థాయి(1,522 డాలర్లు)ని తాకడం తెలిసిందే డాలర్ మారకంలో రూపాయి బలహీన ధోరణి కూడా పసిడికి కలిసివస్తోంది. గురువారం 20 పైసలు బలపడినా... రూపాయి గడచిన ఐదు ట్రేడింగ్ సెషన్లలో 100పైసలకు పైగా నష్టపోవడం గమనార్హం. అమెరికా–చైనా వాణిజ్య యుద్ధం, అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి, ఈక్విటీ మార్కెట్ల బలహీనధోరణి, వివిధ దేశాల సెంట్రల్ బ్యాంకులు కూడా పసిడిని కొనుగోలు చేస్తుండడం వంటి అంశాలు ఈ యల్లోమెటల్‌కు కలిసివస్తోంది.

# రూ.లక్ష కోట్ల ఉద్దీపనలు కావాలి

- అప్పుడే పెట్టుబడులు, వృద్ధి పుంజుకుంటాయి
- కేంద్ర ప్రభుత్వానికి పారిశ్రామిక వేత్తల సూచన



పారిశ్రామిక రంగ ప్రతినిధులతో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమావేశం

న్యూఢిల్లీ: పెట్టుబడుల క్రమాన్ని వేగవంతం చేసేందుకు, క్షీణిస్తున్న ఆర్థిక రంగ వృద్ధి పునరుత్తేజానికి రూ.లక్ష కోట్లకు పైగా ఉద్దీపనలు అవసరమని దేశీయ పరిశ్రమల సంఘాలు కేంద్ర ప్రభుత్వానికి సూచించాయి. త్వరలోనే ఆర్థిక వృద్ధికి చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హామీనిచ్చినట్టు పారిశ్రామిక వేత్తలు సమావేశం అనంతరం మీడియాకు తెలిపారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం ఢిల్లీలో నిర్వహించిన సమావేశానికి పలువురు పారిశ్రామికవేత్తలు, పరిశ్రమల సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. మూడు గంటల పాటు ఈ భేటీ జరిగింది. దేశీయంగా, అంతర్జాతీయంగా ప్రస్తుత మందగమన వాతావరణంలో వెంటనే పరిష్కారాలు అవసరమని అసోచామ్ ప్రెసిడెంట్ బీకే గోయంకా పేర్కొన్నారు. ''ఉద్దీపనల ప్యాకేజీ ద్వారా ఆర్థిక రంగానికి సత్వర పరిష్కారం కావాలి. రూ.లక్ష కోట్లకు పైగా ప్యాకేజీని మేము సూచించాం'' అని గోయంకా తెలిపారు. కుంగిన ఆర్థిక వ్యవస్థకు ఉత్తేజాన్ని తీసుకొచ్చేందుకు, ఇబ్బందికర అంశాలపై మంత్రి నిర్మలా సీతారామన్, ఆర్థిక శాఖ అధికారులు పరిశ్రమల నేతలతో చర్చించారు. పరిశ్రమల పునరుత్తేజానికి అతి త్వరలోనే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు, ఆర్థిక శాఖ నుంచి సానుకూల అభిప్రాయాలు వచ్చినట్టు జేఎస్‌డబ్ల్యూ గ్రూపు చైర్మన్ సజ్జన్ జిందాల్ తెలిపారు. స్టీల్, ఎన్‌బీఎఫ్‌సీ, వాహన రంగాలు సమస్యలు ఎదుర్కొంటున్నాయని చెప్పిన ఆయన వీలైనంత త్వరలోనే పరిష్కారం చూపిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినట్టు చెప్పారు.

### లిక్విడిటీ సమస్య లేదు...

పరిశ్రమలకు రుణాలిచ్చే విషయంలో బ్యాంకులు పునరాలోచిస్తున్న విషయం సహా పలు అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్టు పిరమల్ ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్ అజయ్ పిరమల్ తెలిపారు. ''బ్యాంకుల్లో లిక్విడిటీ లేకపోవడం కాదు, కానీ రుణ వితరణే జరగడం లేదు. ఆర్థిక రంగంలో ఎన్‌బీఎఫ్‌సీ పరంగా సమస్య నెలకొని ఉంది'' అని సమావేశం అనంతరం మీడియాతో అజయ్ పిరమల్ వెల్లడించారు. ఎన్‌బీఎఫ్‌సీ రంగ సమస్యలు ఆటోమొబైల్, హోమ్‌లోన్, ఎంఎస్‌ఎంఈలపైనా ప్రభావం చూపిస్తున్నట్టు చెప్పారు. త్వరలోనే చర్యలు ఉంటాయని ప్రభుత్వం తెలిపిందని, వాటి కోసం తాము ఎదురు చూస్తున్నామని పేర్కొన్నారు. సీఎస్‌ఆర్ విషయంలో ఎటువంటి శిక్షాత్మక చర్యలు ఉండకూడదని ప్రభుత్వానికి స్పష్టం చేసినట్టు అజయ్ పిరమల్ వెల్లడించారు. దేశ ఆర్థిక రంగ వృద్ధి పునరుద్ధరణకు అవసరమైన తదుపరి ఉద్దీపనల విషయంలో ప్రభుత్వం తమ అభిప్రాయాలను కోరినట్టు సీఐఐ వైస్ ప్రెసిడెంట్ టీవీ నరేంద్రన్ తెలిపారు. సమావేశంలో ఎన్నో అంశాలు చర్చించినట్టు పేర్కొన్నారు. ఆటోమొబైల్ రంగంలో మాంద్యం స్టీల్ రంగం పైనా ప్రభావం చూపుతోందన్నారు. సెంట్రల్ బ్యాంకు రేట్ల కోతను బ్యాంకులు వినియోగదారులకు బదలాయించడం అతిపెద్ద అంశమని ఫిక్కీ ప్రెసిడెంట్ సందీప్ సోమాని అభిప్రాయపడ్డారు. ''రేట్ల తగ్గింపు ప్రయోజనాన్ని బ్యాంకులు తప్పనిసరిగా వినియోగదారులు, రుణ గ్రహీతలకు బదలాయించాలి. తదుపరి రేట్ల కోతపైనా ఆశావహంగా ఉన్నాం. ఆర్‌బీఐ ఇప్పటి వరకు 110 బేసిస్ పాయింట్లు తగ్గించడం ఉత్సాహాన్నిచ్చేదే'' అని సోమాని తెలిపారు.

## రూపాయి... 5రోజుల నష్టాలకు బ్రేక్



ముంబై: ఐదురోజులుగా డాలర్ మారకంలో బలహీనపడుతూ వచ్చిన రూపాయి విలువ గురువారం కొంచెం కోలుకుంది. ఇంటర్ బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్‌లో 20 పైసలు లాభంతో 70.69 వద్ద ముగిసింది. విదేశీ ఇన్వెస్టర్లకు సంబంధించి సూపర్ రిచ్ పన్నును కేంద్రం ఉపసంహరించుకోనున్నదనే వార్తలతో ఈక్విటీ మార్కెట్ల భారీ పరుగు రూపాయికి కలిసివచ్చింది. 70.80 వద్ద ప్రారంభమైన రూపాయి ఒకదశలో 70.55 గరిష్టాన్ని చూసింది. ఒక దశలో 70.94కు కూడా పడిపోయింది. గడచిన మూడు రోజుల్లో క్రూడ్ ఆయిల్ ధరలు కూడా బ్యారల్‌కు ఐదుడాలర్లకు పైగా క్షీణించడం గమనార్హం. అక్టోబర్ 9వ తేదీన రూపాయి చరిత్రాత్మక కనిష్ట స్థాయి 74.39 వద్ద ముగిసిన సంగతి తెలిసిందే.

## పొలం గట్లపై కలెక్టర్ దంపతులు



ఖమ్మం జిల్లా కలెక్టర్ ఆర్వీ. కర్ణన్, ఆయన భార్య, జెడ్పీ సీఈవో ప్రియాంకతో కలసి పొలం గట్లపై కలియ తిరిగారు. కామేపల్లి మండలం పొన్నెకల్లు–నెమలిపురి మధ్యలో ఉన్న బుగ్గవాగు చెక్ డ్యాం ఫీడర్ చానల్ నుంచి ఎడమ కాలువ నిర్మాణ పనులు పరిశీలించారు. కట్టు కాలువ చూసేందుకు దారి లేకపోవడంతో పొలం గట్లపై ఇద్దరూ కలసి గంటసేపు నడిచి వెళ్లారు. – కామేపల్లి

# 22 లక్షల ఎకరాల అసైన్డ్ భూమి

**సాక్షి, హైదరాబాద్:** పేదలకు పంపిణీ చేసిన భూములను ప్రభుత్వం గుర్తించింది. అసైన్డ్ భూముల వివరాలను సేకరించింది. రాష్ట్రవ్యాప్తంగా 22.52 లక్షల ఎకరాల మేర అసైన్డ్ భూములున్నట్లు లెక్క తేల్చింది. రెవెన్యూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా క్షేత్రస్థాయిలో సర్వే చేసిన రెవెన్యూ యంత్రాంగం.. ప్రభుత్వ భూముల సమాచారాన్ని కూడా సమీకరించింది. రాష్ట్ర వ్యాప్తంగా 1.89 కోట్ల సర్వే నంబర్లలో అసైన్డ్ భూములున్నట్లు నిగ్గు తేల్చిన సర్కార్.. ఇందులో 1.78 కోట్ల సర్వే నంబర్లలో ఉన్న భూముల వివరాలను ఇప్పటివరకు సేకరించింది. ఇందులో 13.60 లక్షల సర్వే నంబర్లలోని భూములకు సంబంధించి డిజిటల్ సంతకాలు కూడా పూర్తయ్యాయి. రెండేళ్ల క్రితం భూ రికార్డుల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టిన సర్కారు.. వ్యవసాయ భూముల వివరాలను సేకరించింది. క్షేత్రస్థాయిలో భూముల సమాచారాన్ని రాబట్టి.. కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలను జారీ చేసింది. ఈ క్రమంలోనే అసైన్డ్, ఇతర ప్రభుత్వ భూములను కూడా లెక్కగట్టింది. అయితే, ఈ సర్వేలో అవినీతి డొంక కదిలింది. నకిలీ పాస్ పుస్తకాల జారీతో అసైన్డ్ భూముల చిట్టా వెలుగులోకి వచ్చింది.




# ‘కృష్ణా’లో సాగుకు సందడే

- 14 లక్షల ఎకరాల ఆయకట్టుకు షెడ్యూల్ ప్రకారం నీటి విడుదల
- తాగు, సాగునీటి అవసరాలపై భేటీలో శివమ్ కమిటీ నిర్ణయం
- సాగర్ కింది ఆయకట్టుకు ఈ నెలాఖరు నుంచి నీటి సరఫరా

**సాక్షి, హైదరాబాద్:** కృష్ణా బేసిన్‌లోని ప్రధాన జలాశయాల్లో నీటి లభ్యత పెరుగుతుండటం, ఎగువ నుంచి భారీ ప్రవాహాలు కొనసాగుతుండటంతో ఈ నీటిపై ఆధారపడ్డ ప్రాజెక్టుల కింది ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరు విడుదల చేయాలని రాష్ట్ర సాగునీటి సమీకృత, నీటి నిర్వహణ, ప్రణాళిక స్టాండింగ్ కమిటీ (శివమ్) నిర్ణయించింది. జూరాల, శ్రీశైలం, నాగార్జున సాగర్‌లకు చెప్పుకోదగ్గ స్థాయిలో ప్రవాహాలు ఉన్న దృష్ట్యా, ఖరీఫ్ ఆయకట్టుకు నీటి విడుదలపై కార్యాచరణ రూపొందించుకోవాలని స్పష్టం చేసింది. ప్రాజెక్టుల్లో లభ్యతగా ఉన్న నీటిలో తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇస్తూనే ఖరీఫ్ సాగుకు పూర్తిస్థాయిలో నీరు అందించాలని నిర్ణయించింది. మొత్తంగా సాగర్ సహా ఇతర భారీ ఎత్తిపోతల పథకాల కింద 14 లక్షల ఎకరాలకు నీరు ఇచ్చేందుకు ఓకే చెప్పింది. రాష్ట్రంలో భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల పరిధిలో నీటి లభ్యత, వినియోగం, తాగు, సాగునీటి అవసరాలపై చర్చించేందుకు గురువారం నీటిపారుదలశాఖ శివమ్ కమిటీ హైదరాబాద్‌లోని జలసౌధలో ప్రత్యేకంగా భేటీ అయింది. సమావేశంలో ఈఎన్సీలు మురళీధర్, నాగేంద్రరావు, అనిల్‌కుమార్‌ల తోపాటు సీఈలు నరసింహ, ఖగేందర్, శంకర్, శ్రీనివాస్‌రెడ్డి, ఇతర ఇంజనీర్లు పాల్గొన్నారు. మిషన్ భగీరథ కింద తాగునీటి అవసరాలు, కనీస నీటి మట్టాలకు ఎగువన ఉండే లభ్యత జలాల లెక్కలపై భేటీలో ప్రధానంగా చర్చించారు. ప్రభుత్వం మిషన్ భగీరథ కింద తాగునీటికి ప్రాధాన్యత ఇస్తున్న దృష్ట్యా ఆ అవసరాల మేరకు ప్రాజెక్టుల పరిధిలో కనీస నీటిమట్టాలను నిర్వహించాల్సిందేనని ఈఎన్సీలు స్పష్టం చేశారు. భగీరథకు కృష్ణా, గోదావరి బేసిన్‌లలో 60 టీఎంసీల అవసరం ఉంటుందని, వాటిని పక్కన పెట్టాకే ఖరీఫ్ ఆయకట్టు అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. నాగార్జున సాగర్ కింద 6.34 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరివ్వాలంటే 50 టీఎంసీలు అవసరమని ప్రాజెక్టు అధికారులు కమిటీకి వివరించారు. ప్రస్తుతం శ్రీశైలం, సాగర్‌లలో లభ్యతగా ఉన్న నీటిలో తెలంగాణకు దక్కే వాటాలోంచే ఈ నీటిని ఇవ్వాలని కోరగా కమిటీ అందుకు అంగీకరించినట్లు తెలిసింది. ఆగస్టు చివరి వారం నుంచి పంటలకు నీటి విడుదల చేయాలని నిర్ణయించింది. దీంతోపాటే జూరాల కింద లక్ష ఎకరాలు, జూరాలపై ఆధారపడ్డ నెట్టెంపాడుకు లక్ష, భీమాకు 1.70 లక్షలు, కోయిల్ సాగర్‌కు 35 వేల ఎకరాలకు నీరందించడంతోపాటు ఆర్డీఎస్ ద్వారా 30 వేల ఎకరాలు, శ్రీశైలంపై ఆధారపడ్డ కల్వకుర్తికి 34 టీఎంసీలతో 3.50 లక్షల ఎకరాలకు నీరు అందించాలని కమిటీ భేటీలో నిర్ణయించారు.

### గోదావరిలో వేచిచూద్దాం..

ఎస్సారెస్పీలో చేరే నీటిని బట్టి ఆయకట్టుకు నీటి విడుదలపై నిర్ణయం తీసుకోవాలని భేటీలో నిశ్చయించారు. మొత్తంగా 9.6 లక్షల ఎకరాలకు నీరు ఇవ్వాల్సి ఉండగా ప్రస్తుతం 12 టీఎంసీల నిల్వలే ఉన్నాయి. దీంతో మరింత వరద వస్తేనే ఆయకట్టుకు నీటి విడుదలపై నిర్ణయం తీసుకోనున్నారు. కడెం కింద 50 వేల ఎకరాలకు నీరివ్వాలని, కొమురం భీం, సత్నాల వంటి మధ్యతరహా ప్రాజెక్టుల కింద నిర్ణీత ఆయకట్టు కోసం నీటి విడుదలకు కమిటీ ఓకే చెప్పింది. సింగూరు, నిజాంసాగర్ ప్రాజెక్టుల్లోకి నీటిప్రవాహాలు లేకపోవడంపైనా చర్చ జరిగింది. సింగూరులో 29.9 టీఎంసీల నిల్వలకు ప్రస్తుతం 0.43 టీఎంసీ నిల్వ ఉంది. సింగూరు నుంచి మిషన్‌భగీరథకు 5.7 టీఎంసీలు అవసరముండగా తాగేందుకు నీరు లేదు. ప్రాజెక్టుల్లోకి భగీరథకు అవసరమైన నీరొచ్చే వరకు ప్రాజెక్టు కింది 40 వేల ఎకరాలకు నీరిచ్చే అవకాశం లేదని తేల్చింది. సింగూరు దిగువన ఉన్న ఘన్‌పూర్ ఆయకట్టుకు 40 వేల ఎకరాలకు నీరు ఇవ్వడం కష్టమని కమిటీ అభిప్రాయపడింది. నిజాంసాగర్ సైతం ప్రస్తుతం 17 టీఎంసీలకు 0.13 టీఎంసీ నిల్వతో ఎండిపోయి కనిపిస్తోంది. దీనికింద 2.08 లక్షల ఆయకట్టుకు 22 టీఎంసీల అవసరముండగా లభ్యత నీరు లేకపోవడంతో ఖరీఫ్‌కు నీరివ్వలేమని తేల్చింది.




## నేడు, రేపు రాష్ట్రంలో మోస్తరు వర్షాలు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో నేడు, రేపు కొన్ని చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఒకట్రెండు చోట్ల భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఉత్తర ఛత్తీస్‌గఢ్ దాని పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న వాయుగుండం గురువారం ఈశాన్య మధ్యప్రదేశ్ పరిసర ప్రాంతాలకు 75 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉందని, రాగల 48 గంటలలో ఇది పశ్చిమ వాయవ్య దిశగా ప్రయాణించి క్రమంగా బలహీనపడి తీవ్ర అల్పపీడనంగా మారే అవకాశం ఉందని తెలిపింది. రాష్ట్రంలోని భూపాలపల్లి, నిజామాబాద్, కామారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదైనట్లు పేర్కొంది.

## కరీంనగర్‌లో ఆర్మీ రిక్రూట్‌మెంటు ర్యాలీ

- అక్టోబర్ 7 నుంచి 17 వరకు..
- ఈ నెల 23 నుంచి సెప్టెంబర్ 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

**సాక్షి ప్రతినిధి, కరీంనగర్:** రాష్ట్రానికి సంబంధించి ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ కరీంనగర్‌లో జరగనుంది. అక్టోబర్ 7నుంచి 17 వరకు జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియంలో రిక్రూట్‌మెంట్ ర్యాలీ జరగనుంది. 10 రోజుల పాటు సాగే ఈ ర్యాలీలో 33 జిల్లాలకు చెందిన ఔత్సాహికులైన యువత పాల్గొనవచ్చని కరీంనగర్ జిల్లా కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ తెలిపారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లో కల్నల్ పవన్‌పూరితో కలసి మీడియాతో మాట్లాడారు. ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో పాల్గొనేందుకు www.joinindianarmy.nic.in వెబ్‌సైట్‌లో ఈనెల 23 నుంచి సెప్టెంబర్ 22 వరకు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఆర్మీలో తెలంగాణ నుంచి తక్కువ సంఖ్యలో ఉన్నారని, ఒక్కో ఏడాది ఒక్కో జిల్లాలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈసారి నిర్వహించే ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో 5 కేటగిరీల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పదోతరగతి ఉత్తీర్ణతతో సోల్జర్ జనరల్ డ్యూటీ, సైన్స్ సబ్జెక్ట్‌తో ఇంటర్మీడియెట్ తత్సమాన 10+2 తో సోల్జర్ టెక్నికల్, సోల్జర్ టెక్నికల్ నర్సింగ్ అసిస్టెంట్, సోల్జర్ క్లర్క్, ఇంటర్ మీడియట్, డీఫార్మాతో సిపాయి ఫార్మా ఉద్యోగాలకు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హత సాధించిన వారికి ఆర్మీ రిక్రూట్‌మెంట్ సికింద్రాబాద్ కార్యాలయం రాత పరీక్ష నిర్వహించి అర్హులను ఎంపిక చేయనుంది.



నాలుగో మోటారు టెస్టింగ్‌లో ఎత్తిపోస్తున్న వరద నీరు

ఒక మోటారు.. రెండు పైపులు..




# గోలివాడ నాలుగో మోటార్ వెట్‌రన్

**రామగుండం:** కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం గోలివాడ వద్ద నిర్మించిన సుందిళ్ల పంపుహౌస్‌లో నాలుగో మోటార్‌కు గురువారం వెట్‌రన్ విజయవంతంగా నిర్వహించారు. జూలై 31వ తేదీన రాత్రి తొలిసారిగా ఒకటో మోటార్‌కు అధికారులు వెట్‌రన్ నిర్వహించారు. పంపుహౌస్‌లో మొత్తం తొమ్మిది మోటార్లకుగాను ఆరు మోటార్లు వెట్‌రన్‌కు సిద్ధంగా ఉన్నాయని నీటిపారుదల శాఖ ఈఈ విష్ణుప్రసాద్ తెలిపారు. మరో రెండు మోటార్లకు ఒకట్రెండు రోజుల్లో వెట్‌రన్ నిర్వహిస్తామని తెలిపారు. ఇదిలా ఉండగా సుందిళ్ల పంపుహౌస్‌లో ఒక్కో మోటారు నుంచి రెండు పైపుల ద్వారా నీరు బయటకు వస్తుంది. దీంతో ఒక మోటారు వెట్‌రన్ చేస్తే డెలివరీ సిస్టమ్ వద్ద రెండు పైపుల నుంచి వరద నీరు ఎత్తిపోస్తుందని ఇంజనీరు స్పష్టం చేశారు. ఈ విధానంతో ఒకే పైపుపై నీటి ఒత్తిడి పడకుండా రెండు పైపులుగా విడదీసి డెలివరీ సిస్టమ్‌కు వేయడం కేవలం సుందిళ్ల పంపుహౌస్‌లోనే అమలు చేసినట్లు తెలిపారు.




# 16 నుంచి ఉచిత చేప పిల్లల పంపిణీ

- కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి ప్రారంభం
- మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ వెల్లడి

**సాక్షి, హైదరాబాద్:** ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 16న భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి లాంఛనంగా ప్రారంభించనున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ వెల్లడించారు. ఈ మేరకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయంలో పశుసంవర్ధకశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, మత్స్యశాఖ కమిషనర్ సువర్ణ, ఇతర అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో 24 వేల నీటి వనరుల్లో 80 కోట్ల చేపపిల్లలను విడుదల చేస్తామన్నారు. టెండర్లు పూర్తిచేసి 16లోగా అన్ని జిల్లాల్లో తప్పని సరిగా చేపపిల్లల విడుదల కార్యక్రమాన్ని చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర ప్రజాప్రతినిధులు, మత్స్యకారులను తప్పనిసరిగా భాగస్వాములను చేయాలని తెలిపారు. నిబంధనల మేరకు ఉన్న చేపపిల్లలను మాత్రమే నీటి వనరులలో విడుదల చేయాలని, వాటిని వీడియో చిత్రీకరణ నిర్వహించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఎవరినీ ఉపేక్షించబోమని హెచ్చరించారు.

Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792